


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50 సంపుటి: 16 సంచిక: 114

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



6లో

సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎస్వీ భట్టి చేత ప్రమాణస్వీకారం చేయిస్తున్న సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్



లక్ష్మీనారాయణ సుజన అనిల్

- కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు
- వారి పేర్లకు గతంలోనే ఆమోదం తెలిపిన గవర్నర్, సీఎం -10లో

హైకోర్టుకు మరో ముగ్గురు జడ్జీలు

మామా.. మేమొస్తున్నాం

చంద్రయాన్-3 దిగ్విజయం

ముచ్చటగా మూడోసారి విజయవంతం

సూటిగా కక్ష్యలోకి చేరిన చంద్రయాన్-3	చంద్రుని చేరే దిశగా కీలక ముందడుగు..

- ఇస్రో కీర్తికిరీటంలో మరో కలికితురాయి
- ఆగస్టు 23న చంద్రుడిపై దిగనున్న ల్యాండర్, రోవర్
- ఆ తర్వాత చంద్రుడిపై కీలక పరిశోధనలు
- ఫలించిన శాస్త్రవేత్తల కృషి, దేశమంతా సంబరాలు
- రాష్ట్రపతి, ప్రధాని తదితరుల ప్రశంసలు



➤ యావత్ దేశం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన తరుణం రానే వచ్చింది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ పదేళ్ల కల నెరవేరింది. చంద్రయాన్-1, 2 ప్రయోగాలు నిరాశ పరిచినా శాస్త్రవేత్తల నిరంతర కష్టం ఎట్టకేలకు ఫలించింది. ముచ్చటగా మూడోసారి చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతమైంది. మూడు దశల ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ చంద్రయాన్-3 త్రీ-ఇన్-వన్ మిషన్‌ను విజయవంతంగా రోదసి చేర్చి కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. దాంతో ఇస్రో శాస్త్రవేత్తల్లో ఆనందం వెల్లివిరిసింది. దేశమంతా సంబరాల్లో మునిగిపోయింది. రాష్ట్రపతి, ప్రధాని సహా రాజకీయ ప్రముఖులంతా ఇస్రోను, శాస్త్రవేత్తలను అభినందించారు. - 6లో

చంద్రబాబు మిత్రుడు,
సింగపూర్ మంత్రి ఈశ్వరన్ అరెస్టు
బెయిల్‌పై విడుదల
- 6లో

క్లుప్తంగా...

రాజకీయ సన్యాసమైనా తీసుకుంటా..
కానీ బీఆర్‌ఎస్‌లో చేరను
ఎమ్మెల్యే రాజాసింగ్‌ స్పష్టీకరణ



అబిడ్స్‌/హైదరాబాద్‌: రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి టి.హరీశ్‌రావును ఆయన నివాసంలో గోషామహల్‌ ఎమ్మెల్యే రాజాసింగ్‌ కలవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. రాజాసింగ్‌ బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు సోషల్‌ మీడియాలో శుక్రవారం ప్రచారం అయ్యింది. దీనిని ఆయన సోషల్‌ మీడియా, మీడియా సమావేశాల్లో వేర్వేరుగా ఖండించారు. పార్టీ తనపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయకపోతే రాజకీయ సన్యాసం అయినా తీసుకుంటా గానీ.. బీఆర్‌ఎస్‌లో చేరబోనని స్పష్టం చేశారు. తన ప్రాణం ఉన్నంత వరకు బీజేపీలోనే ఉంటానన్నారు. తన నియోజకవర్గంలోని అభివృద్ధి పనుల కోసమే హరీశ్‌రావును కలిశానని, ధూల్‌పేట ప్రభుత్వాసుపత్రిని ఆధునీకరించి, మోడల్‌ ఆస్పత్రి చేయాలని మంత్రిని కోరానని వెల్లడించారు. మంత్రి పిలిస్తేనే వారి ఇంటికి వెళ్లి సమస్యలను వివరించానన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పిన రాజాసింగ్, హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో ఒక్కటే గ్రూపు.. కేసీఆర్‌ గ్రూపు
ఎమ్మెల్యే బానోత్‌ శంకర్‌నాయక్‌



కేసముద్రం: బీఆర్‌ఎస్‌లో గ్రూపులకు తావులేదని, ఉన్నది ఒకటే కేసీఆర్‌ గ్రూపు అని మహబూబాబాద్‌ ఎమ్మెల్యే బానోత్‌ శంకర్‌నాయక్‌ అన్నారు. కేసముద్రం మండలంలోని ఉప్పరపల్లి గ్రామ మాజీ సర్పంచ్‌ రామోజు మహేశ్వరాచారి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. శుక్రవారం ఆయన్ను ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌ పార్టీలో కొంతమంది వ్యక్తులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ..పార్టీలో ఎవరూ గ్రూపు రాజకీయాలు చేయొద్దని, అలా చేసిన వారిపై పార్టీ తప్పకుండా చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.

ప్రభుత్వ ఉద్యోగులకు పోడు పట్టాలు ఇవ్వడం ఏంటి?
వైఎస్సార్‌ తెలంగాణ పార్టీ చీఫ్‌ షర్మిల



సాక్షి, హైదరాబాద్‌: ప్రభుత్వ ఉద్యోగులకు పోడు పట్టాలు ఇవ్వడమేంటని వైఎస్సార్‌ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్‌ షర్మిల ప్రశ్నించారు. పదేళ్లుగా దొర అమలు చేసిన ప్రతి పథకం తీరిదేనని ట్విట్టర్‌ వేదికగా ఆమె మండిపడ్డారు. పేదలకు దక్కాల్సిన పథకాలన్నీ బీఆర్‌ఎస్‌ దొంగల పాలవుతున్నాయని విమర్శించారు. డబుల్‌ బెడ్‌రూం ఇళ్ల నుంచి, దళితబంధు వరకు అన్నీ అక్రమాలేనన్నారు. 9 ఏళ్లుగా ఊరించి.. ఊరించి ఇస్తున్న పోడుపట్టాలను సైతం కేసీఆర్‌ అండ్‌ కో వదిలిపెట్టడం లేదన్నారు. గిరిజనులకు దక్కాల్సిన భూముల విషయంలో అక్రమాలకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. గిరిజనులకు బదులు గిరిజనేతరులకు ఎలా పట్టాలు ఇచ్చారని ప్రశ్నించారు ఈ విషయంలో వెంటనే ఒక విచారణ కమిటీ వేసి పూర్తిస్థాయి దర్యాప్తు జరపాలని షర్మిల డిమాండ్‌ చేశారు.

చంద్రయాన్‌-3 విజయంపై గవర్నర్‌, సీఎంల హర్షం

సాక్షి, హైదరాబాద్‌: శ్రీహరికోటలోని సతీశ్‌ధావన్‌ అంతరిక్షకేంద్రం నుంచి చంద్రయాన్‌-3ని విజయవంతంగా ప్రయోగించడం పట్ల తెలంగాణ గవర్నర్‌ తమిళిసై సౌందరరాజన్‌, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు, ఆంధ్రప్రదేశ్‌ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియను విజయవంతం చేయడానికి కృషి చేసిన ఇస్రో చైర్మన్‌, శాస్త్రవేత్తలు, ఇతర సాంకేతిక సిబ్బందిని వారు అభినందించారు.

ఇదం జగత్‌



..ఢిల్లీ మీద సర్వ హక్కులు కేంద్రానికిస్తే బెటరేమో సార్‌!

సెల్ఫీ విత్‌ 'జలయజ్ఞం'



ప్రాజెక్టుల సందర్శనకు భట్టి శ్రీకారం
- మరో యాత్రకు సిద్ధమవుతున్న సీఎల్పీ నేత
- ఈ నెల 25 తర్వాత కాంగ్రెస్‌ హయాంలో నిర్మించిన ప్రాజెక్టుల సందర్శన కార్యక్రమం
- గత 60 ఏళ్లలో కాంగ్రెస్‌ ఏం చేసిందో చెప్పడమే ప్రధాన ఎజెండా
- బీఆర్‌ఎస్‌ హయాంలో వచ్చిన కొత్త ఆయకట్టును నిగ్గు తేల్చే ప్రయత్నం
- ఇందిరాసాగర్‌ నుంచి ప్రారంభం.. గోదావరి ప్రాజెక్టుల అనంతరం కృష్ణా ప్రాజెక్టుల వద్దకు

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలోని 17 జిల్లాలు, 36 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 750 గ్రామాల్లో 109 రోజుల పాటు 1,360 కిలోమీటర్ల పాదయాత్ర చేసిన కాంగ్రెస్‌ శాసనసభాపక్షం (సీఎల్పీ) నేత మల్లు భట్టి విక్రమార్క త్వరలోనే మరో రాష్ట్ర వ్యాప్త యాత్రకు శ్రీకారం చుట్టనున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 60 ఏళ్లలో కాంగ్రెస్‌ పార్టీ ఏం చేసిందన్న బీఆర్‌ఎస్‌, బీజేపీ ప్రశ్నలకు సమాధానమిచ్చే విధంగా 'సెల్ఫీ విత్‌ జలయజ్ఞం' పేరుతో ఆయన రాష్ట్రంలో కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులను సందర్శించే కార్యక్రమం చేపడతారని గాంధీభవన్‌ వర్గాల సమాచారం. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని ఇందిరాసాగర్‌ ప్రాజెక్టు నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్ర గోదావరి పరీవాహక ప్రాంతంలోని ప్రాజెక్టుల మీదుగా కృష్ణా నది మీద ఉన్న ప్రాజెక్టుల వరకు దాదాపు నెల రోజుల పాటు జరగనుంది. ఈనెల 25 తర్వాత భట్టి ఈ యాత్రకు శ్రీకారం చుట్టనున్నట్టు తెలుస్తోంది.

క్షేత్రస్థాయిలో వాస్తవాల కోసమే..
ఈ ప్రాజెక్టుల సందర్శన కార్యక్రమం ద్వారా కాంగ్రెస్‌ పార్టీ హయాంలో చేపట్టి పూర్తి చేసిన ప్రాజెక్టులు, కాంగ్రెస్‌ హయాంలో ప్రారంభమైనా తెలంగాణ ఏర్పాటయిన తర్వాత బీఆర్‌ఎస్‌ హయాంలో నిర్లక్ష్యానికి గురైన ప్రాజెక్టుల వద్దకు భట్టి వెళ్లనున్నారు. సదరు ప్రాజెక్టును ఎప్పుడు ప్రారంభించారు? ఎంత ఖర్చుతో పూర్తి చేశారు? ఎన్ని ఎకరాల ఆయకట్టు లభించింది? ఎంత మంది రైతులకు లబ్ధి చేకూరింది? అనే అంశాలను ప్రజలకు వివరించనున్నారు. స్థానిక నేతలతో కలిసి ప్రాజెక్టుల వద్దకు వెళ్లి సెల్ఫీలు దిగనున్నారు. ఇదే సమయంలో రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ అధికారంలో ఉన్న తొమ్మిదేళ్లలో కాంగ్రెస్‌ చేపట్టిన ప్రాజెక్టుల పట్ల వహించిన నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపడంతో పాటు వాస్తవంగా బీఆర్‌ఎస్‌ హయాంలో వచ్చిన కొత్త ఆయకట్టు లెక్కను నిగ్గు తేల్చడమే ఎజెండాగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్టు గాంధీభవన్‌ వర్గాలు తెలిపాయి. కాగా తన పాదయాత్ర విశేషాలను, అనుభవాలను వివరించేందుకు గాను శనివారం భట్టి గాంధీభవన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. పాదయాత్రలో తనకు ఎదురైన అనుభవాలను, రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించనున్నట్టు భట్టి 'సాక్షి'కి వెల్లడించారు.

రాష్ట్రానికి 17 మంది ఏఐసీసీ లోక్‌సభ పరిశీలకులు
ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ ఉత్తర్వులు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పార్టీని సిద్ధం చేసేందుకు రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాలకు కాంగ్రెస్‌ అధిష్టానం ఏఐసీసీ పరిశీలకులను నియమించింది. ప్రకాశ్‌ రాథోడ్‌ (ఆదిలాబాద్‌), శ్రీనివాస్‌ మానే (భువనగిరి), ఆలం ప్రభు పాటిల్‌ (చేవెళ్ల), ప్రసాద్‌ అబ్బయ్య (హైదరాబాద్‌), క్రిస్టోఫర్‌ తిలక్‌ (కరీంనగర్‌), ఆరిఫ్‌ నజీం ఖాన్‌ (ఖమ్మం), పీటీ పరమేశ్వర్‌ నాయక్‌ (మహబూబాబాద్‌), మోహన్‌ కుమార్‌ మంగళం (మహబూబ్‌నగర్‌), రిజ్వాన్‌ అర్షద్‌ (మల్కాజ్‌గిరి), బస్వరాజ్‌ మాధవ్‌రావ్‌ పాటిల్‌ (మెదక్‌), పీవీ మోహన్‌ (నాగర్‌కర్నూల్‌), అజయ్‌ ధరమ్‌సింగ్‌ (నల్లగొండ), సీడీ మెయప్పన్‌ (జహీరాబాద్‌), బీఎం నాగరాజ్‌ (నిజామాబాద్‌), విజయ్‌ నామ్‌దేవ్‌రావ్‌ వడేట్టివార్‌ (పెద్దపల్లి), మనోహరన్‌ (సికింద్రాబాద్‌), రవీంద్ర ఉత్తమ్‌రావ్‌ దల్వి (వరంగల్‌) పరిశీలకులుగా వ్యవహరిస్తారని ఏఐసీసీ నేత కేసీ వేణుగోపాల్‌ తెలిపారు.

చంద్రబాబు ఏజెంట్‌ రేవంత్‌రెడ్డి
స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌ రెడ్డి



బాన్సువాడ: రేవంత్‌రెడ్డి.. చంద్రబాబు ఏజెంటని, చంద్రబాబు డైరెక్షన్‌లో ఆయన నడుస్తున్నారని అసెంబ్లీ స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉచిత విద్యుత్‌పై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండించారు. రైతులకు 3 గంటల కరెంటు ఇవ్వాలని రేవంత్‌రెడ్డి స్పష్టంగా చెప్పారని, అయినా కాంగ్రెస్‌ నాయకులు ఆయనను ఎందుకు సమర్థిస్తున్నారో అర్థం కావడం లేదని తెలిపారు. కాంగ్రెస్‌ పార్టీ ఏ మీటింగ్‌లోనూ రేవంత్‌ మెడలో కాంగ్రెస్‌ కండువా వేసుకోలేదని, ఆయన ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీని బొందపెడతాడని ఎద్దేవా చేశారు. రైతులను భయపెట్టి భూ కబ్జాలు చేసిన వ్యక్తి రేవంత్‌రెడ్డి అయితే.. రైతుల కష్టాలు తెలిసిన వ్యక్తి కేసీఆర్‌ అని వ్యాఖ్యానించారు. కరెంట్‌ చార్జీల పెంపుదలను వ్యతిరేకిస్తూ నాటి సీఎం చంద్రబాబుకు కేసీఆర్‌ ఉత్తరం రాశారన్నారు. బషీర్‌బాగ్‌ కాల్పులకు ఆద్యుడు చంద్రబాబేనని పోచారం పేర్కొన్నారు.

ఫోన్‌ చేసి బెదిరింపులు.. దూషణలు
పోలీసులకు బీఆర్‌ఎస్‌ నగర ఇన్‌చార్జి దాసోజు శ్రవణ్‌ ఫిర్యాదు



హిమాయత్‌నగర్‌ (హైదరాబాద్‌): తనకు కొద్దిరోజులుగా కొందరు ఫోన్‌ చేస్తూ బెదిరిస్తున్నారంటూ బీఆర్‌ఎస్‌ పార్టీ హైదరాబాద్‌ జిల్లా ఇన్‌చార్జి దాసోజు శ్రవణ్‌ ఆరోపించారు. తనతో పాటు తన కుటుంబ సభ్యుల్ని సైతం ఫోన్‌లో దుర్భాషలాడుతున్నారని తెలిపారు. వారంతా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అనుచరులని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం హైదరాబాద్‌ సైబర్‌ క్రైం డీసీపీ స్నేహమెహ్రాకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతులకు ఇచ్చే 24గంటల విద్యుత్‌పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందించానన్నారు. ఈ స్పందనపై రేవంత్‌రెడ్డి అనుచరులు, అభిమానులు అర్ధరాత్రి వేళ తనకు ఫోన్‌ చేసి అసభ్యంగా దూషిస్తున్నారని.. కుటుంబ సభ్యుల్ని కూడా దుర్భాషలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్‌ తండ్రి వయసున్న కేసీఆర్‌ను పట్టుకొని చార్లెస్‌ శోభరాజ్‌ అనవచ్చా?.. ఇష్టమొచ్చినట్లు సీఎంను దూషిస్తుంటే ఏమీ అనొద్దా..? అని ప్రశ్నించారు. బ్లాక్‌ మెయిల్‌ రాజకీయాలకు పాల్పడుతూ మరో నయీమ్‌లా మారారని శ్రవణ్‌ విమర్శించారు.

నా సవాల్‌తోనే ఏఈలకు లాగ్‌బుక్స్‌ అప్పగింత
ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండ క్రైం: వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్‌ సరఫరా కావడం లేదని, 11గంటలకన్నా ఎక్కువ కరెంట్‌ రావడం లేదని తాను బండసోమారం సబ్‌స్టేషన్‌లో నిరూపించడంతో అన్ని సబ్‌స్టేషన్ల లాగ్‌బుక్స్‌ ఏఈలకు అప్పగించారని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన నల్లగొండలో విలేకరులతో మాట్లాడారు. 24 గంట ఉచిత విద్యుత్‌ ఇవ్వడం లేదని తాను నిరూపించడంతో కేటీఆర్‌కు తల ఎక్కడ పెట్టుకోవాలో తెలియడం లేదన్నారు. కాంగ్రెస్‌ పార్టీనే రైతులకు ఉచిత విద్యుత్‌ ఇచ్చిందని, దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌ అమలు చేశారని చెప్పారు. మూడు నెలల్లో కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వస్తుందని, మేనిఫెస్టోలో పెట్టి 24గంటల ఉచిత విద్యుత్‌ అందజేస్తామని ఉద్ఘాటించారు. తన తాత పాలనలో ప్రభుత్వ బడుల దుస్థితిని వెల్లడించి సీఎం మనవడు హిమాన్షు తాతకు, తండ్రికి బుద్ధి చెప్పాడని కోమటిరెడ్డి ప్రశంసించారు. గుత్తా సుఖేందర్‌రెడ్డి ఊసరవెల్లిలా.. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరతారని విమర్శించారు. భూమి ఇవ్వనందుకు మరదలును ఆత్మహత్య చేసుకునేలా చేశాడని ఆరోపించారు. తాను ఎంతోమంది పేద పిల్లల చదువుకు, ఆస్పత్రిలో, ఆపదలో ఉన్నవారికి సహాయం చేశానని, కళాశాలల్లో, పాఠశాల్లో టాయిలెట్లు కట్టించానని కోమటిరెడ్డి చెప్పారు.

'విద్యుత్‌'పై రెఫరెండానికి రెడీ



కాంగ్రెస్‌ పార్టీకి ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు సవాల్‌
- కాంగ్రెస్‌ది మూడు గంటలు.. మాది మూడు పంటల విధానం
- ఉచిత విద్యుత్‌ విధానాన్ని జీర్ణించుకోలేకే విపక్షాల విమర్శలు
- బషీర్‌బాగ్‌ కాల్పులకు కేసీఆర్‌ కారణమనడం హాస్యాస్పదం

సాక్షి, హైదరాబాద్‌: గతంలో పదేళ్ల కాంగ్రెస్‌ హయాం, ప్రస్తుత తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్‌ పాలనలో అందించిన విద్యుత్‌పై రెఫరెండానికి వెళదాం అని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్‌ పార్టీకి సవాలు విసిరారు. వెలుగు, జిలుగుల బీఆర్‌ఎస్‌, కటిక చీకటి కాంగ్రెస్‌ విధానాలపై ప్రజల వద్దకు వెళ్లి అన్ని విషయాలు విడమరచి చెప్తామన్నారు. రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో కలసి శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. రైతులకు మూడు గంటల కరెంటు చాలు అని ప్రకటించిన కాంగ్రెస్‌ నేతలు.. ఇప్పుడు ఆ మాటను సరిదిద్దుకోలేక కుడితిలో పడిన ఎలుకలా కొట్టుకుంటూ ఈ అంశాన్ని పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. 'మూడు గంటలు కరెంటు అని కాంగ్రెస్‌, మతం పేరిట మంటలు.. అని బీజేపీ చెపుతోంది. కానీ సీఎం కేసీఆర్‌ మాత్రం మూడు పంటలు అనే విధానంతో ముందుకు వెళ్తున్నారు. దేశంలో రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్‌ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. కానీ కాంగ్రెస్‌ పార్టీ మాత్రం తాము అధికారంలోకి వస్తే బోరు బావుల వద్ద మీటర్లు పెడతామని అంటోంది. రాష్ట్రంలో 90 శాతంగా ఉన్న చిన్న, సన్నకారు రైతులకు మూడు గంటల ఉచిత విద్యుత్‌ చాలు అని టీపీసీసీ అధ్యక్షుడు అంటున్నారు. కాంగ్రెస్‌ అధికారంలోకి వస్తే మళ్లీ పాత విధానం తెస్తామని చెపుతోంది'అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

చంద్రబాబునే ఇంటికి పంపించారు..
'దేశంలో కాంగ్రెస్‌, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా 24 గంటల విద్యుత్‌ ఇవ్వడం లేదు. తెలంగాణలో ఉచిత విద్యుత్‌ విధానం సమర్థంగా అమలవుతుండటాన్ని విపక్షాలు జీర్ణించుకోలేక పోతున్నాయి'అని మంత్రి హరీశ్‌రావు అన్నారు. 'కాంగ్రెస్‌ పాలనలో పరిశ్రమలకు పవర్‌ కట్‌లు, పంటలకు క్రాప్‌ హాలిడేలు నిత్యకృత్యంగా ఉండేవి. ఉమ్మడి రాష్ట్రంలో మోటారు పెట్టేందుకు వెళ్లిన రైతులను నక్సలైట్లు అనుకుని కాల్చి చంపిన చరిత్ర ఉంది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత కరెంటు సమస్యపై ఎన్నడూ చర్చ జరగకపోవటమే మేం సాధించిన ఘనతకు నిదర్శనం. తెలంగాణలో 30 లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఉండగా, ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత కొత్తగా 8 లక్షలకు పైగా వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చాం. కానీ డబుల్‌ ఇంజన్‌ సర్కార్లు ఉన్న రాష్ట్రాల్లో ఇంకా డీజిల్‌ ఇంజన్లే ఉన్నాయి. ఉచిత విద్యుత్‌ను కాంగ్రెస్‌ వ్యాపార కోణంలో చూస్తే, కేసీఆర్‌ మాత్రం మానవీయ కోణంలో చూస్తున్నారు'అని హరీశ్‌రావు పేర్కొన్నారు. విద్యుత్‌ పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు సీఎం కేసీఆర్‌ రూ. 37 వేల కోట్లు వెచ్చించారు. బషీర్‌బాగ్‌ కాల్పులకు కేసీఆర్‌ కారణమనడం హాస్యాస్పదం. విద్యుత్‌ చార్జీలు తగ్గించాలంటూ నాటి సీఎం చంద్రబాబుకు డిప్యూటీ స్పీకర్‌ హోదాలో కేసీఆర్‌ లేఖ రాశారు. తెలంగాణ ఉద్యమమే కరెంటు నుంచి పుట్టింది. కాంగ్రెస్‌ నేతలు పదవుల కోసం పార్టీలు మారుతుంటే కేసీఆర్‌ పదవులను గడ్డిపోచల్లా వదులుకున్నారు. ఉచిత విద్యుత్‌ వద్దన్న చంద్రబాబును ప్రజలు ఇంటికి సాగనంపారు'అని అన్నారు. '65 లక్షల మంది రైతుల ప్రయోజనాల కోసం కేంద్రం నుంచి రావాల్సిన రూ.35 వేల కోట్లు వదులుకున్న చరిత్ర మా ప్రభుత్వానిది. ఇప్పటికైనా కాంగ్రెస్‌ నేతలు తెలంగాణ సమాజానికి క్షమాపణలు చెప్పాలి'అని హరీశ్‌రావు డిమాండ్‌ చేశారు. కాంగ్రెస్‌ విధానాలపై మాట్లాడిన దాసోజు శ్రవణ్‌కు బెదిరింపు కాల్స్‌ చేయడాన్ని ఆయన ఖండించారు. రాజా సింగ్‌ నియోజకవర్గంలో ఆసుపత్రి సమస్యలపై మాత్రమే తనను కలిశారన్నారు.

చంద్రబాబు హిందూ వ్యతిరేకి



- దేవాలయాల్లో జోక్యం చేసుకోకుండా రాజకీయాలు చేసుకోవాలి
- బాబుకు సుబ్రహ్మణ్యస్వామి హితవు

సాక్షి, న్యూఢిల్లీ : టీడీపీ అధినేత చంద్రబాబు హిందూ వ్యతిరేకి అని మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి ఆరోపించారు. దేశంలోని ఆధ్యాత్మిక క్షేత్రాల్లో ప్రముఖమైనదైన తిరుమల తిరుపతి దేవాలయం (టీటీడీ)పై బాబు, పవన్‌కల్యాణ్‌ అసత్యాలు ప్రచా రం చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు హిందూ దేవాలయ వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా రాజకీయాలు చేసుకోవాలని హితవు పలికారు. హిందూ దేవాలయాలను కించపరిస్తే సహించేది లేదన్నారు. ఢిల్లీల్లో న్యాయవాది సత్య సభర్వాల్‌తో కలిసి స్వామి శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే.. చంద్రబాబు, పవన్‌ ఇద్దరూ కలిసి హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్నారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా అక్రమాలు జరుగుతున్నాయని ఇష్టారీతిన అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. టీటీడీ చైర్మన్‌ క్రిస్టియన్‌ అని, తిరుమల ఆలయం సమీపంలో అన్యమత ప్రచారం జరుగు తోందనడం అబద్ధం. ప్రజా క్షేత్రంలో పోరాడలేకే చంద్రబాబు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. నిజానికి.. కాగ్‌ ద్వారా ఆడిట్‌కు టీటీడీ స్వచ్ఛందంగా ముందుకొచ్చింది.

వారి ఆరోపణలు అసత్యమని రుజువుచేస్తా
వైఎస్సార్‌సీపీ నేతలు తప్పుడు రశీదులిచ్చి శ్రీవాణి ట్రస్టు ద్వారా సొమ్ములు లూటీ చేస్తున్నా రని చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ ఆరోపిస్తున్నారు. నేను శ్రీవాణి ట్రస్టును సందర్శించి వారి ఆరోపణలు అవాస్తవమని రుజువు చేస్తా. చంద్రబాబు, పవన్‌ కల్యాణ్‌ల వ్యాఖ్యలు మతప్రాతిపదికన శతృత్వం సృష్టించేలా ఉన్నాయి. ఉద్దేశ/దురుద్దేశపూర్వకంగా భక్తుల మతపరమైన భావాలు రెచ్చగొట్టేలా ఉన్నాయి. ఇక టీటీడీలో అవకతవకలు జరిగాయంటూ ఢిల్లీ వచ్చి అసత్యా లు ప్రచారం చేస్తున్నారు. తిరుమల ఆలయ ప్రతిష్ఠ తగ్గించేలా ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై నేను వేసిన పరువు నష్టం దావా కేసు పురోగతిలో ఉంది.

టీపీసీసీ ప్రచార కమిటీకో చైర్మన్‌గా పొంగులేటి

- చైర్మన్‌గా మధుయాష్కీ గౌడ్‌, కన్వీనర్‌గా సయ్యద్‌ అజ్మతుల్లా హుస్సేని
- 37 మంది సభ్యులుగా కార్యనిర్వాహక కమిటీ ఏర్పాటు
- నియమించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



సాక్షి, న్యూఢిల్లీ: టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్‌గా కాంగ్రెస్‌ నేత, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌ రెడ్డిని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియమించారు. ఇటీవల ఖమ్మంలో జరిగిన భారీ బహిరంగ సభలో పొంగులేటికి కాంగ్రెస్‌ అగ్రనేత రాహుల్‌గాంధీ పార్టీ కండువా కప్పిన విషయం తెలిసిందే. కాగా టీపీసీసీ ప్రచార కమిటీకి గతంలో చైర్మన్‌గా ఉన్న మధు యాష్కీ గౌడ్‌, కన్వీనర్‌ సయ్యద్‌ అజ్మతుల్లా హుస్సేనీలను అదే పదవుల్లో కొనసాగించారు. ఇక ప్రచార కమిటీలో 37 మందిని కార్యనిర్వాహక సభ్యులుగా నియమించారు.

కార్యనిర్వాహక సభ్యులు వీరే..
టీపీసీసీ మాజీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ జెట్టి కుసుమ కుమార్‌, ఎం.ప్రవీణ్‌ రెడ్డి, కత్తి కార్తీక గౌడ్‌, మహ్మద్‌ జావేద్‌ అక్రమ్‌, నరేంద్ర ముదిరాజ్‌, జూలూరు ధనలక్ష్మి గౌడ్‌, దయాకర్‌ గౌడ్‌, వరంగల్‌ రవి, నాగన్న, అముగోతు వెంకటేశ్‌, రాములు యాదవ్‌, దాస్‌గౌడ్‌, కెప్టెన్‌ కరుణాకర్‌ రెడ్డి, గడుగు రోహిత్‌, బండ శంకర్‌, కోలా వెంకటేశ్‌, దినేశ్‌ సాగర్‌ ముదిరాజ్‌, గోపాల్‌రెడ్డి, దండెం రాంరెడ్డి, శ్రీకొండ మల్లేష్‌, కోట శ్రీనివాస్‌, గిరి కొండల్‌, సంగీతం శ్రీనివాస్‌, చారులత రాథోడ్‌, రేణుక, గిరి నాగభూషణం, భీం భరత్‌, కె.శివ కుమార్‌, సాయిని రవి, రఘువీర్‌ గౌడ్‌, డా.కె.విజయ్‌కుమార్‌, జి. లోకేశ్‌ యాదవ్‌, ఏఎం ఖాన్‌, జంగారెడ్డి, డా. వడ్డేపల్లి రవి, తాటికొండ శ్రీనివాస్‌, డా. మోతీ లాల్‌ను కార్యనిర్వాహక సభ్యులుగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ ఖర్గే అవకాశం కల్పించారు.

ప్రత్యేక ఆహ్వానితులుగా...
వీరితో పాటు పీసీసీ అధ్యక్షుడు, సీఎల్పీ నేత, కౌన్సిల్‌ నేత, పీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్లు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, పార్టీ వివిధ విభాగాల అధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు ప్రచార కమిటీలో ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ ఉత్తర్వులు జారీ చేశారు.

రూ.100 కోట్లు ఇస్తామంటున్నారు

- కేటీఆర్‌, కవితలపై స్టేట్‌మెంట్లు ఉపసంహరించుకోమంటున్నారు
- లేకపోతే క్లిష్టమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందని వారి అనుచరులు బెదిరిస్తున్నారు
- గవర్నర్‌కు సుకేశ్‌ చంద్రశేఖర్‌ లేఖ



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ మంత్రి కేటీఆర్‌, ఎమ్మెల్సీ కవితలపై ఈడీకి ఇచ్చిన స్టేట్‌మెంట్లు ఉపసంహరించుకుంటే భారీ స్థాయిలో నగదు, భూమితో పాటు ఎన్నికల్లో టికెట్‌ సైతం ఇస్తామంటున్నారని మనీలాండరింగ్‌ కేసులో మండోలి జైలులో ఉన్న సుకేశ్‌ చంద్రశేఖర్‌ ఆరోపించాడు. తన వద్ద ఉన్న వాట్సాప్‌ చాట్‌ కాపీలు, స్క్రీన్‌ షాట్లు, ఫేస్‌టైమ్‌ కాల్‌ కాపీలతో పాటు ఆప్‌ నేతల కాల్‌ రికార్డింగులు ఇవ్వాలని కేటీఆర్‌, కవిత అనుచరులు గత రెండు రోజులుగా తన కుటుంబ సభ్యులపై ఒత్తిడి తీసుకొస్తున్నారని పేర్కొన్నాడు. వారు చెప్పినట్లు చేస్తే శంషాబాద్‌ విమానాశ్రయం దగ్గరలో భూమి, రూ.100 కోట్లు నగదు, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సీటు ఇస్తామంటున్నారని, లేదంటే అత్యంత క్లిష్టమైన పరిస్థితి ఎదుర్కోవాల్సి ఉంటుందంటూ బెదిరిస్తున్నారని ఆరోపించాడు. ఇవన్నీ కేటీఆర్‌, కవితలకు అత్యంత సన్నిహితుడు, లగ్జరీ దుకాణదారుడు/స్టైలిస్ట్‌ ఒకరు తన కుటుంబ సభ్యులకు చెప్పారని వివరించాడు. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్‌కు సుకేశ్‌ జైలు నుంచి లేఖ రాశాడు. అదే లేఖను తన న్యాయవాది ద్వా రా మీడియాకు విడుదల చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి.

సీబీఐ సంయుక్త దర్యాప్తు జరపాలి
'ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌, ఆయన సహచరులపై నా ఫిర్యాదుల మేరకు దర్యాప్తు సాగుతోంది. దీంతో కేజ్రీవాల్‌, ఆయన సహచరులు నన్ను నిరంతరం బెదిరిస్తూనే ఉన్నారు. తాజాగా రెండు రోజులు నుంచి కేటీఆర్‌, కవిత అనుచరులు నా కుటుంబ సభ్యుల్ని బెదిరిస్తున్నారు. ఈ వివరాలు కూడా ఈడీకి అందజేస్తా. దీనిపై సీబీఐ కూడా సంయుక్త దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉంది..' అని సుకేశ్‌ లేఖలో పేర్కొన్నాడు.

250 జీబీ కన్నా ఎక్కువ డేటా ఉంది
'కేటీఆర్‌, కవితల కాల్‌ రికార్డింగులకు సంబంధించిన 250 జీబీ కన్నా ఎక్కువ డేటా నా వద్ద ఉంది. వారిద్దరూ నాతో జరిపిన లావాదేవీలపై విచారణ జరిపితే కేటీఆర్‌, కవిత ఎంత అవినీతిపరులో తేటతెల్లం అవుతుంది. తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రజలు బీఆర్‌ఎస్‌ నేతల అవినీతి గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది..' అని పేర్కొన్నాడు. తన అభ్యర్థనను సీబీఐకి ఫిర్యాదుగా రిఫర్‌ చేయాలని గవర్నర్‌ను సుకేశ్‌ కోరాడు.

క్షమాపణ చెప్పకుంటే క్రిమినల్‌ కేసులు

సుకేశ్‌కు కేటీఆర్‌ లీగల్‌ నోటీసు
- పథకం ప్రకారం నకిలీ ఆధారాలు సృష్టించారు
- ప్రచార యావతో తప్పుడు ఆరోపణలు
- సంచలనాలు, మీడియా దృష్టిని ఆకర్షించేందుకే ఇలాంటి ప్రయత్నాలన్న మంత్రి



సాక్షి, హైదరాబాద్‌: మనీలాండరింగ్‌ కేసులో మండోలి జైలులో ఉన్న సుకేశ్‌ చంద్రశేఖర్‌ తనపై చేసిన ఆరోపణలు ఉపసంహరించుకుని రాతపూర్వకంగా బేషరతు క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌, మంత్రి కేటీ రామారావు డిమాండ్‌ చేశారు. లేనిపక్షంలో చట్ట ప్రకారం సివిల్‌, క్రిమినల్‌ కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ మేరకు సుకేశ్‌కు తన న్యాయవాది ద్వారా లీగల్‌ నోటీసు పంపించారు. ఈ నెల 12న కేంద్ర హోం మంత్రి, రాష్ట్ర గవర్నర్‌, సీబీఐ డైరెక్టర్‌కు సుకేశ్‌ పంపిన లేఖపై తాను స్పందిస్తున్నట్లు కేటీఆర్‌ తెలిపారు. సుకేశ్‌ పేరిట పేర్కొన్న ఫిర్యాదు అంతా కల్పితమని, పథకం ప్రకారం నకిలీ ఆధారాలు సృష్టించారని, నేరపూరితంగా, అక్రమంగా వాటిని తయారు చేశారని నోటీసులో పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తప్పుడు ఆరోపణలు చేయడం వెనుక ప్రచార యావతో పాటు ఇతరత్రా కారణాలున్నాయని వివరించారు. అనేక క్రిమినల్‌ కేసుల్లో నిందితుడిగా జ్యుడీషియల్‌ రిమాండ్‌లో ఉన్న వ్యక్తి, ప్రజా జీవితంలో ఉన్న ప్రముఖ వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని ప్రచారం కోసం, సంచలనాల కోసం, మీడియా దృష్టిని ఆకర్షించేందుకు ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నాడని పేర్కొన్నారు. సుకేశ్‌తో తాను ఎన్నడూ భేటీ కాలేదని, ఎలాంటి సంబంధం కూడా లేదని స్పష్టం చేశారు. తనపై చేసిన ఫిర్యాదును వెనక్కి తీసుకోవడంతో పాటు భవిష్యత్తులోనూ ఇలాంటి చర్యలకు దూరంగా ఉండాలని నోటీసులో పేర్కొన్నారు.

దాసోజును బెదిరించిన వారిపై చర్యలు తీస్కోండి
టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అనుచరులమంటూ బీఆర్‌ఎస్‌ నేత దాసోజు శ్రవణ్‌ను బెదిరించిన వారిపై వెంటనే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని హోం మంత్రి మహమూద్‌ అలీ, డీజీపీ అంజనీకుమార్‌ను కేటీఆర్‌ కోరారు. తెలంగాణలో కాంగ్రెస్‌ పార్టీని దోపిడీ దొంగ చేతికి అప్పగించారని, ఇప్పుడతను బహిరంగ బెదిరింపులకు దిగుతున్నాడని ఆరోపించారు.

మీడియా జాగ్రత్తగా ఆలోచించుకోవాలి
సుకేశ్‌ తనపై చేస్తున్న మతిలేని ఆరోపణలు తన దృష్టికి వచ్చాయని కేటీఆర్‌ తెలిపారు. సుకేశ్‌ లేఖపై శుక్రవారం చేసిన ట్వీట్‌లో ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సుకేశ్‌ అనే వాడి గురించి నేనెప్పుడూ వినలేదు. వాడెవడో నాకు తెలియదు. ఆ రోగ్‌ చేసిన అడ్డమైన వ్యాఖ్యలపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటా' అని చెప్పారు. ఓ నేరస్తుడు, మోసగాడు చేసిన అడ్డగోలు వ్యాఖ్యలను మీడియాలో ప్రసారం చేసే ముందు లేదా ప్రచురించే ముందు జాగ్రత్తగా ఆలోచించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాగా, ట్వీట్‌లో కేటీఆర్‌ చేసిన వ్యాఖ్యలపై న్యాయపోరాటం చేస్తామని సుకేశ్‌ న్యాయవాది ఢిల్లీలో చెప్పారు.

ప్రజల దృష్టిని మళ్లించేందుకే యూసీసీ
ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్‌ ఒవైసీ



సాక్షి, హైదరాబాద్‌: పేదరికం, నిరుద్యోగం, ధరల పెరుగుదల, చైనా చొరబాటు లాంటి వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) అమలు ప్రతిపాదన తెచ్చారని హైదరాబాద్‌ ఎంపీ, ఆల్‌ ఇండియా మజ్లిస్‌-ఏ-ఇత్తెహాదుల్‌ ముస్లిమీన్‌ అధ్యక్షుడు అసదుద్దీన్‌ ఒవైసీ ఆరోపించారు. శుక్రవారం మజ్లిస్‌ పార్టీ ప్రధాన కార్యాలయమైన దారుస్సలాంలో ఆయన మీడియాతో మాట్లాడారు. యూసీసీ అమలు గురించి తెలంగాణలోని ఆదిలాబాద్‌కు వచ్చి గోండు సామాజిక వర్గానికి చెప్పాలని ప్రధాని మోదీకి సవాల్‌ విసిరారు. గతంలో సార్వత్రిక ఎన్నికలకు ముందు బీజేపీ ఈ అంశాన్ని లేవనెత్తిందని, వచ్చే 2024 ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధి పొందడమే దాని లక్ష్యమని ఒవైసీ ధ్వజమెత్తారు. కామన్‌ లా కోడ్‌పై సూచనల కోసం అప్పీల్‌ చేసిన లా కమిషన్‌కు యూసీసీపై తమ పార్టీ స్పందనను పంపామని వివరించారు. ఇటీవల, భోపాల్‌లో ప్రధాని మోదీ యూసీసీపై ముస్లింలను తప్పుదోవ పట్టిస్తున్నారని వ్యాఖ్యానించారని, 'ఒక ఇంట్లో ఒక సభ్యునికి ఒక చట్టం, మరొకరికి మరొక చట్టం ఉంటే ఆ ఇంటిని నడపగలమా? అని ప్రశ్నించారు. యూనిఫాం సివిల్‌ కోడ్‌పై కేరళ గవర్నర్‌ చేసిన వ్యాఖ్యలపై ఒవైసీ మండిపడ్డారు.

ఏపీ సీఎం జగన్‌ను కలుస్తా
ఏపీ సీఎం జగన్‌ తనకు మిత్రుడని, త్వరలో ఆయనను యూసీసీ అంశంపై కలుస్తామని అసదుద్దీన్‌ ఓవైసీ వెల్లడించారు. ఇప్పటికే ఆయన తనను లంచ్‌కు ఆహ్వానించారని పేర్కొన్నారు. తెలంగాణ సీఎం కేసీఆర్‌తో సమావేశమై యూసీసీకి వ్యతిరేకంగా మద్దతు కోరగా, ఆయన సానుకూలంగా స్పందించడంతో పాటు భావస్వారూప్య పార్టీలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని చెప్పారు.

20 నుంచి ఎంబీబీఎస్ సీట్లకు జాతీయ కౌన్సెలింగ్

- షెడ్యూల్ ప్రకటించిన ఎంసీసీ... 22 నుంచి వెబ్ ఆప్షన్ల నమోదు
- 29న సీట్ల కేటాయింపు జాబితా విడుదల
- ఆగస్టు నాలుగో తేదీ నాటికి కాలేజీల్లో చేరికలు



సాక్షి, హైదరాబాద్: అఖిల భారత కోటా ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీకి మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) శుక్రవారం షెడ్యూల్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ మెడికల్, డెంటల్ కాలేజీల్లోని 15 శాతం సీట్లను అఖిల భారత కోటా కింద భర్తీ చేయనున్నారు. కాలేజీలు, సీట్ల వివరాలను ఈ నెల 20వ తేదీన ఎంసీసీ, ఎన్ఎంసీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని, అదే రోజున ఉదయం పది గంటల నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ నెల 22వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ వెబ్ ఆప్షన్ల నమోదుకు గడువు ఇవ్వనున్నట్టు తెలిపింది. 29వ తేదీన సీట్ల కేటాయింపు జాబితా విడుదల చేస్తారు. ఆగస్టు నాలుగో తేదీ నాటికి కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది. ఆగస్టు 7 నుంచి 28వ తేదీ వరకూ రెండో దశ, ఆగస్టు 31వ తేదీ నుంచి సెప్టెంబర్ 18వ తేదీ వరకూ మూడో దశ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని స్పష్టం చేసింది. మూడో దశలో మిగిలిన సీట్లకు సెప్టెంబర్ 21వ తేదీ నుంచి స్ట్రే వెకెన్సీ రౌండ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని వెల్లడించింది.

15 శాతం అఖిల భారత కోటా కౌన్సెలింగ్‌లో..

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లలో 15 శాతం అఖిల భారత కోటా కౌన్సెలింగ్‌లో భర్తీ చేస్తారు. ఈ సీట్లలో జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు చేరతారు. కాగా, ఈసారి ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌ను మార్పు చేయాలని జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) భావించింది. ఆ ప్రకారం అఖిల భారత స్థాయి కౌన్సెలింగ్, రాష్ట్రస్థాయి కౌన్సెలింగ్‌ను ఒకేసారి ప్రారంభించాలని నిర్ణయించింది. కానీ వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు ఈసారి కొత్త విధానంలో కాకుండా పాత పద్ధతిలోనే కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అంటే అఖిల భారత కౌన్సెలింగ్ తర్వాతే రాష్ట్రాల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఆ మేరకు జాతీయ, రాష్ట్రస్థాయి కౌన్సెలింగ్‌లు వేర్వేరు తేదీల్లో కొనసాగుతాయి. అయితే రాష్ట్రాల కౌన్సెలింగ్ ఎప్పుడు ప్రారంభించాలన్న దానిపై ఎన్ఎంసీ ఇప్పటివరకు షెడ్యూల్ ప్రకటించలేదు.

ఎంబీబీఎస్, బీడీఎస్‌కు 23 వేల మంది దరఖాస్తు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ కన్వీనర్ సీట్లలో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ఈ నెల ఏడో తేదీ నుంచి ప్రారంభమై శుక్రవారంతో ముగిసింది. అయితే గతేడాది నీట్‌లో అర్హులైన వారిలో 13 వేల మంది దరఖాస్తు చేసుకోగా, ఈసారి ఏకంగా 23 వేల మంది దరఖాస్తు చేసుకున్నారని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రకటించింది. ఈ ఏడాది తెలంగాణ నుంచి 72,842 మంది నీట్ పరీక్షకు హాజరయ్యారు. అందులో రాష్ట్రం నుంచి 42,654 మంది ఉత్తీర్ణత సాధించారు. 2014కు ముందు రాష్ట్రంలో 20 మెడికల్ కాలేజీలు ఉంటే, ఈ ఏడాది ఆ సంఖ్య 56కు చేరుకుంది. ఇదే సమయంలో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 2,850 నుంచి 8,340కు చేరింది. ఈ ఏడాది ఏకంగా కొత్తగా ఎనిమిది ప్రభుత్వ మెడికల్ కాలేజీలు అందుబాటులోకి వచ్చాయి. అలాగే కొన్ని ప్రైవేట్ కాలేజీలు కూడా వచ్చాయి. దీంతో విద్యార్థుల్లో చాలామందికి పెద్ద ర్యాంకులు వచ్చినా కూడా ఎంబీబీఎస్ లేదా బీడీఎస్ వస్తుందన్న నమ్మకం ఏర్పడింది.

కొత్త మెడికల్ కాలేజీల్లో అన్ని సీట్లూ రాష్ట్రంలోని విద్యార్థులకే

తెలంగాణ ఏర్పడిన తర్వాత వచ్చిన కొత్త మెడికల్ కాలేజీల్లో అన్ని సీట్లూ రాష్ట్రంలోని విద్యార్థులకే కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఈసారి రికార్డు స్థాయిలో దరఖాస్తులు వచ్చినట్లు కాళోజీ వర్గాలు వెల్లడించాయి. ఈసారి కన్వీనర్ కోటాలో కూడా రిజర్వు అభ్యర్థులకు లక్షన్నర ర్యాంకుకు కూడా ఏదో ఒక కాలేజీలో సీటు వచ్చే అవకాశం ఉందంటున్నారు. అలాగే బీ కేటగిరీలో 9 లక్షల నుంచి 10 లక్షల ర్యాంకుకు కూడా సీటు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. మరోవైపు ఎన్ఆర్ఐ కోటా సీట్లు విరివిగా వచ్చే అవకాశం ఉందంటున్నారు. దీనివల్ల కొన్ని ప్రైవేట్ మెడికల్ కాలేజీలు భారీగా ఫీజులు వసూలు చేసే పరిస్థితి ఉండదంటున్నారు. పేరున్న కాలేజీలు తప్పిస్తే సాధారణ ప్రైవేట్ మెడికల్ కాలేజీలు ఎన్ఆర్ఐ కోటా సీట్లను ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే తక్కువ వసూలు చేసే అవకాశం ఉందని, లేకుంటే ఎవరూ వాటిల్లో చేరే అవకాశం లేదని అంటున్నారు.

రేపు ఇంజనీరింగ్ తొలి దశ సీట్ల కేటాయింపు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్ కాలేజీల్లో ఈ నెల 16వ తేదీన తొలి విడత సీట్లు కేటాయిస్తారు. దీనికోసం అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారు. వాస్తవానికి సీట్ల భర్తీ ప్రక్రియను ఈ నెల 12వ తేదీనే చేపట్టాల్సి ఉంది. ఇంటర్మీడియెట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాలు వెల్లడవ్వడం, 14 వేలకుపైగా సీట్లను తొలి దశ కౌన్సెలింగ్‌లో చేర్చాల్సి రావడంతో కౌన్సెలింగ్ ప్రక్రియలో మార్పులు చేశారు. ఈ నెల 12తో ఆప్షన్లు ఇచ్చే గడువు ముగిసింది. మొత్తం 81,856 మంది కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు స్లాట్ బుక్ చేసుకున్నారు. వీరిలో 75,172 మంది ఆప్షన్లు ఇచ్చారు. ఆప్షన్ ఫ్రీజింగ్ ముగిసే సమయానికి 5.25 లక్షల ఆప్షన్లు అందినట్టు అధికారులు తెలిపారు. అయితే తొలి దశలో ఎంసెట్ టాప్ ర్యాంకులు సాధించిన వాళ్ళు తక్కువగా ఆప్షన్లు ఇచ్చారు. ఉస్మానియా, కాకతీయ, జేఎన్‌టీయూహెచ్ క్యాంపస్‌ల్లో ఉండే సీట్లకే పోటీపడ్డారు. 5 వేలకుపైగా ర్యాంకు వచ్చిన విద్యార్థులు టాప్ టెన్ ప్రైవేటు కాలేజీలకు ఎక్కువగా ఆప్షన్లు ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 155 ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలున్నాయి. ప్రైవేటు యూనివర్సిటీలు మరో 18 ఉన్నాయి. మొత్తం 173 కాలేజీల్లో 76,359 ఇంజనీరింగ్ సీట్లు ఉన్నట్టు టీఎస్ ఎంసెట్ క్యాంప్ ఆఫీసర్ శ్రీనివాస్ వెల్లడించారు.

సీఎస్‌సీనే ప్రధాన ఆప్షన్: కౌన్సెలింగ్‌కు వచ్చిన 5.25 లక్షల ఆప్షన్లలో 4 లక్షలకుపైగా కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, దాని అనుబంధ కంప్యూటర్ కోర్సులకే మొదటి ప్రాధాన్యత ఇచ్చారు. ఆ తర్వాత స్థానంలో ఐటీ ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఈ సంవత్సరం 7 వేల వరకూ సివిల్, మెకానికల్, ఈఈఈ బ్రాంచీల్లో సీట్లు తగ్గాయి. వీటి స్థానంలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో కాలేజీలు సీట్లు పెంచుకున్నాయి. ఇవి కాకుండా మరో 7 వేల వరకూ కొత్తగా సీట్లు మంజూరయ్యాయి. ఇవి కూడా కంప్యూటర్ బ్రాంచీల్లోనే ఉన్నాయి. కంప్యూటర్ సంబంధిత బ్రాంచీలన్నీ కలిపి మొత్తం 42,087 సీట్లు తొలి దశ కౌన్సెలింగ్‌లో చేరాయి. గత కొన్నేళ్ళుగా సీఎస్‌సీ బ్రాంచీల్లోనే 90 శాతానికిపైగా సీట్లు భర్తీ అవుతున్నాయి. సివిల్, మెకానికల్, ఈఈఈ బ్రాంచీల్లో 50 శాతంలోపే నిండుతున్నాయి.

‘ఎస్కీ’లో పీజీడీఎం కోర్సులకు దరఖాస్తులు

రాయదుర్గం: ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలోని స్కూల్ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేట్ స్టడీస్ ఆధ్వర్యంలో మూడు పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని ‘ఎస్కీ’ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు తెలిపారు. ఎస్కీలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్, జనరల్ మేనేజ్‌మెంట్, ఇండస్ట్రియల్ సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్ వంటి కోర్సులలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ erci.edu.in లేదా ercihyd.org ద్వారా లేదా 9849697342, 9490116179 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఫస్ట్ టైం.. డాక్టర్ ఎలక్షన్స్

త్వరలో తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి ఎన్నికలు

- రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా నిర్వహణ
- రెన్యువల్స్, కొత్తవారి రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 20 వరకు గడువు
- తర్వాత నోటిఫికేషన్ విడుదల
- 12 మందిని నామినేట్ చేయనున్న ప్రభుత్వం
- 13 మంది సభ్యుల ఎన్నికకు ఓటింగ్..అనంతరం చైర్మన్ ఎన్నిక
- ప్రచారం ప్రారంభించిన వైద్య ప్రముఖులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి (స్టేట్ మెడికల్ కౌన్సిల్)కి ఎన్నికలు జరగనున్నాయి. వచ్చే నెలలో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో వృత్తిపరంగా ఎప్పుడూ బిజీగా ఉండే సీనియర్ వైద్యులు ఎన్నికల ప్రక్రియలో బిజీ అవుతున్నారు. సభ్యులు, చైర్మన్ పదవికి పెద్ద సంఖ్యలో వైద్యులు పోటీ పడే అవకాశం ఉందని అంటున్నారు. 25 మంది డాక్టర్లతో మండలి ఏర్పాటవుతుంది. అందులో 13 మందిని డాక్టర్లు ఓటు ద్వారా ఎన్నుకుంటారు. మిగిలిన 12 మందిని ప్రభుత్వం నామినేట్ చేస్తుంది. అనంతరం వారిలో నుంచి చైర్మన్‌ను ఎన్నుకుంటారు. చైర్మన్ పదవి కోసం పెద్ద ఎత్తున పోటీ నెలకొనే సూచనలు కన్పిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 56 వేల మంది డాక్టర్లు కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ప్రతి ఏటా కొత్తగా మరో మూడు వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉంది. ఇక ప్రతి ఐదేళ్లకోసారి సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. తాజాగా రిజిస్ట్రేషన్‌కు, రెన్యువల్‌కు ఈ నెల 20వ తేదీ గడువుగా నిర్ధారించారు. గడువు ముగిసిన తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తారు. డాక్టర్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా లేదా ఆన్‌లైన్ ద్వారా కౌన్సిల్ సభ్యులను ఎన్నుకునే అవకాశముంది. దీనిపై త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు. 13 మందిని ఓటు ద్వారా ఎన్నుకోనుండటంతో ఓ విధంగా రాజకీయ తరహా వాతావరణం నెలకొనే అవకాశం ఉంది. ఇక ప్రభుత్వం దాదాపు సగం మంది సభ్యులను నామినేట్ చేయనుండటంతో సభ్యులతో పాటు చైర్మన్ ఎన్నిక కూడా ఉత్కంఠభరితంగా సాగే అవకాశం ఉందని అంటున్నారు. ప్రభుత్వ పెద్దలతో సంబంధాలు కలిగి ఉన్న వారికే చైర్మన్ అవకాశం దక్కుతుందనే ప్రచారం జరుగుతోంది.

ఎన్నికల్లో పోటీకి సీనియర్ల సన్నాహాలు

మెడికల్ కౌన్సిల్ ఎన్నికల్లో పోటీకి అనేకమంది సీనియర్ డాక్టర్లు సమాయత్తమవుతున్నారు. కొందరు వైద్యసంఘాల నాయకులు కూడా పోటీకి సై అంటున్నారు. వీరంతా మద్దతు కోసం ఇప్పటికే రిజిస్టర్డ్ డాక్టర్లతో సంప్రదింపులు జరుపుతున్నారు. అంతర్గతంగా పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆగస్టు 16 లోపు కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు సూచించిన నేపథ్యంలో ఏర్పాట్లు వేగం పుంజుకున్నాయి. షెడ్యూల్ విడుదలకు కసరత్తు జరుగుతోంది. ఎంబీబీఎస్ పూర్తి చేసి కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ పొందిన ఎవరైనా పోటీచేసే అవకాశముంది. ఒక్కో డాక్టర్ 13మంది సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది.

ఓటు హక్కుపై ఆందోళన

ఈ నెల 20 వరకు రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేసుకున్న వారే ఎన్నికల్లో ఓటు వేసేందుకు అర్హులని మెడికల్ కౌన్సిల్ ఇప్పటికే ప్రకటించింది. దీంతో డాక్టర్లు ఆందోళనకు గురవుతున్నారు. ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకునేలా ఇటీవల పోర్టల్‌ను ప్రారంభించారు. కానీ అది పనిచేయడం లేదని డాక్టర్లు చెబుతున్నారు. హైదరాబాద్‌లోని కౌన్సిల్‌కు వచ్చి గంటల తరబడి క్యూలో నిల్చోవాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రస్తుతం కౌన్సిల్‌కు ప్రతిరోజూ ఐదారు వందల మంది వస్తుండగా, సగటున 100 కంటే ఎక్కువ రిజిస్ట్రేషన్/రెన్యువల్స్ చేయలేకపోతున్నట్లు కౌన్సిల్ అధికారులు చెబుతున్నారు. దీంతో చాలామంది ఓట్లు కోల్పోయే ప్రమాదం ఉందని సీనియర్ డాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్ల నుంచి భారీ స్థాయిలో ఫీజులు తీసుకుంటున్నా, సరైన సౌకర్యాలు కల్పించడంలో కౌన్సిల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కౌన్సిల్ కార్యాలయానికి ఇప్పటికీ పక్కా భవనం లేకపోవడం, రేకుల షెడ్‌లో నడుస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పాలిటెక్నిక్‌లో 22 వేల సీట్ల భర్తీ

- ముగిసిన పాలిసెట్ కౌన్సెలింగ్... 21 నుంచి తరగతులు



సాక్షి, హైదరాబాద్: పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల తుది దశ (పాలిసెట్) కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. మొత్తం 31,739 సీట్లు అందుబాటులో ఉంటే, తుదివిడత కౌన్సెలింగ్ ముగిసేసరికి 22,144 (69.76 శాతం) సీట్లు భర్తీ అయ్యాయి. ఇంకా 9,595 సీట్లు మిగిలి నట్టు సాంకేతిక విద్య కమిషనర్ వాకాటి కరుణ వెల్లడించారు. ఈ ఏడాది పాలిసెట్‌లో 80,358 మంది అర్హత సాధించారు. తుది దశలో 14,136 మంది 2,77,686 ఆప్షన్లు ఇచ్చారు. ఈడబ్ల్యూఎస్ కోటా కింద 590 మంది సీట్లు పొందారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఈ నెల 16వ తేదీన సెల్ఫ్ రిపోర్టింగ్ లేదా 17వ తేదీన సీటు వచ్చిన కాలేజీకి వెళ్లి రిపోర్ట్ చేయాలని సాంకేతిక విద్యావిభాగం సూచించింది. మిగిలిన సీట్లకు ఒకటి, రెండు రోజుల్లో స్పాట్ అడ్మిషన్లు చేపట్టే వీలుంది. ఈ నెల 21 నుంచి తరగతులు మొదలవుతాయి.

ఓ దేవతలారా!
మా చెవులు ఎల్లవేళలా శుభమైన దానినే వినుగాక!
మా నేత్రములు ఎల్లవేళలా శుభప్రదమైనదే దర్శించుగాక!
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 15 జూలై 2023

మరింత పదునెక్కిన చెలిమి!


అంతర్జాతీయ వ్యవహారాల్లో సొంత గొంతు వినిపించటంలో సారూప్యత కలిగివుండే భారత్–ఫ్రాన్స్‌ల మధ్య వ్యూహాత్మక చెలిమి ఏర్పడి ఇరవై అయిదు వసంతాలు పూర్తయిన తరుణంలో ప్రధాని నరేంద్ర మోదీ ఆ గడ్డపై అడుగుపెట్టారు. రెండు రోజుల పర్యటనలో శుక్రవారం ఆయన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని ప్రబోధించే బాస్టిల్ డే ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నావికా దళ అవసరాల కోసం ఉద్దేశించిన 26 రాఫెల్ జెట్ ఫైటర్లు, మూడు స్కార్పీన్ రకం జలాంతర్గాముల కొనుగోలుకు సంబంధించిన ఒప్పందాలపై సంతకాలవుతున్నాయి. రక్షణ రంగంలో సహకరిస్తున్న ఫ్రాన్స్ ఈ ఒప్పందాలతో రష్యా తర్వాత మనకు ఆయుధాలు విక్రయించే రెండో పెద్ద సరఫరాదారు కాబోతోంది. ఇప్పటికే మనం ఫ్రాన్స్ నుంచి 36 రాఫెల్ జెట్ విమానాలు, ఆరు స్కార్పీన్ రకం జలాంతర్గాములు కొనుగోలు చేశాం.

ఇరు దేశాలమధ్యా సాన్నిహిత్యం ఈనాటిది కాదు. 1916లో మొదటి ప్రపంచ యుద్ధకాలంలో ఫ్రాన్స్‌ను చేజిక్కించుకొనేందుకు నాటి జర్మనీ చేసిన ప్రయత్నాలను డన్‌కిర్క్ పట్టణంలో వమ్ము చేసింది మన దేశానికి చెందిన పంజాబ్ రెజిమెంట్ జవాన్లే. ఆ విజయానికి గుర్తుగా అప్పట్లో పారిస్ వీధుల్లో మన జవాన్లు కవాతు కూడా జరిపారు. దాన్ని గుర్తుచేసుకుంటూ శుక్రవారం బాస్టిల్ డే సందర్భంగా అదే రెజిమెంట్‌కు చెందిన మన సైనికులు 107 ఏళ్ల సుదీర్ఘకాలం అనంతరం కవాతు చేశారు. మనకు స్వాతంత్య్రం వచ్చాక తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సైతం ఫ్రాన్స్‌తో సాన్నిహిత్యాన్ని కోరుకున్నారు. 1950 తర్వాతనుంచీ రెండు దేశాల మధ్యా అణు, అంతరిక్ష రంగాల్లో సహకారం కొనసాగుతోంది. ముఖ్యంగా వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పడిన గత 25 సంవత్సరాలుగా భారత్–ఫ్రాన్స్ చెలిమి ఎన్నో సంక్లిష్ట సందర్భాలను తట్టుకుని నిలబడింది. 1998లో అప్పటి ప్రధాని వాజ్‌పేయి హయాంలో మన దేశం పోఖ్రాన్‌లో అణ్వస్త్ర పరీక్ష నిర్వహించినప్పుడు అమెరికాతో సహా అగ్ర రాజ్యాలు తీవ్ర విమర్శలకు దిగాయి. కానీ ఆ సమయంలో ఫ్రాన్స్ అన్నివిధాలా అండగా నిలబడింది. యూరోప్ యూనియన్ (ఈయూ) శిఖరాగ్ర సదస్సులో భారత్‌ను అభిశంసిస్తూ, దానిపై ఆంక్షలకు పిలుపునిస్తూ బ్రిటన్ తీర్మానం ప్రతిపాదించబోయినప్పుడు వీటో చేస్తానని హెచ్చరించి ఆ ప్రయత్నాన్ని నిలువరించింది ఫ్రాన్సే. రెండు దేశాల విదేశాంగ విధానంలో ఎన్నో పోలికలు కూడా ఉన్నాయి. అమెరికాతో సఖ్యంగా మెలగుతూనే ఏదోమేరకు స్వతంత్రతను పాటించటం భారత్, ఫ్రాన్స్‌లు మొదటినుంచీ అనుసరిస్తున్న విధానం. అమెరికా బద్ధశత్రువులైన ఇరాన్, రష్యాలతో సాన్నిహిత్యం నెరపడంలోనూ ఇద్దరిదీ ఒకే ఆలోచన. ఏకధ్రువ ప్రపంచం ఏర్పడాలని, అది కూడా తన నాయకత్వంలోనే ఉండాలని తహతహలాడే అమెరికా వైఖరికి భిన్నంగా ఏ ఒక్కరి ఆధిపత్యమో ఉండటం చేటు తెస్తుందని భావించటంలోనూ భారత్, ఫ్రాన్స్‌లమధ్య పోలిక ఉంది. ఎవరిపైనా సంపూర్ణంగా ఆధారపడే ధోరణి సరికాదని, ఏ దేశానికైనా స్వావలంబన సాధించటం అవసరమని గుర్తించటంలోనూ ఇద్దరూ ఇద్దరే. బహుశా అందువల్లే కావొచ్చు... పరస్పరం సహకరించుకోవటం ద్వారా భిన్న రంగాల్లో ఎదగటానికి రెండు దేశాలూ ప్రయత్నిస్తున్నాయి. వ్యూహాత్మక చెలిమిలో ముందడుగు వేస్తున్నాయి. అమెరికా మనతో సఖ్యంగా ఉంటున్నా ఆ చెలిమికి ఎప్పుడూ పరిమితులుంటున్నాయి. ఆ దేశంతో మనం కుదుర్చుకునే రక్షణ ఒప్పందాలకు ఎన్నో అవరోధాలుంటాయి. అక్కడి కాంగ్రెస్ వాటిని ఆమోదించాలి. రక్షణ పరికరాలకు సంబంధించి అమల్లోవుండే ఎగుమతుల నియంత్రణ వ్యవస్థలను దాటాలి. ఈ క్రమంలో ఎక్కడైనా ఆగిపోవచ్చు. లేదా జాప్యం చోటుచేసుకోవచ్చు. కొన్ని సందర్భాల్లో రక్షణ కొనుగోళ్లకు అంగీకరించినా, సాంకేతికత బదిలీ సాధ్యపడదు. ఉదాహరణకు మన తేలిక రకం యుద్ధ విమానం తేజస్‌కు జీఈ ఎఫ్ 414 ఇంజిన్ అమర్చేందుకు అమెరికాతో ఒప్పందం కుదిరింది. దాని సాంకేతికత బదిలీకి మాత్రం అంగీకరించలేదు. ఫ్రాన్స్‌తో ఈ పేచీ లేదు. దానితో కుదుర్చుకునే ఒప్పందాలకు అవాంతరాలుండవు. సాంకేతికత బదిలీకి అభ్యంతరాలుండవు. జీఈ ఎఫ్ 414 ఇంజిన్ మాదిరే పనిచేసే ఫ్రాన్స్ సఫ్రాన్ ఇంజిన్‌ను ఇక్కడే ఉత్పత్తి చేయడానికి ఆ దేశం అంగీకరించింది. సాంకేతికత బదిలీ చేయటం వల్ల కేవలం రక్షణ ఉత్పత్తులు విక్రయించే దేశమే కాక, కొనుగోలు చేస్తున్న దేశం కూడా లబ్ధిపొందటానికి అవకాశముంటుంది. రెండు దేశాలూ పర్యావరణ రంగంలో కూడా పరస్పరం సహకరించుకోవటానికి ఇప్పటికే నిర్ణయించాయి. నిరుడు అక్టోబర్‌లో గ్రీన్ హైడ్రోజన్‌పై ఒప్పందం కుదుర్చుకుని, పరస్పర భాగస్వామ్యంతో ప్రపంచానికి విశ్వసనీయమైన, స్థిరమైన హరిత ఇంధనాన్ని అందించే దిశగా ఇరు దేశాలూ అడుగులు వేస్తున్నాయి. ఇంకా కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్, డిజిటల్ టెక్నాలజీ, 6జీ తదితర అంశాల్లో సమష్టిగా పనిచేస్తున్నాయి. క్వాడ్, జీ 20 తదితర వేదికల్లో ఒకే గళం వినిపిస్తున్నాయి.

అలాగని విభేదాలు లేకపోలేదు. ఉక్రెయిన్ యుద్ధంలో ఫ్రాన్స్ ఉక్రెయిన్‌కు గట్టి మద్దతుదారుగా నిలబడింది. ఆయుధాలు సరఫరా చేస్తోంది. మన దేశం మాత్రం దురాక్రమణ ఆపాలని రష్యాను కోరడం మినహా అమెరికా, ఈయూ దేశాల తరహాలో రష్యా వైఖరిని ఖండించటంలేదు. అలాగే చైనా విషయంలోనూ ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమానియెల్ మాక్రాన్ భిన్న వైఖరితో ఉన్నారు. విభేదించుకునే అంశాల్లో అవతలి పక్షం అవగాహన తెలుసుకోవటం, వారిని ఒప్పించే ప్రయత్నం చేయటంలోనే దౌత్య నైపుణ్యం వెల్లడవుతుంది. చిరకాల మిత్ర దేశమైన ఫ్రాన్స్ మోదీ పర్యటన తర్వాత మనకు మరింత సన్నిహితమవుతుందని ఆశించాలి.

గిరిసీమ విధ్వంసం రేపుతున్న ప్రశ్నలు

విశ్లేషణ



హెన్రీ ఫాంతోమ్

ఉత్తరాదిలో కురిసిన వానలకు ముఖ్యంగా పర్వత ప్రాంతాలు జలమయమైనాయి. జరిగిన ఆస్తి, ప్రాణ నష్టం బాధాకరమే అయినప్పటికీ ఇదేదో ప్రకృతి ప్రకోపమని సర్ది చెప్పుకునేందుకు వీల్లేదు. ఇది ప్రకృతి హెచ్చరికలను పెడచెవిన పెట్టిన మనిషి దురాశ ఫలితమే. పర్వత ప్రాంతాల్లోని నదులు, వంకలు, వాగులు చిన్న వానకే అకస్మాత్తుగా ఉరకలెత్తే అవకాశాలెక్కువ. అయినా ఇళ్ల నిర్మాణాల కోసం డిజైన్ కోడ్ పాటించకపోవడం; సరైన రీతిలో తయారు చేసిన కాంక్రీట్, తగిన పిల్లర్లు వాడకపోవడం వల్లనే ప్రస్తుత విధ్వంసం జరిగింది. పర్వతాల్లో నిర్మాణాలు చేపడుతున్నప్పుడు ప్రకృతిని గౌరవించడం అలవర్చుకోవాలి. అవసరమైనంత మాత్రమే కట్టుకోవడం, మిగిలినది ప్రకృతి ఛాయలోనే ఉంచడం మేలు.

వారం అంటే వారం చాలు... ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా సాగాల్సిన హాలిడే సీజన్ కాస్తా పర్యావరణ విధ్వంసంగా మారిపోయేందుకు! అప్పుడే వేసిన రోడ్లు కొట్టుకుపోవడం, వంతెనలు నదుల్లోకి చేరి ప్రవహించడం, కొండచరియలు విరిగిపడటం, పెద్ద పెద్ద భవంతులు పునాదులు కదిలిపోయి నీళ్లలోకి చేరిపోవడం చూశాం. బహుశా ఇవేవీ కొత్త దృశ్యాలు కాకపోవచ్చు కానీ, ఇరవై ఏళ్ల క్రితంతో పోలిస్తే ఈమధ్య తరచూ చూడాల్సి వస్తోంది. వార్తాపత్రికల్లోని వార్తలు, సోషల్ మీడియా పోస్టులు హిమాచల్ ప్రదేశ్‌లోని ప్రకృతి వైపరీత్యాన్ని కళ్లకు కడుతున్నాయి. అనూహ్యమైన వర్షాలు, ఆకస్మిక వరదలు పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టం కలిగించాయి. యాత్రీకులు దిక్కుతోచని విధంగా చిక్కుకుపోయారు. సహాయక చర్యలు కూడా మరీ కష్టసాధ్యంగా మారాయి.



ఒక ఆర్కిటెక్ట్‌గా ఈ గిరిసీమలో నేను చాలా కాలంగా పనిచేస్తున్నాను. చిన్నప్పుడు భూటాన్‌లో పెరిగినప్పటి నుంచి పర్వతాలతో నాకు అనుబంధం ఉంది. అయితే పర్వత ప్రాంతాల్లోని భవనాల గురించి మొదట తెలిసింది విఖ్యాత అధ్యాపకులు ఎంఆర్ అగ్నిహోత్రి వద్ద రీసెర్చ్ అసిస్టెంట్‌గా పనిచేసినప్పుడే. పర్వతారోహకుడు, ఆర్కిటెక్ట్, విద్యావేత్త కూడా అయిన ప్రొఫెసర్ అగ్నిహోత్రి లాంటి వ్యక్తి ఇంకొకరు లేరంటే అతిశయోక్తి కాదు.

ఉత్తరకాశీ ప్రాంతంలో నేనూ, ఆయనా కలిసి ఎన్నో చోట్ల పర్యటించాం. 1992 నాటి భయంకరమైన భూకంపం తరువాత పదేళ్ల పాటు పునరావాస కార్యక్రమాలను పరిశీలించాం. సమీక్షించాం. ప్రాజెక్టులో నాలుగు నెలలు పనిచేస్తే, సగం క్షేత్రస్థాయిలో మిగిలిన సగం ఆఫీసులో ఉంటూ 'వరల్డ్ కాంగ్రెస్ ఆన్ డిజాస్టర్ మిటిగేషన్' కోసం నివేదిక సిద్ధం చేస్తూ గడిపాము. అదో అద్భుతమైన అనుభవం. ఇప్పటికీ నాకు ఎంతో అపురూపమైంది. అనుభవంలో తలపండిన వ్యక్తి ద్వారా పర్వత ప్రాంతాలు ఒక అకెడమిక్ కోణంలో పరిచయం కావడం నా అదృష్టం.

ఆ ప్రాజెక్టులోనే నాకు ఓ అద్భుతమైన విషయం తెలిసింది. భాగీరథి నదీ తీరం వెంబడి ఉన్న మానేరి గ్రామంలో ఓ చిన్న జలవిద్యుత్ కేంద్రం ఉంది. డ్యామ్‌కు రహదారికి మధ్య నదీ తీరంలో ఉంటుంది ఈ గ్రామం. ఆర్‌సీసీ 'పిల్లర్లు', 'లింటార్' నిర్మాణాలతో అన్నీ 'పక్కా' ఇళ్లే ఉండేవి అక్కడ. ప్రాజెక్టు నిర్మాణానికి వాడిన ఉక్కు, కాంక్రీట్‌తోనే వీటినీ కట్టారేమో అనుకునే వాడిని. 1992 భూకంపంలో ఈ గ్రామం మొత్తం ధ్వంసమైపోయిందని తెలిసినప్పుడు నాకు ఆశ్చర్యంగా అనిపించలేదు. ఆ గ్రామంలో ఉన్న వారందరూ ఆ భూకంపంలో మరణించినట్లు తెలిసింది.

భూకంపం కదా, ప్రాణనష్టం ఉంటుందని అనుకోవచ్చు. ఆర్‌సీసీ స్తంభాలు వాడారని చెప్పుకున్నాం కదా... దాన్ని చాలా సున్నితంగా పరిస్థితులకు తగ్గట్టుగా వాడాల్సి ఉంటుంది. ఇంజినీరింగ్ విషయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా, పట్టించుకోకపోయినా పరిస్థితి దారుణంగా ఉంటుంది. ఇప్పుడు చూస్తున్నది అదే. సరైన రీతిలో తయారు చేయని ఆర్‌సీసీ, డిజైన్ కోడ్ పాటించకపోవడం వల్లనే ప్రస్తుత విధ్వంసం జరిగింది. స్థానిక కాంట్రాక్టర్ మాటల ప్రకారం, అక్కడ ఇళ్ల నిర్మాణానికి '3 అడుగులు బై 3 అడుగుల' కాలమ్స్‌ను ఉపయోగిస్తునారు. భవనం ఎత్తు ఎంత ఉన్నా ఇంతే సైజు స్తంభాలను వాడుతున్నారు. కొందరైతే వీటి మీదే నాలుగైదు అంతస్తుల భవనాలు కట్టారు. ఆ ప్రాంతం బిల్డింగ్ కోడ్ ప్రకారం రెండు అంతస్తుల కంటే ఎత్తయిన భవనాలు కట్టరాదు. ఎక్కువ అంతస్తులుండటం లాభాలు తెస్తుంది కానీ, ప్రమాదం కూడా చెప్పకుండా వచ్చేస్తుంది.

అల్మోరా(ఉత్తరాఖండ్)లో చాలా ఏళ్ల క్రితం నేను ఓ భవనం కట్టించా. ఆ సందర్భంలో కాంట్రాక్టర్ ఆందోళనతో ఫోన్ చేశాడు. భవన నిర్మాణానికి సంబంధించిన డ్రాయింగ్స్ సరిగానే ఉన్నాయా? అని అడిగాడు. ఎందుకంటే ఆ చిత్రాల్లో స్తంభాల అడుగు భాగాలు (ఫుటింగ్స్) భారీ సైజుల్లో ఉన్నాయి. ఆ సైజులో ఫుటింగ్స్ ఏర్పాటు చేయడం వల్ల ఖర్చులు ఎక్కువవుతాయన్నది ఆయన ఆందోళన. ఎలాగైనా వీటి సైజులు తగ్గించాలని అభ్యర్థించాడు. అంత మొత్తంలో ఉక్కు కూడా ఎవరూ వాడరని వాదించాడు.

అయితే నేను వాటిని తగ్గించలేదు. ఎందుకంటే భూకంపం రాగల ప్రమాదమున్న జోన్లలో అత్యంత ప్రమాదకరమైన ఐదవ జోన్‌లో అంత మొత్తం కాంక్రీట్ వాడాల్సిందే. భవనం కట్టిస్తున్న వారితో మాట్లాడి... ఈ విషయాలన్నీ వారికి వివరించి కాంట్రాక్టర్‌కు కొంచెం ఎక్కువ చెల్లించేలా ఒప్పించి మరీ భవన నిర్మాణాన్ని కొనసాగించాము.

పర్వతాలిప్పుడు భవనాలతో నిండిపోయి కనిపిస్తున్నాయి. స్థానిక మేస్త్రీలే కాంట్రాక్టర్ల అవతారమెత్తి కట్టేస్తున్నారు. స్థానికులు కూడా చౌకగా అందుబాటులో ఉన్నారని వీరికే పనులప్పగిస్తున్నారు కూడా. ఆధునిక సమాజంలో ఇంజినీరింగ్ సాంకేతిక పరిజ్ఞానాలతో అద్భుతాలు సృష్టించవచ్చునని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అయితే ఈ టెక్నాలజీలు, ఆధునిక హంగులకు కొంత ఖర్చు అవుతుంది. కొన్నిసార్లు ఈ ఖర్చు చాలా ఎక్కువ. సైజు, స్థాయి పెరిగే కొద్దీ ఖర్చు ఇబ్బడిముబ్బడి అవుతూంటుంది. అయితే టెక్నాలజీ వాడకంలో నష్టాలూ లేకపోలేదు. తగిన విధంగా ఉపయోగించకుంటే, నిర్దిష్ట ప్రమాణాల ప్రకారం అమలు చేయకుంటే దారుణ వైఫల్యాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. టీవీల్లో చూపినట్లు భవనాలు, వంతెనలు కుప్పకూలిపోవడం, ప్రవహిస్తూండటం టెక్నాలజీని సక్రమంగా వాడని ఫలితమే.

మానేరి గ్రామం వద్ద గడిపిన సమయంలో నేను కొన్ని సాధారణ పాఠాలు నేర్చుకోగలిగాను. ఇందులో అతి ముఖ్యమైంది... నీటి ప్రవాహానికి సమీపంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్మాణాలు చేపట్టకూడదన్నది! పర్వత ప్రాంతాల్లోని నదులు, వంకలు, వాగులు ఒక్క చిన్న వానకే అకస్మాత్తుగా ఉరకలెత్తే అవకాశాలెక్కువ అన్నది గుర్తించాలి. రెండో పాఠం... పర్వత సానువులను కోయవద్దు. దీనివల్ల పైభాగంలోని చెరియలు విరిగిపడిపోయే అవకాశాలెక్కువ. దురదృష్టవశాత్తూ హైవేల నిర్మాణంలో, వెడల్పు పెంచే సందర్భంలో సానువుల కోత తరచూ జరుగుతోంది. మూడో అంశం... స్థానిక భవన నిర్మాణ శైలిని గౌరవించాలి. వీలైనంత వరకూ భవన నిర్మాణ వ్యవస్థలు స్థానికమైనవిగా ఉండేలా చూసుకోవాలి. నిర్మాణం విషయంలో స్థానికులకు ఉన్న జ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి.

చివరగా... పర్వతాల్లో నిర్మాణాలు చేపడుతూంటే ప్రకృతిని గౌరవించడం అలవర్చుకోవాలి. అవసరమైనంత మాత్రమే కట్టుకోవడం ... మిగిలినది ప్రకృతి ఛాయలోనే ఉంచడం మేలు. ప్రకృతి నుంచి మనకు కావాల్సింది తీసుకోవడానికి మాత్రమే పరిమితం కాకూడదు; వీలైనంత వరకూ మొక్కలు, చెట్లు, అడవులు పెంచాలి. పర్వత ప్రాంతాలను దక్షిణ ఢిల్లీ, శిమ్లా నగరాల్లా మార్చవద్దు.

నిజానికి ఇవేవీ కొత్త విషయాలు కావు. కానీ వీటిని పట్టించుకోకపోవడం మన అజ్ఞానం, అంతే. ప్రస్తుతం శూన్య కర్బన ఉద్గారాలు, సుస్థిరాభివృద్ధి, ప్లాటినమ్ రేటింగ్ అంటూ చాలా కొత్త మాటలు వినిపిస్తున్నాయి. ఇవన్నీ సరే కానీ, భవనాలపై కూడా దృష్టి పెట్టాల్సిన తరుణం వచ్చేసింది. పర్వతాల్లో, నదుల్లో, అడవుల్లో వాతావరణ మార్పుల మధ్యన ఉండేవి ఇవే. తరచూ వరదల బారిన పడుతున్నవి కూడా ఇవే. ఈ అంశాలపై కనీసం కొన్ని ఆర్కిటెక్చరల్ పాఠశాలల్లోనైనా చర్చ మొదలు కావాలి.

వ్యాసకర్త ఆర్కిటెక్ట్
('ద ఫ్రీ ప్రెస్ జర్నల్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సాహో ఇండియా!



సోకాల్డ్ మూడో ప్రపంచ దేశం, ఇప్పుడు చంద్రుడి మీద అంతరిక్ష వాహనాన్ని దింపుతున్న నాలుగో దేశం కావడానికి అతి దగ్గరలో ఉంది. 'ఇస్రో' శాస్త్రవేత్తల బృందానికి అభినందనలు.

– సాగర్, రచయిత

ఇది చరిత్ర!



శ్రీహరికోట లోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి విజయవంతమైన చంద్రయాన్–3 ప్రయోగాన్ని చూడగలిగాను. చరిత్ర రూపొందుతున్న క్షణాలకు సాక్షిగా ఉన్నాను.

– గౌరవ్ శ్రీవాత్సవ, జర్నలిస్ట్

అతి త్వరలో...



చంద్రయాన్–3 ప్రయోగం ద్వారా చంద్రుడి మీద ఇండియా దిగబోతోంది. అయితే అక్కడికి సమర్థంగా చేరడానికి 42 రోజులు పడుతుంది.(లైవ్ వీడియో షేర్ చేశారు.)

– క్రిస్ హాడ్‌ఫీల్డ్, వ్యోమగామి

ఆయనే దొరికారా?



ఎక్కువమంది మహారాష్ట్ర కాంగ్రెస్‌వాళ్లున్న కమిటీ, ప్రతిష్ఠాత్మక లోకమాన్య తిలక్ అవార్డు కోసం ప్రధాని మోదీని ఎంపిక చేయడం నిజంగా చిత్రంగా ఉంది. ఇది ఉదారతా? భావజాల అంధులయ్యారా? లేదా కేవలం అవకాశ వాదమా?

– సుహాస్ పల్షీకర్, ప్రొఫెసర్

నిజమైన సహచరి



ప్రియమైన పురుషులారా! రెండేళ్లు మేల్ వార్డులో నర్సుగా పనిచేసిన తర్వాత, నేను గమనించిన రెండు విషయాలు చెబుతాను. నిజంగా మీరు అనారోగ్యంతో ఉన్నప్పుడు మీ పక్కన ఉండేది మీ భార్య మాత్రమే. కొన్నిసార్లు కొంతసేపు మీ వెంట మీ పిల్లలు ఉండొచ్చు. మీ రక్తసంబంధీకులు వస్తారు, పోతారు. మీ స్నేహితులు కూడా వస్తుంటారు. కానీ పూర్తిగా మీ కష్టంలో నిండు మనసుతో మీ పక్కన ఉండేది మీ భార్య మాత్రమే.

– అబ్దుల్లా ఎ. అబ్దుల్లా, జువాలజిస్ట్

భ్రాంతి జనిత 'అర్ధ భూస్వామ్యం'

అభిప్రాయం



డా॥ పట్టా వెంకటేశ్వర్లు

కమ్యూనిస్టు పార్టీలన్నీ వ్యవసాయ రంగంలో అర్ధ–భూస్వామ్య వ్యవస్థ నెలకొని ఉందనే నిర్ధారిస్తున్నాయి. అందుకని వ్యవసాయ విప్లవమే ఇరుసుగా ఉండాలని అంటున్నారు. ఈ విప్లవం ద్వారా వ్యవసాయ కార్మికులకూ, పేద రైతులకూ భూ పంపిణీ చేయాలని వారంటున్నారు. అయితే భూపంపిణీ కోరుతూ దేశంలో ఏ మూలనైనా భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు జరుగుతున్నాయా అనేది ఆలోచించాల్సిన ప్రశ్న. ఇలాంటి ప్రశ్నలకు జవాబులు వెదుక్కోవటానికైనా అర్ధ భూస్వామ్యంపై ఆధారపడిన 'వ్యవసాయక విప్లవ ఇరుసు' గురించి చర్చ జరగాలి. అయితే దీనికి ముందు కమ్యూనిస్టు పార్టీల రాజకీయ కార్యక్రమాలను చూడాలి.

'ఉత్పాదక శక్తులపై బంధనాలను బద్దలు కొట్టటమే భారతీయ సమాజ పునరుజ్జీవానికి మార్గం. పరాన్నభుక్తమైన భూస్వామ్య వ్యవస్థను రద్దు చేయాలి. వ్యవసాయ కార్మికులకు, పేద రైతులకూ భూమి పంపిణీ చేయాలి. ఎందుకు ఈ పని చేయాలి అంటే, బడా బూర్జువా వర్గం, భూస్వాములతో మైత్రి ఏర్పరచుకొని రాజీపడింది. కాబట్టే ప్రస్తుత బూర్జువా, భూస్వామ్య పాలనలో ప్రజల వెనుకబాటుతనం, దారిద్ర్యం, ఆకలి, నిరుద్యోగం, దోపిడీల నుండి విముక్తి కలిగే ఆశ లేదనీ మన అనుభవం చెబుతున్నది. కాబట్టి పెట్టుబడిదారీ పూర్వ సామాజిక వ్యవస్థను ధ్వంసం చేయడం, పెట్టుబడిదారీ వ్యవస్థ స్వేచ్ఛాయుత అభివృద్ధికి తప్పనిసరి ముందు షరతు. అలాగే ప్రస్తుత భారత సమాజం గుత్త పెట్టుబడిదారీ ప్రాబల్యంలో కుల, మత, గిరిజన వ్యవస్థలు కలగలిపిన విచిత్ర సంగమంగా ఉంది. అందుకనే ప్రజాతంత్ర విప్లవ పరిపూర్తికి మార్గం సుగమం చేయడానికి, సోషలిస్టు సమాజ పరివర్తనకు భూమిక సిద్ధం చేయడానికి వీలుగా పెట్టుబడిదారీ పూర్వ సమాజ విధ్వంసం పట్ల ఆసక్తిగల అన్ని ప్రగతిశీల శక్తులను ఐక్యం చేయాల్సిన బాధ్యత కార్మిక వర్గంపై, దాని పార్టీపైన పడింది'' అని సీపీఎం రాజకీయ కార్యక్రమంలో ఉంది. ఈ విధంగా సీపీఎం వారు పెట్టుబడిదారీ పూర్వ సామాజిక వ్యవస్థను ధ్వంసం చేయాలనటం సరైనదే. మరి వారు అంటున్నట్లు ఇంకా అర్ధ భూస్వామ్యం ఉందా?



దీనికి సంబంధించి సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాజకీయ కార్యక్రమం (2004)లో 'భారతదేశపు అర్ధ ఫ్యూడల్ ఆర్థిక వ్యవస్థలో నూటికి దాదాపు 20 శాతంగా ఉన్న భూస్వాములు (మాజీ రాజులు, భూస్వాములు) మరియు ధనిక రైతుల చేతుల్లో 75 శాతం భూమి కేంద్రీకృతమై ఉంది. కాగా భూదాహంతో నిండి గ్రామీణ ప్రాంత జనాభాలో 80 శాతంగా ఉన్న రైతుల చేతుల్లో కేవలం 25 శాతం భూమి మాత్రమే ఉంది.' ఈ విధంగా న్యూడెమోక్రసీ వారు వ్యవసాయక విప్లవ ప్రజాయుద్ధం కోసం ఇస్తున్న అర్ధ భూస్వామ్య గణాంకాలు మాట వరసకు చెప్పే లెక్కలు లాగే ఉన్నాయి. వాస్తవం ఏమిటి?

1970లో భారతదేశ వ్యవసాయ రంగంలో ఉత్పత్తి విధానమేమిటనే విషయంలో ఎంతోమంది మేధావులు చర్చించారు. టీజే బైర్స్ అనే మేధావి భారత ఆర్థిక విధానాన్ని 'సెమీ ఫ్యూడల్' అని 1960లో నిర్వచించారు. అయితే ప్రపంచమంతటా 'పారిశ్రామిక కేపిటలిజ'మే ఏకైక శక్తిగా రాజ్యమేలుతున్నప్పుడు సమకాలీన భారతదేశంలో రైతుకూలీల వ్యవసాయ ఆర్థిక స్వరూపాన్ని పాక్షిక ఫ్యూడల్ విధానంగా పేర్కొనటం అంత ఉపయోగకరం కాదని కూడా అంటాడు. వారు చెప్పినట్లు మన సమాజం పారిశ్రామిక కాపిటలిజాన్ని దాటి 1980 వ దశకం నుండి 'ఫైనాన్స్ కాపిటలిజం'లోకి ప్రవేశించింది.


మొత్తంగా భారత వ్యవసాయ వ్యవస్థపై జరిగిన చర్చ అనంతరం 'ఎలీస్ థార్నర్' 'భారతదేశంలో ఉత్పత్తి వ్యవస్థ స్పష్టంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థే'నని అంటారు. కాబట్టి కమ్యూనిస్టులు చెబుతున్నట్లు అర్ధవలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థ కాదనీ భారతదేశంలో ఉన్నది పెట్టుబడిదారి విధానమేననీ, దాన్ని అధ్యయనం చేసే శ్రద్ధలేని మార్క్సిస్టులు చైనాను గుడ్డిగా, యథాతథంగా అనుకరిస్తూ అర్ధ–భూస్వామ్య సూత్రీకరణ చేశారనీ ఆర్థిక శాస్త్రవేత్త అశోక్ రుద్ర 1970లోనే ఒక ఆరోపణ చేశారు. ఈ చర్చ ముగిసి ఐదు దశాబ్దాలు పూర్తికావచ్చినా నేటికీ ప్రధాన వామపక్షపార్టీలు, ఎమ్ ఎల్ పార్టీలతో సహా భారత వ్యవసాయం అర్ధఫ్యూడల్ అనే అవగాహనతోనే వున్నాయి. అలాగే వ్యవసాయం ప్రత్యక్షంగా పూర్తిగా పెట్టుబడిదారీ వ్యవస్థలో లీనమవుతున్న ఋజువులు కనబడుతూ వున్నాయి. ఈ కారణాన సాంప్రదాయక వామపక్ష ఉద్యమ సంస్థలు భ్రాంతి జనిత భూస్వామ్య భూతంపై పోరాటం మాని పెట్టుబడిదారీ దోపిడీకి గురవుతున్న వ్యవసాయ కార్మికులు, నిరుపేద రైతుల ప్రయోజనాల గురించి మాట్లాడ్డంపై, వారిని సంఘటితం చేయడంపై తమ దృష్టి పెట్టాలని ప్రఫుల్ బిద్వయ్ లాంటి వారు సూచిస్తున్నారు.

అయితే ఈ ఆర్థిక వేత్తలందరూ భారతీయ సమాజ ప్రత్యేక లక్షణమైన కుల వ్యవస్థను పరిగణనలోకి తీసుకోలేదు. పెట్టుబడిదారీ పూర్వ అవలక్షణమైన అగ్రకుల ఏకస్వామ్యాలను కమ్యూనిస్టులు బద్దలు చెయ్యరా? అందుకు కేవలం ఒక్క వ్యవసాయ రంగంలో భూములు పంచితే సరిపోతుందా? ఇలాంటి అంశాలపై చర్చ జరగాలి.

వ్యాసకర్త ఆర్థిక శాస్త్ర ఆచార్యులు । 9959649097

బూమి గుండ్రంగ దిర్గుతుంటె...

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

పొద్దు మీకింది. వాడకట్టుల దీపాలు ఎల్గినయి. మొగులు మీద చుక్కలు ఎల్లినయి. ఎప్పటి తీర్గనే ఆనంద్‌బాగ్ చౌరస్త కాడ్కి బోయిన. గాడ రవి పాన్ డబ్బ ఉన్నది. గది మా దోస్తుల అడ్డ. గా దినం నేను బోకముందు గాల్లు ఏం ముచ్చట బెట్టింద్రో నాకెర్కలేదు. గని నేను బోయినంక గాల్లు గీతీర్గ మాట్లాడుకుంద్రు.

''మొన్న గల్లిల కెల్లి వొస్తుంటె కుక్కలు యెంబడి బడ్డయి'' అని యాద్గిరి అన్నడు.

''యెంబడి బడితె ఏం జేసినవు?'' అని సత్నారి అడిగిండు.

''కుక్కలు యెంబడి బడినప్పుడు గల్లిల ఎవ్వలు లేకుండె. నేను కిల టమాటాలు ఇర్వై రూపాయలకే అని లాసిగ వొల్లిన. ఇగ దాంతోని ఇండ్లల్ల ఉన్నోల్లందరు నా తాన్కి ఉర్కొచ్చింద్రు. గాల్లను జూసి కుక్కలు ఉర్కినయి.''



''ఇంతకుముందు కిల టమాటాలు కొనెటోల్లు గిప్పుడు ఒక్క టమాటనే గొంటున్నరు. అమ్మెటోల్లు గుడ్క ఒక్క టమాట లెక్కనే అమ్ముతున్నరు. కొందరైతె టమాట తుక్డలను గూడ అమ్ముతున్నరు'' అని సత్నారి అన్నడు.

''టమాటల దొంగలున్నరని టమాటలు అమ్మెటోల్లు సి.సి. కెమెరలు బెట్టుకున్నరు. మా టమాట చేన్ల దొంగలు బడ్డరని కొంతమంది పోలీసోల్లకు షికాయత్ జేసింద్రు. టమాట దొంగలు దొరికితె గాల్లను ఎన్ని దినాలు జేల్ల ఉంచాలనో ఎర్కలేక పోలీసోల్లు నెత్తి గొట్టుకుంటున్నరు. కొందరు టమాటాలను బేంకులల్ల దాస్కుంటున్నరు. టమాటలు దాస్కునే తందుకు బేంకులల్ల ఫ్రిజ్‌లను ఉంచింద్రు. మదిని నిన్ను నెరనమ్మితినమ్మ మాతా దయగొను టమాట అని కొందరు పాడబట్టింద్రు. నిను వీడి క్షణమైన నేనుండలేను అనుకుంట బర్గర్ ఒక్కతీర్గ మొత్తుకోబట్టింది'' అని యాద్గిరి అన్నడు.

''మాతాన పట్టు చీరె గొంటె అర్ధ కిల టమాటలు ఫిరీగ ఇస్తం అని ఒక బట్టల దుక్నం అడ్వటేజ్‌మెంట్ ఇచ్చింది.''

''సెలబ్రిటిలకు బౌన్సర్లు ఉంటరు. ఉత్తర ప్రదేస్ వారణాసిల ఒక యాపారి టమాటలకు బౌన్సర్లను బెట్టిండు.''

''ఎందుకు బెట్టిండు?''

''టమాటలను ఎవ్వలు ఎత్క పోకుండ. టమాటలను కొనెతందుక్కు వొచ్చెటోల్లు కొట్లాడకుంట.''

''మహారాష్ట్రల గిప్పుడు త్రిబుల్ ఇంజన్ సర్కార్ నడుస్తున్నది.''

''గదెట్ల?''

''ఇంతకు ముందు బిజెపి, శివసేన సర్కార్ ఉంటె గాదాంట్ల గిప్పుడు ఎన్సీపీ గుడ్క షరీకైంది.''

''ఐఎఎస్ అఫ్సర్లు అర్వై ఏండ్లకు వజీప దీస్కుంటున్నరు. రాజకీయాలల్ల డెబ్బై ఐదేండ్లకు బిజెపి లీడర్లు వజీప దీస్కుంటున్నరు. కాకా మీకు గిప్పుడు ఎన్బై మూడేండ్లు. మీరు వజీప దీస్కోకుంటె ఏం బాగుంటది అనుకుంట శరద్ పవార్‌కు అజిత్ పవార్ వెన్నుపోటు పొడిసిండు. ఎన్సీపిని చీలగొట్టిండు. బిజెపి, శివసేన సర్కార్ల గల్సి ఉప ముఖ్యమంత్రి అయ్యిండు.''

''శరద్ పవార్‌కు అజిత్ వెన్నుపోటు ఎందుకు పొడిసిండు?''

''ఉద్దవ్ టాక్రేకు వెన్నుపోటు పొడ్సి శిండే ముఖ్యమంత్రి అయ్యిండు. గదే తీర్గ శరద్ పవార్‌కు వెన్నుపోటు పొడిస్తె ముఖ్యమంత్రి అయితనని.''

''మహారాష్ట్రల ఒక ముఖ్యమంత్రి, ఇద్దరు ఉప ముఖ్యమంత్రులుంటె ఒక ఫుల్ రొండు ఆఫ్‌లు అనబట్టింద్రు.''

''రామయ్య, సోమయ్య దోస్తులు, యాపారులు. సోమయ్య ఇనుప యాపారం జేస్తడు. ఒకపారి గాయిన పనిమీద నెలదినాలు ఊరికి బోయిండు. పోయే ముంగట ఇనుమును రామయ్య తాన దాసిపెట్టిండు. ఊరికెల్లి వొచ్చినంక నా ఇనుమును ఇయ్యుమని రామయ్యను అడిగితె నీ ఇనుమును ఎల్కలు దిన్నయని గాయిన జెప్పిండు.''

''గిప్పుడు గీ కత ఎందుకు జెప్తున్నవు?''

''తమిలనాడుల గూడ గిట్లే అయ్యింది. పోలీసోల్లు ఇర్వై రొండు కిలోల గంజాయిని పట్టుకున్నరు. కేసు విచారనకొచ్చినప్పుడు ఇర్వై ఒక్క కిలోల గంజాయిని ఎల్కలు దిన్నయని పోలీసోల్లు జెప్పింద్రు. ఇగ దాంతోని జడ్జి కేసు కొట్టేసిండు. గంజాయిని తినెతందుకే తమిలనాడుల ఎల్కలు పోలీస్ స్టేషన్లకు పోతున్నట్లు గొడ్తున్నది. గాడ ఎల్కలకు గుడ్క గంజాయి అల్వాటైంది. ఏంజేస్తం?''

''ఏదో ఒకటి జేసి అందరు తన దిక్కు జూసెటట్లు మంత్రి మల్లారెడ్డి జేస్కుంటడు.''

''గీపారి గాయిన ఏం జేసిండు?''

''మేడ్చెల్ మండలం గౌడవెల్లిల గాయిన నెత్తి మీద గొంగడి కప్పుకుండు. చేత్ల కట్టె బట్టుకుండు. గాయిన ముంగట గొర్లు ఉన్నయి. గవ్విటిని అదిలిచ్చుకుంట జెర్రంత దూరం ఉర్కిండు. ఎలచ్చన్లు దగ్గర బడుతుంటె ఎన్ని ఏసాలన్నా ఏస్తడు.''

''ధరని తోని గోల్‌మాల్ అయితున్నది. ఒకలి బూమి ఇంకొకల్కి బోతున్నదని రేవంత్‌రెడ్డి ఒక్క తీర్గ మొత్తుకుండు.''

''ధరని అంటె ఏంది, బూమి. బూమి గుండ్రగ దిర్గుతుంటె ఒకలి బూమి ఇంకొకలికి బోదా? అని ఒక బీఆర్ఎస్ లీడర్ అడిగిండు.''

గీ తీర్గ మా దోస్తులు ముచ్చట బెట్టింద్రు.

రచయిత సీనియర్ జర్నలిస్ట్
మొబైల్: 99591 50491

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** బ.త్రయోదశి రా. 8.29 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** మృగశిర రా. 1.04 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** ఉ. 5.48 నుండి 7.31 వరకు **దుర్ముహూర్తం:** ఉ. 5.34 నుండి 7.20 వరకు, **అమృతఘడియలు:** ప.3.53 నుండి 5.33 వరకు, **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.36, **సూర్యాస్తమయం:** 6.34, **శని త్రయోదశి.**

30 మంది డిప్యూటీ కలెక్టర్లకు బదిలీలు



- 9 మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లకు అదనపు కలెక్టర్లుగా బాధ్యతలు
- ఉత్తర్వులు జారీ చేసిన రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఎన్నికల ప్రక్రియలో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రెవెన్యూ శాఖలో బదిలీల ప్ర క్రియ మొదలైంది. ఈనెల 31లోపు రెవెన్యూ అధికారులను బదిలీ చేయాలన్న సీఈసీ ఆదేశాల నేపథ్యంలో 30 మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ఆ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిత్తల్ శుక్రవారం జీవో జారీ చేశారు. మరో 9 మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లకు వివిధ జిల్లాల అదనపు కలెక్టర్లుగా బా ధ్యతలు అప్పగించారు. ఈ ఉత్తర్వుల ప్రకారం స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెకర్లు ఆర్.డి. మాధురి (సంగారెడ్డి), శ్యాంప్రసాద్‌లాల్ (పెద్దపల్లి), విజేందర్‌రెడ్డి (మేడ్చల్–మల్కాజ్‌గిరి), యాదిరెడ్డి (నిజామాబాద్), మహేందర్‌జీ (హనుమకొండ), ఎం.వి. భూపాల్‌రెడ్డి (రంగారెడ్డి), లక్ష్మీకిరణ్ (కరీంనగర్), వెంకట్‌రెడ్డి (సూర్యాపేట), జె. శ్రీనివాస్ (నల్లగొండ)లకు అదనపు కలెక్టర్లుగా బాధ్యతలు అప్పగించారు. డిప్యూటీ కలెక్టర్లలో 25 మందికి స్థానచలనం కల్పించి ఆర్డీవోలుగా పోస్టింగ్‌లు ఇచ్చారు. మిగిలిన వారిని భూసేకరణ విభాగంలో, ఓఎస్డీ, ఎస్టేట్ అధికారులుగా నియమించారు. వీరు కాక మరో ఏడుగురు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, ఆరుగురు డిప్యూటీ కలెక్టర్లను ప్రభుత్వానికి రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు.

‘పాలమూరు–రంగారెడ్డి’ పాత ప్రాజెక్టే

కేడబ్ల్యూడీటీ–2కు తెలంగాణ ప్రభుత్వం స్పష్టీకరణ

- ఏపీ దాఖలు చేసిన ఐఏను కొట్టేయాలని విజ్ఞప్తి
- విచారణను సెప్టెంబర్ 25కు వాయిదా వేసిన కేడబ్ల్యూడీటీ–2



సాక్షి, హైదరాబాద్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పాత ప్రాజెక్టేనని తెలంగాణ ప్రభుత్వం తేల్చిచెప్పింది. అది కొత్త ప్రాజెక్టేనని.. దానికి నీటి కేటాయింపులు చేసే అధికారం కొత్త ట్రిబ్యునల్‌కే ఉందంటూ కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్(కేడబ్ల్యూడీటీ)–2 వద్ద ఏపీ ప్రభుత్వం వాదించిన నేపథ్యంలో అది ముమ్మాటికీ పాత ప్రాజెక్టేనని తెలంగాణ స్పష్టం చేసింది. చిన్న నీటివనరుల విభాగంలో మిగిలిన 45 టీఎంసీలు, కృష్ణా డెల్టాకు ఏపీ ప్రభుత్వం మళ్లించిన 80 టీఎంసీలకుగాను తమకు దక్కే 45 టీఎంసీలను కలిపి 90 టీఎంసీలను ఆ ప్రాజెక్టుకు కేటాయించామంటూ ట్రిబ్యునల్‌కు తెలంగాణ ప్రభుత్వం వివరించింది. విభజన చట్టం ప్రకారం ఆ ప్రాజెక్టుకు కృష్ణా బోర్డు, సీడబ్ల్యూసీ, అపెక్స్ కౌన్సిల్ ఆమోదం కోసం ప్రయత్నిస్తున్నామని.. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన ఐఏ(ఇంటర్ లోకేటరీ అప్లికేషన్)ను కొట్టేయాలని ట్రిబ్యునల్‌కు విజ్ఞప్తి చేసింది. రెండు రాష్ట్రాల వాదనలు విన్న ట్రిబ్యునల్.. తదుపరి విచారణను సెప్టెంబర్ 25కు వాయిదా వేసింది. సెప్టెంబర్ 25 నుంచి 27 వరకూ ట్రిబ్యునల్ విచారించనుంది. ఉమ్మడి రాష్ట్రానికి కేడబ్ల్యూడీటీ–2 కేటాయించిన జలాలను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు పంపిణీ చేసేందుకు జస్టిస్ బ్రిజేష్‌కుమార్ అధ్యక్షతన జస్టిస్ రామ్మోహన్‌రెడ్డి, జస్టిస్ ఎస్.తాళపత్ర సభ్యులుగా కేంద్రం ఏర్పాటుచేసిన ట్రిబ్యునల్ బుధవారం నుంచి విచారణను ప్రారంభించింది. బుధవారం, గురువారం తెలంగాణ సర్కార్ తరఫున సీనియర్ కౌన్సిల్ సీఎస్ వైద్యనాథన్ వాదనలు విన్పించగా.. శుక్రవారం ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ కౌన్సిల్ జయదీప్‌గుప్తా వాదనలు విన్పించారు.

తెలంగాణకు అన్యాయం చేశారు..

చిన్న నీటివనరుల విభాగంలో దశాబ్దాలుగా తాము ఏడాదికి సగటున 44 టీఎంసీలకు మించి వాడుకోలేదని.. కానీ విభజన సమయంలో 89 టీఎంసీలు వాడుకుంటున్నామని ఏపీ ప్రభుత్వం ఎత్తిచూపిందని ట్రిబ్యునల్‌కు తెలంగాణ సర్కార్ వివరించింది. ఆ క్రమంలోనే ఏపీకి 512, తమకు 299 టీఎంసీలు పంచుతూ అన్యాయం చేశారని పేర్కొంది.

మిగులు జలాలను వాడుకోవడానికే..

నికర జలాలను బేసిన్ పరిధిలోని ప్రాజెక్టులకు కేటాయించడానికే బచావత్ ట్రిబ్యునల్ తొలి ప్రాధాన్యత ఇచ్చిందని.. నికర జలాల్లో మిగులును మాత్రమే బేసిన్ ఆవల ప్రాజెక్టులకు కేటాయించిందని తెలంగాణ ప్రభుత్వం పేర్కొంది. పాలమూరు–రంగారెడ్డి బేసిన్ పరిధిలోని ప్రాజెక్టేనని.. ఆ ప్రాజెక్టుకు నీటి కేటాయింపులు న్యాయబద్ధమేనని స్పష్టం చేసింది. తెలంగాణ వాదనలు విన్నాక ట్రిబ్యునల్ చైర్మన్ బ్రిజేష్‌కుమార్ స్పందిస్తూ.. విభజన చట్టంలో సెక్షన్ 89 ప్రకారం కేటాయింపులు లేని ప్రాజెక్టులకు మాత్రమే నీటిని కేటాయించే అధికారం తమకు ఉందని.. నీటిని పునఃపంపిణీ చేసే అధికారం తమకు లేదని స్పష్టం చేశారు. దీనిపై తెలంగాణ సీనియర్ కౌన్సిల్ వైద్యనాథన్ స్పందిస్తూ.. అలాంటప్పుడు ఏపీ సర్కార్ దాఖలు చేసిన ఐఏను విచారించే అధికారం ట్రిబ్యునల్‌కు ఎలా ఉంటుందని ప్రశ్నించారు.

కేటాయింపులకు మించి వినియోగం: ఏపీ ఆరోపణ

తాము చేపట్టిన మిషన్ కాకతీయ విజయవంతమైందని తెలంగాణ సర్కారే చెబుతోందని.. దీన్ని బట్టి చూస్తే చిన్న నీటివనరుల విభాగంలో వాడుకుంటున్న నీటిపై తెలంగాణ చెబుతున్న లెక్కలు సరైనవి కావంటూ ట్రిబ్యునల్‌కు ఏపీ ప్రభుత్వ సీనియర్ కౌన్సిల్ జయదీప్‌గుప్తా వివరించారు.

గూడెం, మోదికుంట వాగులకు లైన్‌క్లియర్

సాక్షి, న్యూఢిల్లీ: గోదావరి జలాల ఆధారంగా చేపట్టిన కడెం (గూడెం) ఎత్తిపోతల పథకం, మోదికుంటవాగు ప్రాజెక్టులకు అత్యంత కీలకమైన సాంకేతిక సలహా కమిటీ (టీఏసీ) అనుమతులకు లైన్‌క్లియర్ అయింది. కేంద్ర జలశక్తి శాఖ వద్ద జరిగిన సమావేశంలో ఈ ప్రాజెక్టులకు తుది అనుమతులు లభించాయి. కేంద్ర జలశక్తి శాఖ జారీ చేసిన గెజిట్‌ను అనుసరించి ప్రాజెక్టులకు కచ్చితంగా టీఏసీ అనుమతులు పొందాల్సి ఉన్న నేపథ్యంలో ప్రస్తుత అనుమతులు రాష్ట్రానికి పెద్ద ఊరటనిచ్చాయి.

రాష్ట్ర సమాధానాలతో సంతృప్తి...

రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే ఈ రెండు ప్రాజెక్టుల సమగ్ర ప్రాజెక్టు నివేదికలను కేంద్ర జల సంఘానికి, గోదావరి బోర్డుకు సమర్పించింది. వాటిపై సీడబ్ల్యూసీ, బోర్డులు లేవనెత్తిన అన్ని ప్రశ్నలకు సమాధానమిచ్చింది. వాటికి సంతృప్తి వ్యక్తం చేసిన బోర్డు, రెండు ప్రాజెక్టులకు టీఏసీ అనుమతులపై కేంద్ర జలశక్తి శాఖకు సిఫార్సు చేసింది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్, అదనపు కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ, సీడబ్ల్యూసీ చైర్మన్ కుష్విందర్ వోహ్రాతోపాటు వివిధ విభాగాల సీఈలు సమావేశమై ప్రాజెక్టుల అనుమతులపై చర్చించారు. ఈ భేటీకి తెలంగాణ తరఫున నీటి పారుదలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్, ఈఎన్సీలు మురళీధర్, హరిరామ్, సీఈలు శ్రీనివాస్, విజయ్‌భాస్కర్, సీఎం ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే, మహబూబ్ హుస్సేన్‌లు హాజరై కమిటీ సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

- వెయిటింగ్‌లో ఉన్న ఎనిమిది మంది అధికారులకు పోస్టింగ్‌లు
- 14 జిల్లాల అదనపు కలెక్టర్లు బదిలీ.. ముగ్గురికి కలెక్టర్లుగా పదోన్నతి
- ఒకరికి మున్సిపల్ కమిషనర్ బాధ్యతలు.. మరొకరికి పీవో ఐటీడీఏ పోస్టింగ్
- సీనియర్ అధికారులు శశాంక్ గోయల్, శైలజా రామయ్యర్‌లకు పోస్టింగ్‌లు
- హైదరాబాద్ కలెక్టర్‌గా అనుదీప్ దురిశెట్టి.. ఆయుష్ డైరెక్టర్‌గా హరిచందన
- ఇల త్రిపాఠి, ముజమిల్ ఖాన్, ప్రియాంకా ఆలకు కలెక్టర్లుగా పదోన్నతి
- భద్రాచలం ఐటీడీఏ పీవోగా ప్రతీక్ జైన్.. మొత్తం 31 మందికి కొత్త పోస్టింగ్‌లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పలువురు ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎనిమిది మంది వెయిటింగ్‌లో ఉన్న అధికా రులకు ప్రభుత్వం పోస్టింగ్‌లు ఇచ్చింది. సీని యర్ ఐఏఎస్ అధికారులు శశాంక్ గోయల్, శైలజా రామయ్యర్‌ల సేవలను ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ, యువజన సర్వీసుల శాఖలో వినియోగించుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు వెయిటింగ్‌లో ఉన్న 1990 బ్యాచ్ ఐఏఎస్ అధికారి శశాంక్ గోయల్‌కు మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ) డైరెక్టర్ జనరల్‌గా పోస్టింగ్ ఇవ్వగా, 1997 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి శైలజా రామయ్యర్‌ను యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించింది. శాట్స్ ఎండీగా, ఆర్కియాలజీ డైరెక్టర్‌గా ఆమెకు అదనపు బాధ్యతలు అప్పగించింది. అలాగే వెయిటింగ్‌లో ఉన్న అధికారులు హరిచందన, వర్షిణి, హైమావతి, నిఖిల, సత్యశారదాదేవి, అరుణశ్రీలకు పోస్టింగ్‌లు ఇచ్చింది. జీహెచ్‌ఎంసీలో అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న ప్రియాంకా ఆలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌గా నియమించింది. అదే విధంగా ములుగు అదనపు కలెక్టర్‌గా ఉన్న ఇల త్రిపాఠికి అదే జిల్లా కలెక్టర్‌గా, సిద్దిపేట అదనపు కలెక్టర్ ముజమిల్‌ఖాన్‌కు పెద్దపల్లి కలెక్టర్‌గా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్‌గా ఉన్న అనుదీప్ దురిశెట్టికి హైదరాబాద్ కలెక్టర్‌గా పదోన్నతి కల్పించింది. పెద్దపల్లి కలెక్టర్‌గా ఉన్న సంగీత సత్యనారాయణను టీఎస్ ఫుడ్స్ ఎండీగా, ములుగు కలెక్టర్ కృష్ణ ఆదిత్యను కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) సభ్య కార్యదర్శిగా నియమించింది. జగిత్యాల అదనపు కలెక్టర్‌గా ఉన్న మంద మకరందుకు నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించింది. ప్రభుత్వం మొత్తం 14 మంది అదనపు కలెక్టర్లను ఈసారి బదిలీ చేయడం గమనార్హం

అధికారుల బదిలీల వివరాలివీ..

ఐఏఎస్	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
శశాంక్ గోయల్	వెయిటింగ్	డీజీ, ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ
శైలజా రామయ్యర్	వెయిటింగ్	ముఖ్య కార్యదర్శి, యువజన సర్వీసులు (శాట్స్ ఎండీ, ఆర్కియాలజీ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు)
దాసరి హరిచందన	వెయిటింగ్	డైరెక్టర్, ఆయుష్
అలుగు వర్షిణి	వెయిటింగ్	డైరెక్టర్, చేనేత జౌళి శాఖ
కొర్రా లక్ష్మి	డైరెక్టర్, ఆర్ట్ గ్యాలరీ	డైరెక్టర్, స్పోర్ట్స్ (ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు)
కె. హైమావతి	వెయిటింగ్	డైరెక్టర్, ఎయిడ్స్ సొసైటీ
కె. హరిత	అడిషనల్ కమిషనర్, జీహెచ్‌ఎంసీ	జాయింట్ సెక్రటరీ, ఫైనాన్స్
కె. స్వర్ణలత	జేసీ, భూపాలపల్లి	జీఏడీ రిపోర్టింగ్
కె. నిఖిల	వెయిటింగ్	డైరెక్టర్, టూరిజం
ఎం. సత్యశారదాదేవి	వెయిటింగ్	డిప్యూటీ సెక్రటరీ, అగ్రికల్చర్
ప్రియాంక ఆల	అదనపు కమిషనర్, జీహెచ్‌ఎంసీ	కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం
ఇల త్రిపాఠి	అదనపు కలెక్టర్, ములుగు	కలెక్టర్, ములుగు
కృష్ణ ఆదిత్య	కలెక్టర్, ములుగు	పీసీబీ సభ్యకార్యదర్శి
ముజమిల్ ఖాన్	అదనపు కలెక్టర్, సిద్దిపేట	కలెక్టర్, పెద్దపల్లి
సంగీత సత్యనారాయణ	కలెక్టర్, పెద్దపల్లి	ఎండీ, టీఎస్ ఫుడ్స్
ప్రతీక్ జైన్	అదనపు కలెక్టర్, రంగారెడ్డి	పీవో, ఐటీడీఏ, భద్రాచలం
గౌతమ్ పొత్రు	పీవో, ఐటీడీఏ, భద్రాచలం	సీఈవో, సెర్ప్
వెంకట్ ధోత్రే	అదనపు కలెక్టర్, కామారెడ్డి	అదనపు కలెక్టర్, మహబూబ్‌నగర్
అభిలాష అభినవ్	అదనపు కలెక్టర్, మహబూబాబాద్	అదనపు కలెక్టర్, ఖమ్మం
స్నేహ శబరీశ్	అదనపు కలెక్టర్, ఖమ్మం	అదనపు కలెక్టర్, జీహెచ్‌ఎంసీ
మను చౌదరి	అదనపు కలెక్టర్, నాగర్‌కర్నూల్	అదనపు కలెక్టర్, కామారెడ్డి
టి.ఎస్. దివాకర	అదనపు కలెక్టర్, భూపాలపల్లి	అదనపు కలెక్టర్, జగిత్యాల
అనుదీప్ దురిశెట్టి	అదనపు కలెక్టర్, భద్రాద్రి	కలెక్టర్, హైదరాబాద్
కుమార్ దీపక్	అదనపు కలెక్టర్, పెద్దపలి	అదనపు కలెక్టర్, నాగర్‌కర్నూల్
సి.హెచ్. ప్రియాంక	జెడ్పీ సీఈవో, కరీంనగర్	అదనపు కలెక్టర్, పెద్దపల్లి
జల్ద అరుణశ్రీ	వెయిటింగ్	అదనపు కలెక్టర్, కరీంనగర్
బదుగు చంద్రశేఖర్	అదనపు కలెక్టర్, నిజామాబాద్	అదనపు కలెక్టర్, సంగారెడ్డి
ఇ. నవీన్ నికోలస్	జేసీ కరీంనగర్	ఎస్సీ, ఎస్టీ గురుకుల సొసైటీల కార్యదర్శి
ప్రతిమా సింగ్	అదనపు కలెక్టర్, మెదక్	అదనపు కలెక్టర్, రంగారెడ్డి
గరీమా అగర్వాల్	అదనపు కలెక్టర్, కరీంనగర్	అదనపు కలెక్టర్, సిద్దిపేట
మంద మకరందు	అదనపు కలెక్టర్, జగిత్యాల	నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్

తల్లి కొట్టిందని బాలుడి ఆత్మహత్య

- స్నేహితుడికి సెల్ఫీ వీడియో పంపి బలవన్మరణం
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఘటన



ఉరివేసుకుంటున్నానని వీడియోలో చెపుతున్న దినేశ్

కోనరావుపేట (వేములవాడ): ‘‘ఊర్లో బతుకబుద్ధి అవ్వతలే. వేరేవాళ్లు చెప్పే మాటలకు బాధనిపిస్తోంది. అమ్మా.. నన్ను కొట్టినందుకు బాధలేదు. చెల్లిని మంచిగా చూసుకో. ఈ పేదబతుకు నాకొద్దు. చెల్లెకు మంచిగా పెళ్లి చేయండి. అమ్మా.. అన్నా.. బావా.. డాడీ.. నేను వెళ్తున్నా..’’ అని ఓ బాలుడు స్నేహితుడికి సెల్ఫీ వీడియో పంపి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని కమ్మరిపేటతండాలో ఈ ఘటన జరిగింది. కమ్మరిపేటతండా (వట్టిమల్ల)కు చెందిన భూక్యా రాజు, జ్యోతి దంపతులకు దినేశ్, దీప్తి అనే పిల్లలు ఉన్నారు. దినేశ్ (17) గతేడాది వరకు కోనరావుపేట మండలంలోని ధర్మారం హాస్టల్‌లో ఉంటూ ఎనిమిదో తరగతి వరకు చదువుకున్నాడు. ఈ ఏడాది చదువు ఆపేసి ఇంటి వద్దనే ఉంటున్నాడు. రెండు రోజుల క్రితం ఓ దుకాణంలో సిగరెట్ ప్యాకెట్ దొంగిలించాడని దుకాణం యజమా ని దినేశ్ తల్లిదండ్రులకు చెప్పగా.. తల్లి కోపంతో దినేశ్‌ను కొట్టింది. దీంతో గురువారం ఉదయం 10 గంటలకు దినేశ్ ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. స్నేహితుల దగ్గరికి వెళ్లాడని భావించిన తల్లిదండ్రులు వరినాట్లు వేసేందుకు పొలానికి వెళ్లారు.

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వీడియో..

గురువారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిన దినేశ్, తాను చనిపోతున్నానంటూ సెల్ఫీ వీడియో తీసి స్నేహితునికి పంపాడు. అయితే అతను పాఠశాలకు వెళ్లిపోగా.. సెల్‌ఫోన్‌ను అతని తండ్రి తీసుకెళ్లాడు. రాత్రి పది గంటలకు స్నేహితుడి తండ్రి ఇంటికొచ్చాక వీడియో చూసి వెంటనే దినేశ్ తల్లిదండ్రులకు చెప్పాడు. అందరూ కలసి దినేశ్ కోసం అటవీ ప్రాంతంలో గాలించారు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు వట్టిమల్ల శివారు అటవీ ప్రాంతంలో దినేశ్ మృతదేహం చెట్టుకు వేలాడుతూ కనిపించింది. కోనరావుపేట ఎస్సై రమాకాంత్ ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. తమ కుమారుని మృతికి దుకాణం యజమాని మాలోత్ కాంతి కారణమని మృతుని తండ్రి రాజు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తెయూ ఇన్‌చార్జి వీసీగా వాకాటి కరుణ

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్‌గా రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కళాశాల విద్యా కమిషనర్ వాకాటి కరుణను నియమిస్తూ ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. తెయూ వీసీగా ఉన్న ప్రొఫెసర్ డి.రవీందర్ వర్సిటీ పరిధిలోని అనుబంధ ప్రైవేట్ డిగ్రీ కళాశాలకు పరీక్ష కేంద్రాన్ని కేటాయించేందుకు రూ.50 వేలు లంచం తీసుకుంటూ జూన్ 17న ఏసీబీ అధికారులకు పట్టుబడి జైలుకు వెళ్లిన విషయం తెలిసిందే. సుమారు నెలరోజులుగా వీసీ లేక పాలనకు ఆటంకం ఏర్పడి.. విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులు పడ్డారు.

మామా.. మేమొస్తున్నాం...!

చంద్రయాన్-3 ప్రయోగం దిగ్విజయం • ముచ్చటగా మూడోసారి విజయవంతం • సూటిగా కక్ష్యలోకి చేరిన ఉపగ్రహం

- మళ్లీ సత్తా చాటిన బాహుబలి రాకెట్
- చంద్రుని చేరే దిశగా కీలక ముందడుగు
- ఇస్రో కీర్తికిరీటంలో మరో కలికితురాయి
- ఫలించిన శాస్త్రవేత్తల కృషి, దేశమంతా సంబరాలు
- రాష్ట్రపతి, ప్రధాని తదితరుల ప్రశంసలు
- ఆగస్టు 23న చంద్రుడిపై దిగనున్న ల్యాండర్, రోవర్
- ఆ తర్వాత చంద్రుడిపై కీలక పరిశోధనలు



అది శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష ప్రయోగ (షార్) కేంద్రం. అటు ఇస్రో శాస్త్రవేత్తలు, ఇటు యావద్దేశం ఊపిరి కూడా బిగబట్టి మరీ అత్యంత ఉత్కంఠగా ఎదురు చూస్తున్న వేళ. శుక్రవారం మధ్యాహ్నం 2.35 గంటలైంది. 25.3 గంటల కౌంట్‌డౌన్‌కు నరాలు తెగే ఉత్కంఠ నడుమ ఎట్టకేలకు తెర పడింది. ఆ వెంటనే ఇస్రో బాహుబలి ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకెళ్లింది. గత వైఫల్యాల నేపథ్యంలో అంతటా ఉద్విగ్న వాతావరణం. అందరిలోనూ మరింత ఉత్కంఠ. మనసు మూలల్లో ఎక్కడో కాసింత అనుమానం. కానీ, ఉత్కంఠకు తెర దించుతూ, అనుమానాలను పటాపంచలు చేస్తూ మన బాహుబలి దిగ్విజయంగా రోదసి చేరింది. అంతరిక్ష సీమలో విజయనాదం చేసింది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) పదేళ్ల కల నెరవేరింది. చంద్రయాన్-1, 2 ప్రయోగాలు నిరాశ పరిచినా పట్టు వీడకుండా మొక్కవోని దీక్షతో మన శాస్త్రవేత్తల బృందం రాత్రింబవళ్లు పడిన కష్టం ఎట్టకేలకు ఫలించింది. ముచ్చటగా మూడోసారి చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతమైంది. మూడు దశల ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ చంద్రయాన్-3 త్రీ-ఇన్-వన్ మిషన్‌ను విజయవంతంగా రోదసి చేర్చి కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. దాంతో ఇస్రో శాస్త్రవేత్తల్లో ఆనందం వెల్లివిరిసింది. దేశమంతా సంబరాల్లో మునిగిపోయింది. రాష్ట్రపతి, ప్రధాని మొదలుకుని ప్రముఖులంతా ఇస్రోను, ఇంతటి విజయానికి కారకులైన శాస్త్రవేత్తల బృందాన్ని అభినందనలతో ముంచెత్తారు.

\- సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా)

ఆ ఉద్విగ్న క్షణాలు...

తిరుపతి జిల్లాలోని శ్రీహరికోట షార్ కేంద్రం నుంచి శుక్రవారం చేపట్టిన చంద్రయాన్-3 ప్రయోగం సూపర్ సక్సెసైంది. 640 టన్నుల ఎల్‌వీఎం3-ఎం4 ఉపగ్రహ వాహకనౌక, 3,920 కిలోల చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని మోసుకుని నింగివైపునకు వేగంగా దూసుకెళ్లింది. వెంటనే మిషన్ కంట్రోల్ రూంలోని శాస్త్రవేత్తలు టెన్షన్‌గా కంప్యూటర్లను ఆపరేట్ చేస్తూ కంటిమీద రెప్ప వాల్చకుండా రాకెట్ గమనాన్ని పరిశీలించారు. మూడు దశలతో కూడిన ప్రయోగాన్ని 16.09 నిమిషాల్లో పూర్తిచేశారు. చంద్రయాన్-3 మిషన్‌ను భూమికి 36,500 కిలోమీటర్ల ఎత్తులో హైలీ ఎసెంట్రిక్ ఆర్బిట్ (అత్యంత విపరీత కక్ష్య)లోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. అంతరిక్ష ప్రయోగాల్లో ఇస్రోకు ఇది 89వ విజయం. గ్రహాంతర ప్రయోగాల్లో చంద్రయాన్-3 నాలుగో ప్రయోగం కాగా చంద్రునిపై పరిశోధనల నిమిత్తం చేసిన ప్రయోగాల్లో మూడోది. ఇది ఇస్రో బాహుబలి రాకెట్ జీఎస్ఎల్‌వీ మార్క్-3 సిరీస్‌లో మూడు ప్రయోగాలు, ఎల్‌వీఎం-3గా పేరు మార్చాక నాలుగో ప్రయోగం! కార్యక్రమాన్ని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ, ప్రధాని కార్యాలయ ప్రతినిధి జితేంద్రసింగ్ స్వయంగా షార్ కేంద్రం నుంచి వీక్షించారు.

ప్రయోగం జరిగిందిలా...

- 640 టన్నులు, 43.43 అడుగుల పొడవున్న ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ 3,920 కిలోల చంద్రయాన్-3 మిషన్ మోసుకెళ్లింది.
- చంద్రయాన్-3లో 2,145 కిలోల ప్రొపల్షన్ మాడ్యూల్, 1,749 కిలోల ల్యాండర్ (విక్రమ్), 26 కిలోల రోవర్ (ప్రజ్ఞాన్)ల్లో ఆరు ఇండియన్ పేలోడ్స్, ఒక అమెరికా పేలోడ్ అమర్చి పంపారు.
- ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ తొలి దశలో ఇరువైపులా అత్యంత శక్తిమంతమైన ఎస్-200 బూస్టర్ల సాయంతో నింగికి దిగ్విజయంగా ప్రయాణం ప్రారంభించింది.
- ఈ దశలో రెండు స్ట్రాపాన్ బూస్టర్లలో 400 టన్నుల ఘన ఇంధనాన్ని వినియోగించి 127 సెకెండ్లలో తొలి దశను విజయవంతంగా పూర్తి చేశారు.
- ద్రవ ఇంజిన్ మోటార్లతో కూడిన రెండో దశ (ఎల్-110) 108.10 సెకన్లకే మొదలైంది.
- 194.96 సెకన్లకు రాకెట్ అగ్ర భాగాన అమర్చిన చంద్రయాన్-3 మిషన్ హీట్ షీల్డులు విజయవంతంగా విడిపోయాయి.
- 110 టన్నుల ద్రవ ఇంధనాన్ని మండించి 305.56 సెకన్లకు రెండోదశను కూడా విజయవంతంగా పూర్తి చేశారు.
- అత్యంత కీలకమైన మూడో దశలో 307.96 సెకన్లకు క్రయోజనిక్ (సీ-25) మోటార్లను మండించారు. 954.42 సెకన్లకు 25 టన్నుల క్రయోజనిక్ ఇంధనాన్ని వినియోగించి మూడో దశను విజయవంతంగా పూర్తి చేశారు.
- రాకెట్ అగ్ర భాగాన అమర్చిన త్రీ ఇన్ వన్ చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని ఈ దశలోనే 969 సెకన్లకు (16.09 నిమిషాల వ్యవధిలో) భూమికి దగ్గరగా (పెరిజీ)170 కిలోమీటర్లు, దూరంగా (అపోజీ) 36,500 కిలోమీటర్ల ఎత్తులో హైలీ ఎసెంట్రిక్ ఆర్బిట్ (అత్యంత విపరీత కక్ష్య)లోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు.

14 రోజులు, 500 మీటర్లు...

- ల్యాండర్ నుంచి రోవర్ చంద్రుని ఉపరితలంపై దిగేందుకు 4 గంటల సమయం తీసుకుంటుందని అంచనా.
- రోవర్ సెకనుకు సెంటీమీటర్ వేగంతో కదులుతుంది. రోవర్ ఒక లూనార్ డే (చంద్రుని రోజు-మన లెక్కలో 14 రోజులు) పని చేస్తుంది.
- ఆ 14 రోజుల వ్యవధిలో రోవర్ 500 మీ టర్లు ప్రయాణించి చంద్రుని ఉపరితలంపై మూలమూలలనూ శోధించి భూ నియంత్రిత కేంద్రానికి కీలక సమాచారం చేరవేస్తుంది.
- ఇప్పటిదాకా చంద్రుడిపై పరిశోధనలు చేసే దేశాల్లో మనది నాలుగో స్థానం. గతంలో రష్యా, అమెరికా, చైనా మాత్రమే ఇలాంటి ప్రయోగాలు చేశాయి.
- చంద్రయాన్-1తో ఉపగ్రహాన్ని చంద్రుని చుట్టూ పరిభ్రమించేలా చేసిన తొలి దేశంగా భారత్ నిలిచింది.
- చంద్రయాన్-2 ద్వారా ల్యాండర్, రోవర్‌తో చంద్రుని ఉపరితలంపై పరిశోధనలు చేయాలని సంకల్పించగా ఆ ప్రయోగం దురదృష్టవశాత్తూ చివరి రెండు నిమిషాల్లో చంద్రుని ఉపరితలాన్ని ఢీకొని సిగ్నల్స్ అందకుండా పోయాయి. దీన్ని ఇస్రో శాస్త్రవేత్తలు సవాలుగా తీసుకుని నిరంతరం శ్రమించి చంద్రయాన్-2 సాంకేతిక లోపాలను సరిదిద్దుకుని నాలుగేళ్ల తరువాత చంద్రయాన్-3ని దిగ్విజయంగా చంద్రుని కక్ష్యలోకి పంపారు.



చంద్రయాన్-3 సక్సెస్‌తో హైదరాబాద్‌లో త్రివర్ణ పతాకాలతో స్కూల్ విద్యార్థుల ఆనందం

చంద్రుడిపైకి ఇలా వెళ్తుంది...

- చంద్రయాన్-3 మిషన్ మరో 41 రోజుల్లో, అంటే ఆగస్టు 23న సాయంత్రం 5.47 గంటలకు చంద్రుని ఉపరితలంపై దిగుతుంది.
- 16 రోజుల్లో ప్రొపల్షన్ మాడ్యూల్‌లో నింపిన 1,696 కిలోల ఇంధనాన్ని మండించి నాలుగు సార్లు కక్ష్య దూరాన్ని పెంచే ప్రక్రియను చేపడతారు.
- ఆగస్టు 1న ఐదోసారి ప్రొపల్షన్ మాడ్యూల్‌ను ట్రాన్స్ లూనార్ ఇంజెక్షన్ ద్వారా చంద్రుని దిశగా మళ్లిస్తారు.
- తర్వాత ప్రొపల్షన్ మాడ్యూల్‌కు చంద్రుని చుట్టూ కక్ష్య ఏర్పరిచేందుకు రెట్రో బర్న్ చేసి 100 కిలోమీటర్ల వృత్తాకార కక్ష్యను తగ్గించే ప్రక్రియను నాలుగుసార్లు చేపడతారు.
- అలా ఆగస్టు 17న చంద్రయాన్-3 చంద్రుని కక్ష్యలోకి వెళుతుంది. తరవాత ప్రొపల్షన్ మాడ్యూల్ తన ఎత్తును 100 కిలోమీటర్ల నుంచి 30 కిలోమీటర్లకు తగ్గించుకుంటూ ల్యాండర్‌ను విడిచిపెడుతుంది.
- తరవాత ల్యాండర్‌లోని ఇంధనాన్ని కూడా మండించి ఆగస్టు 23న చంద్రుని దక్షిణ ధ్రువ ప్రాంతంలో మృదువైన ప్రదేశంలో సాఫ్ట్ లాండింగ్ చేసేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు ప్రయత్నాలు చేస్తున్నారు.
- ల్యాండర్ విడిపోయిన తరువాత ల్యాండర్‌ను 15 నిమిషాల పాటు మండించి దాన్ని చంద్రుడి ఉపరితలంపై దించే ప్రక్రియను ఇస్రో శాస్త్రవేత్తలు అత్యంత కీలకంగా భావిస్తున్నారు.
- ఇప్పటి దాకా ఇలాంటి ల్యాండింగ్ ఎవరూ చేయలేదు. మొట్టమొదటిగా భారతే చేయడంతో ప్రపంచమంతా ఇస్రో వైపు చూస్తోంది.
- చంద్రయాన్-1లో వాడిన పరిజ్ఞానాన్నే చంద్రయాన్-2లోనూ వాడారు. చంద్రయాన్-3 ప్రయోగాన్ని కూడా చంద్రయాన్-2 తరహాలోనే నిర్వహించారు.
- చంద్రయాన్-2లో ల్యాండర్, రోవర్లను తీసుకెళ్లిన ఆర్బిటర్ ఇప్పటికీ చంద్రుని కక్ష్యలోనే పని చేస్తూ విలువైన సమాచారం అందిస్తూనే వుంది.
- అందుకే ఈసారి ఆర్బిటర్‌కు బదులు ప్రొపల్షన్ మాడ్యూల్ ద్వారా ల్యాండర్, రోవర్లను పంపారు.
- ఈ ప్రయోగంలో ఇస్రో తొలిసారిగా థొరెటల్-ఆబల్ అనే లిక్విడ్ ఇంజన్లను చంద్రుని ఉపరితలంపై మృదువైన చోట ల్యాండర్‌ను సురక్షితంగా దించేందుకు ఇప్పట్నుంచే ప్రయత్నిస్తున్నారు.

క్లుప్తంగా...

జస్టిస్ భుయాన్, జస్టిస్ భట్టి ప్రమాణ స్వీకారం

సాక్షి, న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ ఎస్‌వీ భట్టి ప్రమాణ స్వీకారం చేశారు. సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ శుక్రవారం వారిద్దరితో ప్రమాణ స్వీకారం చేయించారు. వీరిద్దరి నియామకంతో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 32కు చేరుకుంది. సుప్రీంకోర్టులో ఇంకా ఇద్దరు న్యాయమూర్తులను భర్తీ చేయాల్సి ఉంది.

ఆస్పర్టెమ్‌తో క్యాన్సర్ ముప్పు



లియోన్: డైట్ సోడా తదితర ఎన్నో ఆహారపదార్థాల్లో వాడే నాన్ షుగర్ స్వీట్‌నర్(ఎన్ఎస్ఎస్) ఆస్పర్టెమ్‌తో కేన్సర్ వచ్చేందుకు అవకాశాలున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) హెచ్చరించింది. తమ అధ్యయనంలో తేలిందని డబ్ల్యూహెచ్‌వో అనుబంధ విభాగమైన ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్ కేన్సర్(ఐఏఆర్‌సీ) తెలిపింది. ఆస్పర్టెమ్‌లో కేన్సర్ కారకాలుండేందుకు అవకాశమున్నట్లు మనుషులు, జంతువులపై జరిపిన అధ్యయనాల్లో తేలిందని ఐఏఆర్‌సీ తెలిపింది. అయితే, ఆస్పర్టెమ్ పరిమిత వాడకం సురక్షితమేనంటూ ఐరాసలోని ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్(ఎఫ్ఏఓ), డబ్ల్యూహెచ్‌వో ఎంపిక చేసిన నిపుణుల కమిటీ నిగ్గు తేల్చింది. దీనిపై డబ్ల్యూహెచ్‌వో న్యూట్రిషన్ డైరెక్టర్ డాక్టర్ ఫ్రాన్సెస్కో బ్రాంకా మాట్లాడుతూ.. ఆస్పర్టెమ్‌ను మొత్తానికే మానేయాలని అనడం లేదు, మితంగా వాడాలని మాత్రమే చెబుతున్నామన్నారు. అత్యధికంగా వాడే వారు మాత్రమే తగ్గించుకోవాల్సి ఉంటుంది. కాస్త ఎక్కువగా వాడినా ఎటువంటి అనర్థాలు ఉండవని బ్రాంకా చెప్పారు. 'ఆస్పర్టెమ్‌తో కాలేయ క్యాన్సర్ రావొచ్చనేందుకు మాత్రం ఆధారాలు పరిమితంగానే లభించాయి. ప్రస్తుతం వినియోగించే స్థాయిల్లో ఆస్పర్టెమ్ ప్రమాదకరమని చెప్పేందుకు బలమైన ఆధారం దొరకలేదు. ఆమోదయోగ్యమైన వినియోగ స్థాయిలకు సంబంధించిన మార్గదర్శకాల్లో మార్పులేదు. పరిమితంగా, మార్గదర్శకాలకు లోబడి వాడితే ఆస్పర్టెమ్ వల్ల సాధారణంగా ఎటువంటి హాని కలగదు'అని ఎఫ్‌డీఏ తెలిపింది. సాధారణంగా రోజుకు 14 కేన్ల వరకు ఆస్పర్టెమ్ ఉన్న డ్రింకులను తాగొచ్చునని కేంబ్రిడ్జి యూనివర్సిటీ ప్రొఫెసర్ డేవిడ్ స్పీగెల్‌హాల్టెర్ తెలిపారు.

కునో నేషనల్ పార్కులో 8వ చీతా మృతి



భోపాల్: మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్క్‌లో మూడు రోజుల వ్యవధిలో మరో చీతా చనిపోయింది. దీంతో, ఈ ఏడాది మార్చి నుంచి చనిపోయిన చీతాల సంఖ్య ఎనిమిదికి చేరుకుంది. మూడు రోజుల క్రితం తేజస్ అనే చీతా చనిపోయింది. 'సూరజ్ అనే చీతా పల్పూర్ ఫారెస్ట్ రేంజ్‌లోని మసావనీ బీట్‌లో శుక్రవారం ఉదయం పడుకుని ఉండగా గమనించాం. మానిటరింగ్ టీం దగ్గరికెళ్లి చూడగా దాని మెడపై కీటకాలు ఎగురుతూ కనిపించాయి. సిబ్బందిని చూసి అది పరుగుతీసింది. ఉదయం 9 గంటల సమయంలో సూరజ్ చనిపోయినట్లు వైద్య నిపుణులు, అటవీ అధికారుల బృందం గుర్తించింది'అని అధికారి ఒకరు వెల్లడించారు. ఫ్రీ రేంజ్ ప్రాంతంలో చీతా చనిపోవడం ఇదే మొదటిసారి. సూరజ్ మెడ, వీపుపై గాయాల గుర్తులున్నాయి. నిపుణుల సవివర నివేదిక అందాల్సి ఉందని అ అధికారి తెలిపారు. దేశం నుంచి కనుమరుగైన చీతాల సంతతిని తిరిగి పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం గత ఏడాది సెప్టెంబర్‌లో నమీబియా నుంచి 8 చీతాలను, ఈ ఏడాది ఫిబ్రవరిలో దక్షిణాఫ్రికా నుంచి మరో 12 చీతాలను తీసుకువచ్చింది. మరో నాలుగు కూనలు పుట్టడంతో మొత్తం చీతాల సంఖ్య 24కు చేరుకుంది. వివిధ కారణాలతో 8 చనిపోవడంతో ప్రస్తుతం వీటి సంఖ్య 16కు తగ్గిపోయింది.

మనకిక ఆకాశమే హద్దు

మంత్రి జితేంద్రసింగ్, ఇస్రో చైర్మన్ సోమనాథ్

చంద్రయాన్-3 ప్రయోగం నిజంగా సవాలేనని ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ అన్నారు. ప్రయోగం విజయవంతమయ్యాక ఆయన మీడియాతో మాట్లాడారు. దేశీయంగా రూపొందించిన ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ ద్వారా ప్రయోగం తొలి దశను విజయవంతం చేసినందుకు గర్వంగా ఉందన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు కలసికట్టుగా పని చేయడమే ఇంతటి భారీ విజయానికి కారణమన్నారు. ''ఇక రాబోయే 41 రోజులు అత్యంత కీలకం. ఆగస్టు 23న ల్యాండర్‌ను చంద్రునిపై విజయవంతంగా దించేందుకు ప్రయత్నిస్తాం. ఆగస్టు మూడో వారంలో సూర్యుడిపై పరిశోధనలకు ఆదిత్య-ఎల్1 ఉపగ్రహాన్ని ప్రయోగిస్తాం. మిషన్ సూర్య, చంద్ర రెండింటినీ పూర్తి చేస్తామని నమ్మకముంది'' అని చెప్పారు.



చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం అయ్యాక శాస్త్రవేత్తలతో కలిసి కేంద్రమంత్రి, పీఎం కార్యాలయం ప్రతినిధి డాక్టర్ జితేంద్రసింగ్, ఇస్రో చైర్మన్ సోమనాథ్ సంబరాలు

సాంకేతిక పరిజ్ఞానంలో త్వరలో భారత్ ప్రపంచంలోనే తొలి స్థానానికి చేరనుందని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి జితేంద్రసింగ్ అన్నారు. ఆగస్టు 23న ల్యాండర్ చంద్రునిపై దిగితే అంతరిక్ష ప్రయోగాల్లో భారత్‌కు ఆకాశమే హద్దన్నారు. ఇస్రో చైర్మన్‌తో కలిసిరాకెట్, చంద్రయాన్-3 నమూనాలను ఆయన ఆవిష్కరించారు. భేటీలో చంద్రయాన్-3 ప్రాజెక్టు డైరెక్టర్ పి.వీరముత్తువేల్, మిషన్ డైరెక్టర్ ఎస్. మోహన్‌కుమార్, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

మరో కీలక మైలురాయి

దేశ అంతరిక్ష పరిశోధనలో చంద్రయాన్-3 ప్రయోగం మరో కీలక మైలురాయి వంటిది. అంతరిక్ష శాస్త్రం, సాంకేతికత పురోగతిలో దేశం యొక్క తిరుగులేని నిబద్ధతకు నిదర్శనం. ఈ ఘనతను సాధించడంలో అవిశ్రాంతంగా పనిచేసిన ఇస్రో శాస్త్రవేత్తలు, ప్రతి ఒక్కరికీ అభినందనలు.


\- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

భారత అంతరిక్ష చరిత్రలో నూతన అధ్యాయం

చంద్రయాన్-3 ప్రయోగం భారత అంతరిక్ష చరిత్రలో నూతన అధ్యాయం సృష్టించింది. భారత అంతరిక్ష చరిత్రలో ఈ రోజు స్వర్ణాక్షరాలతో లిఖింపబడుతుంది. చంద్రయాన్-3 ప్రతి భారతీయుడి కలను, ఆకాంక్షలను మోసుకుంటూ నింగికి ఎగసింది. ఈ మహత్తర విజయం మన శాస్త్రవేత్తల అవిశ్రాంత అంకిత భావానికి నిదర్శనం. వారి స్ఫూర్తికి, నైపుణ్యానికి నా సెల్యూట్. - ప్రధాని మోదీ


భారత్‌లో అరుణాచల్ అంతర్భాగం

తీర్మానం ఆమోదించిన అమెరికా సెనేట్ కమిటీ



శాన్‌ఫ్రాన్సిస్కో: భారత్‌లోని అరుణాచల్ ప్రదేశ్ ప్రాంతం దక్షిణ టిబెట్‌లో భాగం, అది తమదేనంటూ వాదిస్తున్న చైనాకు మింగుడుపడని పరిణామమిది. అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రం భారత్‌లో అంతర్భాగమంటూ అమెరికా సెనేట్ కమిటీ పేర్కొంది. భారత ప్రధాని మోదీ ఇటీవల అమెరికాలో జరిపిన చారిత్రక పర్యటన అనంతరం కంగ్రెషనల్ సెనెటోరియల్ కమిటీ ఈ మేరకు ఒక తీర్మానం చేయడం గమనార్హం. సెనేటర్లు బిల్ హగెర్టీ, టిమ్ కైన్, క్రిస్ వాన్ హోలెన్ గురువారం ఈ మేరకు ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. చైనాకు, భారత్‌లోని అరుణాచల్ ప్రదేశ్‌కు ప్రస్తుతం ఉన్న మెక్ మెహన్ సరిహద్దు రేఖను అంతర్జాతీయ సరిహద్దుగా అమెరికా గుర్తిస్తోందని ఆ తీర్మానం పునరుద్ఘాటించింది. అరుణాచల్ భారత్‌లో విడదీయరాని భాగమని స్పష్టం చేసింది. అరుణాచల్ ప్రదేశ్‌లోని ప్రాంతాలు తమవేనంటూ చైనా అనుసరిస్తున్న దుందుడుకు, విస్తరణవాద విధానాలను తోసిపుచ్చింది. ఈ తీర్మానం సెనేట్ ముందుకు ఓటింగ్‌కు రానుంది. ఈ విషయంలో ఇతర భావసారూప్యత కలిగిన ప్రపంచ దేశాలతో కలిసి భారత్‌కు అమెరికా మద్దతు, సాయాన్ని అందజేస్తుందని కంగ్రెషనల్ ఎగ్జిక్యూటివ్ కమిషన్ ఆన్ చైనా కో చైర్ సెనేటర్ మెర్క్‌లీ చెప్పారు.

మా దేశంలో కిరాయి సైన్యం లేదు.. వారికి చట్టబద్ధత లేదు



మాస్కో: వాగ్నర్ గ్రూప్ ప్రైవేట్ కిరాయి సైనికులకు ఒకే యూనిట్‌గా సేవలందించేందుకు అవకాశం ఇచ్చినట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చెప్పారు. ఇప్పటి వరకు పనిచేసిన విధంగానే అదే కమాండర్ ఆధ్వర్యంలో వారు కార్యకలాపాలు సాగించవచ్చన్నారు. అదే విధంగా, తమ దేశంలో ప్రైవేట్ ఆర్మీ లేదని, అటువంటి వాటికి చట్టబద్ధత లేదని స్పష్టం చేశారు. పుతిన్ 23 ఏళ్ల పాలనలో ఎన్నడూ లేని విధంగా గత నెలలో వాగ్నర్ గ్రూప్ సైనికుల తిరుగుబాటుయత్నం, బెలారస్ అధ్యక్షుడు లుకషెంకో మధ్యవర్తిత్వంతో 24 గంటల్లోనే సద్దుమణగడం తెలిసిందే. ఆ తర్వాత అయిదు రోజులకు జూన్ 29న వాగ్నర్ గ్రూప్ చీఫ్ ప్రిగోజిన్ సహా అందులోని 35 మంది కమాండర్లతో సమావేశమైనట్లు పుతిన్ తాజాగా కొమ్మెర్‌శాంట్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. తిరుగుబాటుయత్నం కారణాలు, పరిస్థితులపై చర్చించానన్నారు. భవిష్యత్తులో పనిచేసేందుకు గల పలు అవకాశాలను వారి ముందుంచినట్లు వెల్లడించారు. ఇప్పటి మాదిరిగానే గ్రే హెయిర్ అనే కమాండర్ ఆధీనంలో పనిచేయడం అందులో ఒకటన్నారు. ఎటువంటి మార్పులు ఉండవని, గ్రూప్‌లోని అందరూ అందులో యథావిధిగా కొనసాగవచ్చని చెప్పానన్నారు. చాలా మంది కమాండర్లు ఈ ఆఫర్‌కు మొగ్గు చూపారన్నారు. అయితే, సమావేశం ముందు వరుసలో కూర్చున్న వాగ్నర్ గ్రూప్ చీఫ్ ప్రిగోజిన్ మాత్రం..తమ వాళ్లకు ఇది నచ్చలేదని చెప్పారన్నారు. అయితే, చివరికి వాగ్నర్ గ్రూప్ ఈ ఆఫర్‌కు అంగీకరించిందీ లేనిదీ పుతిన్ స్పష్టం చేయకపోవడం గమనార్హం. వాగ్నర్ గ్రూప్‌కు ఎలాంటి చట్టబద్ధత లేదని ఈ సందర్భంగా పుతిన్ పేర్కొన్నారు. 'ప్రైవేట్ మిలటరీ సంస్థలకు సంబంధించి దేశంలో ఎలాంటి చట్టాలు లేవు. కాబట్టి, రష్యాలో ప్రైవేట్ ఆర్మీ లేదు. ప్రైవేట్ మిలటరీ కాంట్రాక్టర్ల విషయమై ప్రభుత్వం, పార్లమెంట్ చర్చించాల్సి ఉంది'అని పుతిన్ వివరించారు. వాగ్నర్ గ్రూప్ కిరాయి సైనికులు రష్యా రక్షణ శాఖతో ఒప్పందానికి రావడం లేదా పొరుగునున్న బెలారస్‌కు వెళ్లిపోవడం, రిటైర్ కావడం వంటి అవకాశాలను ఇచ్చినట్లు గతంలో పుతిన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇలా ఉండగా, వాగ్నర్ గ్రూపనకు చెందిన కొందరు సభ్యులు బెలారస్‌లో తమ కార్యకలాపాలు ప్రారంభించినట్లు చెబుతున్నారు.

శాంతించిన యమున

- తగ్గుముఖం పడుతున్న వరద ప్రవాహం
- ఢిల్లీలో ఇంకా ముంపులోనే పలు ప్రాంతాలు



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేసిన యమునా నది శుక్రవారం కొంత శాంతించింది. నదిలో వరద ప్రవాహం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. అయినప్పటికీ పలు కీలక ప్రాంతాలు ఇంకా వరద ముట్టడిలోనే ఉన్నాయి. నది నుంచి కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న సుప్రీంకోర్టు, రాజ్‌ఘాట్ దాకా వరద నీరు చేరింది. యమునా నదిలో నీటమట్టం గురువారం 208.66 మీటర్లకు చేరుకోగా, శుక్రవారం సాయంత్రం 6 గంటలకల్లా 208.17 మీటర్లకు తగ్గిపోయింది. వరద ప్రవాహం ధాటికి దెబ్బతిన్న ఇంద్రప్రస్థ వాటర్ రెగ్యులేటర్‌ను ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్‌కుమార్ సక్సేనా, ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పరిశీలించారు. త్వరగా మరమ్మతులు పూర్తి చేస్తామని కేజ్రీవాల్ చెప్పారు. ఈ రెగ్యులేటర్ దెబ్బతినడం వల్లే నదిలోని వరద ఇతర ప్రాంతాలకు వేగంగా విస్తరించింది. ఇసుక బస్తాలు, కంకరతో వరద ప్రవాహాన్ని ఆపేందుకు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, సైనిక జవాన్లు, ఢిల్లీ అధికారులు శ్రమిస్తున్నారు. నగరంలోని రోడ్లపై వరద నీరు ఇంకా తగ్గలేదు. రహదారులు చిన్నపాటి నదులను తలపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో రోడ్లను ట్రాఫిక్ పోలీసులు మూసివేశారు. వాహనాలను అనుమతించడం లేదు. మరికొన్ని ప్రాంతాల్లో వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించారు. మరోవైపు వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం కొనసాగుతున్నాయి. వరదలో చిక్కుకుపోయిన వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. శ్మశానాలు సైతం జలమయం కావడంతో అంత్యక్రియలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. వరద తీవ్రత దృష్ట్యా పలు శ్మశాన వాటికలను మూసివేసినట్లు నగర మేయర్ షెల్లీ ఒబెరాయ్ చెప్పారు.

వరదలపై ఆరా తీసిన ప్రధాని మోదీ

ఫ్రాన్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ తాజాగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో ఫోన్‌లో మాట్లాడారు. ఢిల్లీలో వరద పరిస్థితిపై ఆరా తీశారు. మరో 24 గంటల్లో యమునా నదిలో ప్రవాహం గణనీయంగా తగ్గే అవకాశం ఉందని, అతి త్వరలో సాధారణ పరిస్థితులు నెలకొంటాయని మోదీకి అమిత్ షా వివరించారు.

చంద్రబాబు మిత్రుడు, సింగపూర్ మంత్రి
ఎస్. ఈశ్వరన్ అరెస్టు

సింగపూర్: అక్రమ లావాదేవీలు నిర్వహించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సింగపూర్ రవాణా శాఖ మంత్రి ఎస్.ఈశ్వరన్‌ను ఈ నెల 11న(మంగళవారం) అరెస్టు చేసినట్లు అవినీతి వ్యవహారాల దర్యాప్తు సంస్థ(సీపీఐబీ) శుక్రవారం వెల్లడించింది. అనంతరం ఆయన బెయిల్‌పై విడుదలైనట్లు తెలియజేసింది. ఈశ్వరన్‌ను సీపీఐబీ కస్టడీలోకి తీసుకున్నట్లు బుధవారమే వార్తలు వచ్చాయి. కానీ, దర్యాప్తు సంస్థ అధికారికంగా ప్రకటించడం ఇదే మొదటి సారి. అయితే, కేసు దర్యాప్తుపై సీపీఐబీ వివరాలు బయటపెట్టలేదు. ఈశ్వరన్‌ను అరెస్టు చేసిన రోజే ఆయన సన్నిహితుడు, ప్రముఖ వ్యాపారవేత్త ఓంగ్ బెంగ్ సెంగ్‌ను సైతం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈశ్వరన్‌తో ఆర్థిక లావాదేవీలపై ఆయనను ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఓంగ్ బెంగ్ సెంగ్ కూడా షరతులతో కూడిన బెయిల్‌పై విడుదలయ్యాడు. ఈశ్వర్‌పై ఆరోపణలు రాగానే సింగపూర్ ప్రధానమంత్రి లీ సీన్ లూంగ్ స్పందించారు. దర్యాప్తు పూర్తయ్యే దాకా విధులకు దూరంగా ఉండాలని ఈశ్వరన్‌ను ఆదేశించారు.



అసలేం జరిగింది?

మలేషియా పౌరుడైన ఓంగ్ బెంగ్ సెంగ్ సింగపూర్‌లో హోటల్ ప్రాపర్టీస్ లిమిటెడ్(హెచ్‌పీఎల్) పేరిట సంస్థను నిర్వహిస్తున్నాడు. 135 మిలియన్ డాలర్ల విలువైన ఫార్ములా వన్ రేసింగ్ ప్రాజెక్టు నెలకొల్పుతామంటూ సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ప్రభుత్వం తరఫున మంత్రి ఈశ్వరన్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఒప్పందం ప్రకారం.. 40 శాతం నిధులను ఓంగ్ బెంగ్ సెంగ్, మిగతా 60 శాతం నిధులను సింగపూర్ టూరిజం బోర్డు సమకూర్చాల్సి ఉంటుంది. ప్రభుత్వ వాటా విషయంలోనే గోల్‌మాల్ జరిగిందని సీపీఐబీ అనుమానిస్తోంది. పెద్ద ఎత్తున కమిషన్లు చేతులు మారినట్లు ప్రచారం సాగుతోంది. సింగపూర్ ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణిస్తోంది. కొందరికి వ్యక్తిగత ప్రయోజనాలు చేకూర్చేందుకు ఈశ్వర్ పలు సందర్భాల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా ఉండగా, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడితో ఈశ్వరన్‌కు సన్నిహిత సంబంధాలున్నాయి. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో అమరావతిలో స్టార్టప్ ఏరియా అభివృద్ధి ఒప్పందం విషయంలో అప్పట్లో ఈశ్వరన్ పేరు బాగా వినిపించింది. ఈ ప్రాజెక్టును సింగపూర్ ప్రైవేట్ సంస్థల కన్సార్టియంకు అప్పగిస్తూ 2017 మే 12న ఈశ్వరన్‌తో చంద్రబాబు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒప్పందంపై ఈశ్వరన్ స్వయంగా సంతకాలు చేశారు.



హత్య కుట్ర భగ్నం

ఆర్థిక లావాదేవీల్లో తేడాలు రావడంతో వ్యాపార భాగస్వామిని హత్య చేసేందుకు ప్లాన్ చేసిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. -8లో



'రజాకార్' పోస్టర్ ఆవిష్కరణ

'రజాకార్' సినిమా పోస్టర్‌ను శుక్రవారం జలవిహార్‌లో మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు, ఎంపీ బండి సంజయ్ తదితరులు ఆవిష్కరించారు. -8లో

తాగునీటి సరఫరాకు అంతరాయం



ఈ నెల 19 (బుధవారం) ఉదయం 6 నుంచి గురువారం సాయంత్రం 6 గంటల వరకు నగరంలోని పలు ప్రాంతాల్లో 36 గంటల పాటు తాగునీటి సరఫరాకు అంతరాయం కలగనుంది. -8లో

న్యూస్‌రీల్

చంద్రయాన్- 3లో 'మిధాని' కీలక పాత్ర

సాక్షి, సిటీబ్యూరో: భారత్ ప్రతిష్టాత్మకంగా ప్రయోగించిన చంద్రయాన్- 3 మిషన్‌లో నగరానికి చెందిన డిఫెన్స్ పీఎస్‌యూ 'మిశ్రా ధాతు నిగమ్ లిమిటెడ్' (మిధాని) కీలక పాత్ర పోషించింది. చంద్రయాన్-3 ప్రయోగానికి మూడు దశల భారీ లిఫ్ట్ లాంచ్ వెహికల్ అయిన ఎల్‌వీఎం3- ఎం4కు అవసరమైన కీలక పదార్థాలను మిధాని అభివృద్ధి చేసి, సరఫరా చేసింది. ఎగ్జాస్ట్ యూనిట్ కోసం కోబాల్ట్ అల్లాయ్‌లు, నికెల్ అల్లాయ్‌లు, టైటానియం మిశ్రమాలు, లిక్విడ్ ఇంజిన్ కోసం ప్రత్యేకంగా స్టీల్స్, లిక్విడ్ స్టేజీల కోసం నాజిల్స్, గ్యాస్ బాటిల్స్, థ్రస్టర్‌లు, క్రయోజెనిక్ సమ్మేళనాలను, రాకెట్ మోటర్ కేసింగ్, ప్రొపెల్లెంట్ ట్యాంకులు తదితరాలను మిధాని సరఫరా చేసింది. ల్యాండర్ సెపరేటర్ బ్యాండ్ ప్రొపల్షన్ మాడ్యూల్, ల్యాండర్-రోవర్ వంటి ముఖ్యమైన భాగాల నిర్మాణానికి మిధాని ప్రత్యేక స్టీల్స్, టైటానియం మిశ్రమాలను కూడా సరఫరా చేసింది. ఇస్రో ప్రయోగాల్లో మిధాని 4 దశాబ్దాలుగా భాగస్వామిగా కొనసాగుతోంది.

చేనేత చీరలంటే ఎంతో ఇష్టం

సినీనటి పూనమ్ కౌర్



శ్రీనగర్‌కాలనీ: మహిళలు చేనేత చీరలను వినియోగించి కళాకారులను, ఆ రంగంపై ఆధారపడి జీవిస్తున్నవారిని ప్రోత్సహించాలని సినీ నటి పూనమ్ కౌర్ అన్నారు. శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఇండియన్ సిల్క్ ఎక్స్‌పోను శుక్రవారం ఆమె సందర్శించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన చేనేత కళాకారుల ఉత్పత్తులను పరిశీలించారు. తాను చేనేత చీరలు ఎక్కువగా ఇష్టపడతానన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీనివాసరావు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల మాటలు బాధ్యతారహితం

- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

బన్సీలాల్‌పేట్: తెలంగాణలో బీఆర్‌ఎస్ పాలనలో రైతులు సంతోషంగా ఉన్నారని.. కాంగ్రెస్ నాయకులు పసలేని మాటలు.. మూర్ఖపు ఆలోచనలతో వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆరోపించారు. సికింద్రాబాద్ బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో శుక్రవారం వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం విలేకరులతో తలసాని మాట్లాడారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో అద్భుతమైన పాలన కొనసాగుతోందని, రాష్ట్రానికి వచ్చే అవార్డులు, రివార్డులే అందుకు నిదర్శమన్నారు. కాంగ్రెసోళ్లు మూర్ఖులు.. విద్యుత్తు విషయంలో వారి మాటలు బాధ్యతారాహిత్యం.. పస లేనివి అని ధ్వజమెత్తారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం 24 గంటల పాటు కరెంట్ ఇస్తుండటంతో రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని చెప్పారు.

పాస్‌పోర్టు కార్యాలయాన్ని సందర్శించిన శ్రీకర్‌రెడ్డి



శ్రీకర్‌రెడ్డిని అభినందిస్తున్న దాసరి బాలయ్య

రాంగోపాల్‌పేట్: కాన్సుల్ జనరల్ ఆఫ్ ఇండియా యూఎస్‌ఏ శాన్‌ఫ్రాన్సిస్కో డాక్టర్ కె.శ్రీకర్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయాన్ని సందర్శించారు. డాక్టర్ శ్రీకర్‌రెడ్డి హైదరాబాద్ ఆర్పీఓలో 2011 జూలై నుంచి ఆగస్టు 2014 వరకు ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారిగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆర్పీఓ బాలయ్య శ్రీకర్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. పాస్‌పోర్టు సేవా కేంద్రాలను ఏర్పాటు చేసి దరఖాస్తుదారులకు సులభంగా పాస్‌పోర్టు చేరవేయడంలో శ్రీకర్‌రెడ్డి ముఖ్య భూమిక పోషించారని దాసరి బాలయ్య కొనియాడారు. వాణిజ్య మంత్రిత్వ శాఖలో జాయింట్ సెక్రటరీగా, మారిషస్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో ఇటీవల ముగిసిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల కోసం భారత ప్రధాన సంధానకర్తగా విజయవంతంగా పనిచేశారన్నారు. ప్రజలకు పాస్‌పోర్టులను అందించడంలో హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయ అధికారులు, సిబ్బంది చేస్తున్న కృషిని ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకర్‌రెడ్డి ప్రశంసించారు. ఈ సంవత్సర ప్రథమార్ధంలో 4 లక్షల పాస్‌పోర్టులను జారీ చేయడాన్ని ఆయన అభినందించారు.

హిమాన్షు అన్నా.. మా బడినీ జర దత్తత తీసుకోరాదే..!



ప్లకార్డులతో దత్తానగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

'హాయ్.. హిమాన్షు అన్నా. మేం హిమాయత్‌నగర్ దత్తానగర్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులం. మా బడి పరిస్థితేమీ బాలేదు. అన్నీ సమస్యలే. మీరు మాపై దయ చూపి మా స్కూల్‌ను కూడా దత్తత తీసుకోండన్నా' అంటూ విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని ముఖ్యమంత్రి కేసీఆర్ మనవడు, మంత్రి కేటీఆర్ కుమారుడు హిమాన్షును అభ్యర్థించారు. వీరికి ఏఐవైఎఫ్, బాలసంఘం విద్యార్థి నాయకులు మద్దతు పలికారు. శుక్రవారం ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. 'మంచినీళ్లు సరిగా లేవు. మరుగుదొడ్లకు తలుపులు లేవు. నీరు లీకేజీ అవుతోంది. మెట్లన్నీ పగిలిపోయాయి. ప్రవేశం ద్వారం వద్ద ఉన్న మోరీకి మ్యాన్‌హోల్ లేకపోవడంతో అందులో పడిపోతామేమో అని భయమేస్తోంది'.. ఇలా సమస్యలను ఏకరువు పెడుతూ ప్లకార్డుల ద్వారా తెలిపారు. 'మన బస్తీ- మన బడి'లో భాగంగా ఈ పాఠశాలకు ఇంకా నిధులు రాలేదని, ఇక్కడ అన్నీ సమస్యలేనని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర తెలిపారు. -హిమాయత్‌నగర్

ఆకాశ దారిలో హాయిగా..

ఉప్పల్ స్కైవాక్‌కు అనూహ్య డిమాండ్

- భారీస్థాయిలో పాదచారుల రాకపోకలు
- రోజుకు 35 వేల మందికి పైగా వినియోగం
- సీసీ కెమెరాలు, సెక్యూరిటీ సిబ్బందితో భద్రత



సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన ఉప్పల్ స్కైవాక్ పాదచారులకు పట్టం కట్టింది. ప్రారంభించిన కొద్ది రోజులకే అనూహ్యమైన డిమాండ్ నెలకొంది. ఉప్పల్ రింగ్‌రోడ్డులో అన్ని వైపులకు రాకపోకలు సాగించే పాదచారులు పూర్తిస్థాయిలో స్కైవాక్ సేవలను వినియోగించుకుంటున్నారు. ప్రతి రోజు సుమారు 35 వేల మందికి పైగా స్కైవాక్ మీదుగా రాకపోకలు సాగిస్తున్నట్లు హెచ్ఎండీఏ అధికారుల అంచనా. వీరిలో సగానికి పైగా మెట్రో ప్రయాణికులే ఉన్నారు. ఉప్పల్ మెట్రో నుంచి బయలుదేరేవారు, వివిధ ప్రాంతాల నుంచి ఉప్పల్‌కు చేరుకొనే వారు ప్రస్తుతం రింగ్‌రోడ్డులో ఏ దిశగా వెళ్లాలనుకున్నా స్కైవాక్ నుంచే వెళ్లడం గమనార్హం. వేలాది మంది ప్రయాణికులకు, నగరవాసులు నిత్యం నరకం చూపిన ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి ఎంతో ఊరట లభించింది. సుమారు 660 మీటర్ల పొడవున విస్తరించి ఉన్న ఉప్పల్ స్కైవాక్‌ను మంత్రి కేటీఆర్ గత నెల 25న ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఆ రోజు నుంచే వినియోగంలోకి వచ్చింది. మొదట్లో స్కైవాక్ వినియోగం తక్కువగానే ఉన్నప్పటికీ ఈ నెల మొదటి వారం నుంచి ఎక్కువ మంది రాకపోకలు సాగిస్తున్నట్లు హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు ఎక్కువ మంది స్కైవాక్ మీదుగా రోడ్డు దాటుతున్నారు.

మెట్రోకు ఎంతో అనుకూలం...

- ప్రతి రోజు సుమారు 25 వేల మందికి పైగా ఉప్పల్ మెట్రో నుంచి సికింద్రాబాద్, అమీర్‌పేట్, రాయదుర్గం మియాపూర్ మార్గాల్లో రాకపోకలు సాగిస్తారు. సాధారణంగా ఉప్పల్ రింగ్‌రోడ్డులో పోలీస్‌స్టేషన్ వైపు నుంచి మెట్రో వైపు రోడ్డు దాటేందుకు కనీసం 15 నిమిషాల పాటు నిరీక్షించాల్సి వచ్చేది. మెట్రో దిగి పోలీస్‌స్టేషన్ వైపు రావాలనుకున్నా వాహనాల రద్దీ దృష్ట్యా ఎదురుచూపులు తప్పని పరిస్థితి. ఇక మెట్రో దిగి సికింద్రాబాద్ వైపు వెళ్లాలంటే నరకమే. ఏ వైపు నుంచి ఏ వాహనం ఢీకొంటుందో తెలియదు. ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని రోడ్డు దాటాల్సి వచ్చేది. రోడ్డు దాటే క్రమంలో వాహనాలు ఢీకొని ప్రమాదాలు కూడా జరిగాయి.
- ప్రస్తుతం స్కైవాక్ అందుబాటులోకి రావడంతో ప్రయాణికులకు, పాదచారులకు ఆ బాధ నుంచి విముక్తి లభించింది. వరంగల్, హన్మకొండ, జనగామ తదితర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులను రింగ్ రోడ్డు వద్ద నిలుపుతారు. అక్కడ బస్సు దిగి రామంతాపూర్ వెళ్లాలంటే కనీసం కిలోమీటర్ దూరం రోడ్డుపై నడవాల్సి వచ్చేది. ఇప్పుడు స్కైవాక్ మీదుగా నిర్భయంగా ప్రయాణికులు ఇటు వైపు నుంచి అటు వైపు వెళ్తున్నారు. '80 శాతం వరకు రోడ్డుపైన నడక తగ్గింది. ఇదే సమయంలో వాహనాల రాకపోకలు కూడా పెరిగాయి. మొదటి వారంలో సుమారు 30 వేల మంది స్కైవాక్‌ను వినియోగించుకోగా, ఇప్పుడు ఆ సంఖ్య 50 వేలు దాటింది' అని హెచ్ఎండీఏ అధికారి ఒకరు వివరించారు.

త్వరలో మెహిదీపట్నం పనులు..

మెహిదీపట్నం బస్టాప్ వద్ద ఏర్పాటు చేయనున్న స్కైవాక్ పనులను త్వరలో ప్రారంభించే అవకాశం ఉంది. రక్షణశాఖకు చెందిన కొంత భూమిని స్కైవాక్ కోసం ఇచ్చేందుకు ఆ శాఖ అధికారులు అంగీకరించినట్లు సమాచారం. డిఫెన్స్ అధికారులు త్వరలోనే క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. ఆ తర్వాత ప్రాజెక్టు చేపట్టనున్నారు. ఇది సుమారు 350 మీటర్ల వరకు ఉంటుంది. ఉప్పల్‌స్కైవాక్ కంటే దీనిని మరింత అధునాతనంగా ఏర్పాటు చేయనున్నట్లు హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు.

24 గంటల పాటు అందుబాటులో..

స్కైవాక్‌ను ప్రారంభించిన మొదట్లో రాత్రి పూట ఆంక్షలు విధించాలనే ప్రతిపాదన ఉన్నప్పటికీ ప్రస్తుతం 24 గంటల పాటు వినియోగానికి ఇది అందుబాటులో ఉంది. పాదచారులు ఏ సమయంలోనైనా ఎటు వైపు నుంచి ఎటు వైపైనా వెళ్లవచ్చు. కానీ రాత్రి 11 తరువాత మెట్రో సేవలు నిలిచిపోవడంతో పాటు, నగరానికి వచ్చే దూరప్రాంతాల బస్సులు కూడా చాలా వరకు తగ్గిపోతాయి. దీంతో రాత్రి 10 గంటల వరకే ప్రస్తుతం ఎక్కువ మంది వినియోగించుకుంటున్నారు. తిరిగి ఉదయం 6 గంటల నుంచి స్కైవాక్ వినియోగం క్రమంగా పెరుగుతోంది. పాదచారుల భద్రతను దృష్టిలో ఉంచుకొని 660 మీటర్ల పొడవునా సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. 24 గంటల పాటు సెక్యూరిటీ సిబ్బంది కూడా విధులు నిర్వర్తిస్తున్నారు.



కొత్త కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



పూర్తి పేరు : అనుదీప్ దురిశెట్టి
జననం : 6 జూలై 1989
విద్యార్హత : బీటెక్ (బిట్స్ పిలానీ, రాజస్థాన్)
ఐఏఎస్ బ్యాచ్: 2018
(2017 యూపీఎస్సీ టాపర్)
స్వస్థలం : మెట్‌పల్లి, జగిత్యాల జిల్లా

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా అనుదీప్ దురిశెట్టిని నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో గతేడాది కాలంగా ఇన్‌చార్జి కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న అమయ్‌కుమార్‌ను బాధ్యతల నుంచి తప్పించింది. 2018 బ్యాచ్‌కు చెందిన అనుదీప్ దురిశెట్టి ప్రస్తుతం భద్రాది కొత్తగూడెం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా విధులు నిర్వర్తిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా ప్రతిమా సింగ్ నియమితులయ్యారు. ఇక్కడ పని చేస్తున్న ప్రతీక్ జైన్ భద్రాచలం ఐటీడీఏ పీఓగా బదిలీ అయ్యారు.

జీహెచ్ఎంసీకి ఒకరి రాక.. మరొకరి పోక

ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా జీహెచ్ఎంసీ నుంచి ఒకరు బదిలీ కాగా, మరొకరు రానున్నారు. జీహెచ్ఎంసీలో అడిషనల్ కమిషనర్ (రెవెన్యూ, లీగల్, ట్రేడ్ లైసెన్సులు, హెల్త్, వెటర్నరీ)గా పనిచేస్తున్న ప్రియాంక అలా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. స్నేహ శబరీష్ జీహెచ్ఎంసీకి అడిషనల్ కమిషనర్‌గా రానున్నారు.

ఇన్‌చార్జి డీఆర్వో సూర్యలత బదిలీ

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి, సీఈఎంగా విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ కలెక్టర్ కె.సూర్యలత బదిలీ అయ్యారు. ఆమెకు గిరిజన సంక్షేమ గురుకుల సొసైటీ ఓఎస్‌డీగా పోస్టింగ్ లభించింది. యూఎల్‌సీ ఎస్‌జీడీసీగా విధులు నిర్వహిస్తున్న స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ వెంకట్‌రెడ్డి సూర్యాపేట అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బదిలీ అయ్యారు. వీరిద్దరి స్థానంలో ఇంకా ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు.

రంగారెడ్డి అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా భూపాల్ రెడ్డి

రంగారెడ్డి అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా భూపాల్ రెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా డి. విజేందర్‌రెడ్డి నియమితులయ్యారు. మల్కాజిగిరి ఆర్‌డీఓగా విధులు నిర్వహిస్తున్న మల్లయ్య రాజేంద్రనగర్ ఆర్‌డీఓగా బదిలీ అయ్యారు. ఇక్కడ పని చేస్తున్న చంద్రకళకు హైదరాబాద్ జీఏడీ ఎస్టేట్ ఆఫీసర్ పోస్టింగ్ ఇచ్చారు. వెయిటింగ్‌లో ఉన్న టి.శ్యామ్ ప్రకాశ్‌కు మల్కాజిగిరి ఆర్‌డీఓగా పోస్టింగ్ లభించింది. కీసర ఆర్డీఓగా రాజేశ్ కుమార్, శేరిలింగంపల్లి డీసీ అండ్ తహసీల్దార్‌గా టి. శ్రీనివాస్ రావు నియమితులయ్యారు.

లగేజీ భారం.. ఇక దూరం

పిల్లలు, వృద్ధులు, గర్భిణులకు తప్పిన శ్రమ



బ్యాటరీ వాహనాల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అభయ్‌కుమార్ గుప్తా

- సికింద్రాబాద్ స్టేషన్ లోపలికి బగ్గీ సర్వీసులు
- రూ.50 చార్జీతో నేరుగా ప్లాట్‌ఫాంపైకి



ప్రయాణిస్తున్న మహిళలు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఇకమీదట ప్రయాణికులకు లగేజీ భారం తప్పనుంది. వృద్ధులు, పిల్లలు, గర్భిణులకు ఎస్కలేటర్లు, లిఫ్టులు, వంతెనలను ఆశ్రయించే పని లేకుండా నేరుగా ప్లాట్‌ఫాంపైకి చేరుకునే అవకాశం అందుబాటులోకి వచ్చింది. ఇందుకోసం బ్యాటరీ వాహనాలు అందుబాటులోకి వచ్చాయి. రిజర్వేషన్ టికెట్ ఆధారంగా తాము ప్రయాణించాల్సిన రైలు నిలిపే ప్లాట్‌ఫాంపై ఎక్కాల్సిన బోగీ వద్ద బ్యాటరీ వాహనాలు దింపుతాయి. ఒక్కో ప్రయాణికుడికి రూ.50 టికెట్ తీసుకోవాలి. దక్షిణమధ్య రైల్వేతో ఒప్పందం ఏర్పాటు చేసుకున్న రాగ్నాయి యాడ్స్ సంస్థ తేజోభారత్ పేరుతో బగ్గీ సర్వీస్ ప్రయాణ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. బగ్గీ సర్వీస్ బ్యాటరీ వాహనాలను శుక్రవారం దక్షిణమధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ మేనేజర్ అభయ్‌కుమార్ గుప్తా ప్రారంభించారు. ఈ వాహనాలను సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ 1, 10వ నంబర్ల ప్లాట్‌ఫాంల ముందున్న ఆవరణల్లో అందుబాటులో ఉంచుతామని రాగ్నాయి యాడ్స్ సంస్థ సంస్థ డైరెక్టర్ టీఎస్‌కే పవన్‌కుమార్ చెప్పారు. ప్రయాణికులు తమ టికెట్ వివరాలను 77999 10824కు సమాచారం అందించాలి. ఆన్‌లైన్ ద్వారా చార్జీలు చెల్లించాలి. ప్రయాణికులు రైలు బయలుదేరడానికి 30 నిమిషాల ముందే రైల్వేస్టేషన్‌కు చేరుకోవాల్సి ఉంటుంది. కార్యక్రమంలో అసిస్టెంట్ డివిజనల్ మేనేజర్ రాజీవ్‌కుమార్ గంగేలె, సీనియర్ డీసీఎం బసవరాజు పాల్గొన్నారు.

చివరికి మిగిలింది విషాదమే

చికిత్స పొందుతున్న ముగ్గురి మృతి

- దోమలగూడ వంట గ్యాస్ లీకేజీ ప్రమాద ఘటన



బాపూజీనగర్‌లో మృతదేహాల వద్ద బంధువుల రోదనలు



మృతులు పద్మ, ధనలక్ష్మి, అభినవ్, శరణ్య

గాంధీ ఆస్పత్రి: దోమలగూడ వంట గ్యాస్ లీకేజీ ఘటనలో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. కాలిన గాయాలతో సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అయిదుగురిలో ముగ్గురు శుక్రవారం మృతి చెందారు. ధనలక్ష్మి, పద్మ, అభినవ్‌లు శుక్రవారం మరణించగా, బుధవారం శరణ్య మృతి చెందింది. దోమలగూడ రోజ్‌గార్ కాలనీకి చెందిన పద్మ అనే మహిళ బోనాల వేడుకలకు పద్మారావునగర్ బాపూజీనగర్‌లో నివసిస్తున్న కుమార్తె ధనలక్ష్మి, ఎల్‌బీనగర్‌లో ఉంటున్న సొంత చెల్లెలు నాగమణి కుటుంబాలను ఆహ్వానించింది. ధనలక్ష్మితో పాటు భర్త లాలాజీ శ్యామ్, కుమార్తె శరణ్య, కుమారులు అభినవ్, విహాన్‌లు, చెల్లెలు నాగమణి, భర్త ఆనంద్‌లు ఈ నెల 10న రోజ్‌గార్ కాలనీలోని పద్మ ఇంటికి చేరుకున్నారు. మంగళవారం పిండివంటలు చేసేందుకు స్టవ్‌ను వెలిగించగా గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. ఒకే గదిలో ఉన్న ఏడుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. అదే సమయంలో అల్లుడు శ్యామ్ బయటకు వెళ్లడంతో ప్రమాదం నుంచి బయట పడ్డాడు. మంటలను అదుపుచేసి గాయపడిన ఏడుగురిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రాణాపాయస్థితిలో ఉన్న క్షతగాత్రులను పీఐసీయూ, టీఎంటీ, బర్న్స్‌వార్డుల్లో వెంటిలేటర్‌పై వైద్యం అందించారు. చికిత్స పొందుతూ బుధవారం శరణ్య (7), శుక్రవారం పద్మ (53) ధనలక్ష్మి (29) అభినవ్ (8) మృతి చెందారు.

నేను ఎవరి కోసం బతకాలి..

ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందడంతో పద్మారావునగర్ బాపూజీనగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల బంధువులు, కుటుంబసభ్యులు రోదనలు మిన్నంటాయి. అత్త, భార్య, ఇద్దరు పిల్లలు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారని, మరో చిన్నారి చావుబతుకుల్లో కొట్టుమిట్టాడుతున్నాడని తాను ఇంకా ఎవరికోసం బతకాలని శ్యామ్ కన్నీటి పర్యంతమయ్యాడు. పోస్టుమార్టం అనంతరం ప్రత్యేక అంబులెన్స్‌లో మృతదేహాలను బాపూజీనగర్‌కు తరలించి ముషీరాబాద్ మోరంబంద శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. గాయపడిన మరో చిన్నారి విహాన్ (3) ఆల్వాల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మరో ఇద్దరు ఆనంద్, నాగమణిల పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు తెలిపారు.

లంగర్‌హౌస్‌లో నలుగురికి డెంగీ

లంగర్‌హౌస్: లంగర్‌హౌస్‌లో డెంగీ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇప్పటికే నలుగురికి డెంగీ సోకినట్లు అధికారులు గుర్తించారు. లంగర్‌హౌస్‌లోని అంబేడ్కర్ నగర్, జానకీ నగర్, అంబేడ్కర్ నగర్ 2, ప్రశాంత్‌నగర్‌లలో పలువురు జ్వరాలతో బాధపడుతున్నారు. తీవ్ర అస్వస్థతకు గురైనవారిని ఆస్పత్రులకు తరలించగా వైద్యులు రక్త నమూనాలను సేకరించారు. నమూనాలను పరీక్షించగా ఎన్‌ఎస్-1 పాజిటివ్‌డి తేలడంతో డెంగీ సోకిందని నిర్ధారించారు. వీరు ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు.

తప్పని రిజిస్ట్రేషన్ తిప్పలు

- మెడికల్ కౌన్సిల్ వద్ద వైద్యుల క్యూ
- కౌంటర్ల సంఖ్య పెంచాలని డిమాండ్



సుల్తాన్‌బజార్: మెడికల్ కౌన్సిల్‌కు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వైద్యులు తమ రిజిస్ట్రేషన్లను రెన్యువల్ చేసుకునేందుకు వేగం పెంచారు. ఈ క్రమంలో కోఠి డీఎంహెచ్‌ఎస్‌లోని మెడికల్ కౌన్సిల్ కార్యాలయానికి వైద్యుల తాకిడి పెరిగింది. రెన్యువల్ కోసం వైద్యులు క్యూ కడుతున్నారు. దీంతో మెడికల్ కౌన్సిల్ వద్ద ప్రతిరోజు సందడిగా మారుతోంది. దేశమంతా ఆన్‌లైన్‌లో వైద్యుల రిజిస్ట్రేషన్లు, రెన్యువల్ జరుగుతున్నా తెలంగాణ రాష్ట్రంలో మెడికల్ కౌన్సిల్ మాత్రం ఆఫ్‌లైన్‌లోనే చేపడుతుండడం కొసమెరుపు. ఇటీవల కాలంలో మెడికల్ కౌన్సిల్ వెబ్‌సైట్‌ను వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించినప్పటికీ ఇప్పటి వరకు ఆ వెబ్‌సైట్ వైద్యులకు అందుబాటులోకి రాలేదు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వైద్యులు పెద్ద ఎత్తున తరలివస్తున్నా అధికారులు మాత్రం కౌన్సిల్ వద్ద సరైన ఏర్పాట్లు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శంగా కనిపిస్తోంది. తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన వైద్యులు గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన దుస్థితి ఏర్పడింది. రిజిస్ట్రేషన్, రెన్యువల్‌కు ప్రభుత్వం వేల రూపాయలతో చార్జీలు వసూలు చేస్తున్నా కనీస సౌకర్యాలు కల్పించకపోవడంపై వైద్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రెన్యువల్‌కు ఈ నెల 20 వరకు గడువు ఉంది. సమయం సమీపిస్తుండటంతో వైద్యులు కోఠిలోని మెడికల్ కౌన్సిల్‌కు పెద్ద ఎత్తున వస్తున్నారు. అయినా.. అధికారులు కౌంటర్ల సంఖ్య పెంచడంలేదు. ఇప్పటికైనా కౌన్సిల్ వద్ద కనీస ఏర్పాట్లు, కౌంటర్ల సంఖ్య పెంచాలని వైద్యులు కోరుతున్నారు.

మార్కెట్‌లోకి 'ఎస్‌యూవి'ని ఆవిష్కరించిన కియా



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని జూబ్లీహిల్స్, గచ్చిబౌలి కియా కార్ షోరూమ్ వేదికలుగా సరికొత్త ఎస్‌యూవి సెల్టోస్ 2.0 మోడల్‌ను మార్కెట్‌లోకి విడుదల చేశారు. శుక్రవారం జూబ్లీహిల్స్ బ్రాంచ్ లో ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ హెడ్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సెంథిల్ రాజప్ప, గచ్చిబౌలిలోని బ్రాంచ్‌లో పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ మంజుల అనగాని ఈ నూతన మోడల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కియా షోరూమ్ నిర్వాహకులు ప్రీతం రెడ్డి మాట్లాడుతూ., డ్యూయల్ పేన్ పనోరమిక్ సన్‌రూఫ్, 32 భద్రతా ఫీచర్లు, తదితర సెగ్మెంట్-బెస్ట్ ఫీచర్‌లతో ఈ కియా ఆకట్టుకుంటుందని తెలిపారు. శనివారం నుంచి ఈ మోడల్స్ మార్కెట్‌లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

36 గంటలపాటు తాగునీటి సరఫరాకు అంతరాయం



సాక్షి, సిటీబ్యూరో: గోదావరి తాగునీటి సరఫరా పథకం దశ -1లో భాగంగా పెద్దపల్లి జిల్లాలోని ముర్మూర్ నుంచి బొమ్మకల్ వరకు ఉన్న మెయిన్ పైపులైనుకు ఏర్పడ్డ లీకేజీలు అరికట్టడానికి మరమ్మతు పనులు చేపట్టారు. దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లో 36 గంటలపాటు తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఈ నెల19.(బుధవారం) ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు గురువారం సాయంత్రం 6 గంటల వరకు ఈ పనులు జరుగనున్నాయి. దీంతో నగరంలోని పలు డివిజన్ల పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో పూర్తిగా, మరికొన్ని ప్రాంతాల్లో పాక్షికంగానీటి సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు జలమండలి వర్గాలు పేర్కొన్నాయి.

పాక్షికంగా అంతరాయం...

- ఓ అండ్ ఎం డివిజన్-6 (ఎస్.ఆర్.నగర్): బోరబండ, వెంకటగిరి, బంజారాహిల్స్ రిజర్వాయర్ల పరిధిలోని ప్రాంతాలు, ఎర్రగడ్డ, అమీర్‌పేట్, ఎల్లారెడ్డిగూడ, యూసుఫ్ గూడ.
- ఓ అండ్ ఎం డివిజన్-9 (కూకట్‌పల్లి): కేపీహెచ్‌బీ, మలేషియన్ టౌన్ షిప్ రిజర్వాయర్ పరిధి ప్రాంతాలు.
- ఓఅండ్‌ఎం డివిజన్-15 (శేరిలింగంపల్లి): లింగంపల్లి నుంచి కొండాపూర్, గోపాల్‌నగర్, మయూరి నగర్ రిజర్వాయర్ పరిధి ప్రాంతాలు.
- ఓఅండ్‌ఎం డివిజన్- 23 (నిజాంపేట్): ప్రగతినగర్‌లో కొన్ని ప్రాంతాలు, నిజాంపేట్/బాచుపల్లి.

పూర్తిగా అంతరాయం...

- ఓఅండ్‌ఎం డివిజన్-9 (కూకట్‌పల్లి): ఎల్లమ్మ బండ, అల్వాల్ రిజర్వాయర్ పరిధిలోని ప్రాంతాలు.
- ఓఅండ్‌ఎం డివిజన్-12 (కుత్బుల్లాపూర్): షాపూర్‌నగర్, చింతల్, జీడిమెట్ల/వాణి కెమికల్స్, జగద్గిరిగుట్ట, గాజుల రామారం, సూరారం, అల్వాల్ రిజర్వాయర్ పరిధి ప్రాంతాలు.
- ఓఅండ్‌ఎం డివిజన్ -13 (మల్కాజిగిరి/అల్వాల్): సైనిక్ పురి, డిఫెన్స్ కాలనీ, అల్వాల్ రిజర్వాయర్ పరిధి ప్రాంతాలు.
- ఓఅండ్‌ఎం డివిజన్-14 (ఉప్పల్): కాప్రా మున్సిపాలిటీలోని కొన్ని ప్రాంతాలు. సాయిబాబా నగర్, రాధిక, మహేష్ నగర్, అవుట్ రిజర్వాయర్ పరిధి ప్రాంతాలు.
- ఓఅండ్‌ఎం డివిజన్-19 (నాగారం/దమ్మాయిగూడ): నాగారం, దమ్మాయిగూడ, రాంపల్లి, కీసర, ఆర్జికే ప్రాంతాలు. ఓఅండ్‌ఎం డివిజన్- 24 (బొల్లారం): రింగ్ మెయిన్-3 ఆన్‌లైన్ సరఫరా
- ఓఅండ్‌ఎం డివిజన్- 25 (కొంపల్లి): కొంపల్లి, గుండ్ల పోచంపల్లి, తూంకుంట, జవహర్‌నగర్, దేవరయాంజల్, హకీంపేట్
- ఆర్‌డబ్ల్యూఎస్ అప్‌టేక్ ప్రాంతాలు: ప్రజ్ఞాపూర్ (గజ్వేల్), ఆలేరు (భువనగిరి) ఘన్‌పూర్ (మేడ్చల్/ శామీర్‌పేట్), కంటోన్మెంట్ లోని కొన్ని ప్రాంతాలు, ఎంఈఎస్, తుర్కపల్లి బయోటెక్ పార్కు.

'రజాకార్' మూవీ పోస్టర్ ఆవిష్కరణ

సినిమా రిలీజ్ అయితే కొందరి మైండ్ బ్లాక్ అవుతుంది: బండి సంజయ్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బండి సంజయ్, జితేందర్ రెడ్డి, నారాయణరెడ్డి తదితరులు

ఖైరతాబాద్: సమర్ వీర్ బ్యానర్‌పై ప్రతిష్టాత్మకంగా నిర్మించిన 'రజాకార్' సినిమా పోస్టర్‌ను శుక్రవారం సాయంత్రం జలవిహార్‌లో మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, ఎంపీ బండి సంజయ్, దర్శక నిర్మాత యాటా సత్యనారాయణ, నిర్మాత గూడూరు నారాయణరెడ్డిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ రజాకార్ సినిమా చరిత్రలో నిల్చిపోతుందన్నారు. ప్రపంచాన్ని ఆకర్షించిన చరిత్ర తెలంగాణది అన్నారు. సెప్టెంబర్ 17ను విమోచన దినోత్సవంగా ప్రభుత్వమే నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ బండి సంజయ్ మాట్లాడుతూ 18-40 సంవత్సరాల మధ్యవయసు వారికి తెలంగాణ చరిత్ర తెలియదని, ఈ సినిమా ద్వారా ప్రతి ఒక్కరికి తెలంగాణ చరిత్ర తెలుస్తుందన్నారు. కొందరు చరిత్రను తెరమరుగు చేయాలని చూస్తూ, ఓటు బ్యాంకు పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. ఈ సినిమా రిలీజ్ అయితే కొందరి మైండ్ బ్లాక్ అవుతుందన్నారు. సోషల్ మీడియా వారియర్స్, యువత మీడియా ద్వారా రజాకార్ సినిమాపై ప్రచారం చేయాలన్నారు. ఈ సందర్భంగా నటి వేదిక మాట్లాడుతూ..ఈ సినిమాలో నటించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సుద్దాల అశోక్ తేజ, జితేందర్ రెడ్డి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, సంగప్ప, విఠల్‌తో పాటు నటుడు బాబి, అనిష్కా త్రిపాఠి, లక్ష్మణ్‌తో పాటు చిత్ర బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో బాలికలకు నైపుణ్య శిక్షణ



సాక్షి, సిటీబ్యూరో: ఎన్‌టీపీసీ సంస్థ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా దక్షిణ దీపాంజలి మహిళా సమితి సహకారంతో 'ప్రభుత్వంలో బాలికల కోసం వ్యక్తిత్వ వికాసం' (పీడీపీ) కార్యక్రమాన్ని ప్రారంభించింది. నెల రోజుల పాటు కొనసాగే ఈ కార్యక్రమాన్ని శుక్రవారం సికింద్రాబాద్‌లోని వెస్ట్ మారేడ్‌పల్లిలోని బాలికల ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఇందులో భాగంగా బాలికలకు కంప్యూటర్, డ్యాన్స్, డ్రామా, సెల్ఫ్ డిఫెన్స్, యోగా, కళలు తదితర అంశాల్లో శిక్షణ అందించనున్నారు. ఈ శిక్షణ పొందడానికి ఇప్పటికే 122 మంది బాలికలు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంస్థ రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దేబాశిష్ చటోపాధ్యాయ, డీడీఎంఎస్ అధ్యక్షురాలు సుచితా నంది హాజరయ్యారు. ఈ సందర్భంగా సుచితా నంది మాట్లాడుతూ., ప్రస్తుత తరంలో బాలికలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, బాలురలతో సైతం సమానంగా పోటీపడుతున్నారని తెలిపారు. ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిని ఈ వేదిక వారికి ప్రోత్సాహాన్ని అందిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా టీ-షర్ట్, ట్రాక్ ప్యాంటు, షూస్, టవల్స్, క్యాప్, వాటర్ బాటిల్‌తో కూడిన కిట్‌ను విద్యార్థినులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జీఎమ్ హెచ్ఆర్ పాణిగ్రాహి, డీజీఎమ్ బద్రుద్దీన్ అన్సారీ, పాఠశాల హెడ్‌మాస్టర్ మనోహరాచార్య, లేడీస్ క్లబ్ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసానికి సాహిత్యమే ఆధారం

'చంద్రమౌళి భారతం' గ్రంథావిష్కరణ


గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న కొలకలూరి ఇనాక్, కసిరెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు

నల్లకుంట: వ్యక్తిత్వ వికాసానికి సాహిత్యమే ఆధారమని శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం పూర్వ ఉపకులపతి, ప్రముఖ రచయిత కొలకలూరి ఇనాక్ అన్నారు. ప్రక్రియలేవైనా సంస్కారాలు సాహిత్యం ద్వారా స్వీకరించడం ముఖ్యమని పేర్కొన్నారు. తెలుగు భాషా చైతన్య సమితి, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తాధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నల్లకుంట శ్రీధర్ ప్లాజాలో ప్రముఖ రచయిత రామకృష్ణ చంద్రమౌళి రచించిన 'చంద్రమౌళి భారతం' గ్రంథావిష్కరణ సభ జరిగింది. గంటా మనోహర్ రెడ్డి సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కొలకలూరి ఇనాక్, విశిష్ట అతిథులు ఓయూ తెలుగు విభాగం పూర్వ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్‌లతో కలిసి చంద్రమౌళి భారతం గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. రచయిత చంద్రమౌళి రచనలు ఆలోచింపచేస్తాయని అన్నారు. కసిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ 64 వచన కవితలు, 64 గేయ కవితలతో కూడిన చంద్రమౌళి భారతం గ్రంథం జీవన వికాసానికి చతుషష్టి కళలనందించిందని, అందుకు ఆ గ్రంథ రచయితను కొనియాడారు. తెలుగు భాషా చైతన్య సమితి బడేసాబ్ సమన్వయకర్తగా వ్యవహరించిన కార్యక్రమానికి ఆత్మీయ అతిథులుగా తెలుగు రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం, దర్పణం సాహిత్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ సూర్యప్రకాశ్ రావు తదితరులు పాల్గొన్నారు.

సౌండ్ అండ్ లైట్ షోకు ప్రాచుర్యం పెంచాలి

పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్


కోట గోడలను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్

గోల్కొండ: గోల్కొండ కోటలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న సౌండ్ అండ్ లైట్ షోకు ప్రచారం మరింత పెంచాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన గోల్కొండ కోటను సందర్శించారు. ఈ సందర్భంగా సౌండ్ అండ్ లైట్ షో ప్రాంగణాన్ని పరిశీలించారు. గోల్కొండ కోట తెలంగాణకే తలమానికం అని ఆయన అన్నారు. గోల్కొండ కోట ప్రాధాన్యాన్ని గుర్తించిన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కోటలోనే పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. సౌండ్ అండ్ లైట్ షో జరిగే ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, గోల్కొండ కోట పరిసరాల్లో సైతం శుభ్రంగా ఉంచి పర్యాటకులలో ఆహ్లాదం నింపేందుకు కృషిచేయాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన రాణీమహల్‌ను కూడా పరిశీలించారు. అనంతరం ఆయన గోల్కొండ కోటలో తెలంగాణ పర్యాటక సంస్థ ఉద్యోగులు నిర్వహించిన బోనాల ఉత్సవాలలో పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట రాష్ట్ర పర్యాటక సంస్థ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ తదితరులున్నారు.

చర్లపల్లి ఓపెన్ ఎయిర్ జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆకస్మిక బదిలీ

సాక్షి, సిటీబ్యూరో: చర్లపల్లిలోని ఓపెన్ ఎయిర్ జైలులో అధికారుల ఆధిపత్యపోరు కారణంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ దశరథం, డిప్యూటీ జైలర్ మహిపాల్ రెడ్డిల మధ్య గత కొంతకాలంగా ఆధిపత్య పోరు కొనసాగుతుంది. ఈక్రమంలో ఇటీవల ఇద్దరి మధ్య గొడవ కూడా జరిగింది. ఈ విషయం జైళ్ల శాఖ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో ఉన్నతాధికారులు అంతర్గత విచారణకు ఆదేశించారు. దీంతో నివేదిక అనంతరం దశరథంను సంగారెడ్డి జైలు డిప్యూటీ సబ్ జైలు ఆఫీసర్(డీఎస్‌జేఓ)గా బదిలీ చేశారు. ఈమేరకు జైళ్ల శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

హత్య కుట్రను భగ్నం చేసిన పోలీసులు

తుపాకీతో తిరుగుతున్న వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న మల్కాజిగిరి డీసీపీ జానకి, ఎస్ఓటీ డీసీపీ గిరిధర్ తదితరులు

కుషాయిగూడ: ఆర్థిక లావాదేవీల్లో తేడాలు రావడంతో వ్యాపార భాగస్వామిని హత్య చేసేందుకు ప్లాన్ చేసిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద దేశీయ తుపాకి, మూడు రౌండ్ల బుల్లెట్లు, ఓ కారు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. మల్కాజిగిరి డీసీపీ డి.జానకి, ఎస్‌ఓటీ డీసీపీ ఆర్.గిరిధర్‌లు శుక్రవారం చర్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన యోగీందర్ రాజ్‌పుత్(39) నగరంలో యోగిరాజ్ సెక్యూరిటీ సర్వీస్ పేరుతో ఓ సెక్యూరిటీ ఏజెన్సీని నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో మౌలాలికి చెందిన ఈ-ప్రో సొల్యూషన్స్ ప్రతినిధి షేక్ షరీఫ్ తమ కార్యాలయానికి 25 మంది సెక్యూరిటీ గార్డ్స్ కావాలని కోరగా యోగీందర్ రాజ్‌పుత్ ఏర్పాటు చేశారు. కొన్ని రోజుల వరకు వారి డీల్ సజావుగా సాగగా.. గత కొద్దిరోజులుగా షేక్ షరీఫ్ డబ్బులు సకాలంలో చెల్లించలేదు. ఈ విషయంలో ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో షరీఫ్‌పై పగ పెంచుకున్న యోగీందర్ అతడిని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. గత జనవరిలో మధ్యప్రదేశ్‌కు వెళ్లి లల్లూశర్మ అనే తెలిసిన వ్యక్తి వద్ద నుంచి రూ.20 వేలు చెల్లించి దేశీయ తుపాకిని, మూడు రౌండ్ల బుల్లెట్లను కొనుగోలు చేసి నగరానికి చేరుకున్నాడు. మూడు నెలల క్రితం షరీఫ్ వద్దకు తుపాకితో వెళ్లి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయగా..ఆయన కొంత సమయం కావాలని కోరడంతో తిరిగి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో శుక్రవారం యోగీందర్ చర్లపల్లి రైల్వే బ్రిడ్జిపై నుంచి కారులో వెళ్తుండగా పోలీసులు అనుమానించి తనిఖీ చేశారు. అతని వద్ద తుపాకీ, బుల్లెట్లు లభించడంతో మల్కాజిగిరి ఎస్ఓటీ, చర్లపల్లి పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా వాస్తవాలు వెలుగులోకి వచ్చాయని డీసీపీ వివరించారు. సమావేశంలో కుషాయిగూడ ఏసీపీ వెంకట్‌రెడ్డి, చర్లపల్లి ఇన్‌స్పెక్టర్ వై. మల్లికార్జున్‌రెడ్డి, ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ ఎ.రాములు, ఎస్ఐలు వాసుదేవ్, రఘురాముడు, పరమేశ్వర్ సిబ్బంది పాల్గొన్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న దేశీయ తుపాకి, బుల్లెట్లు

ఆధార్ అప్‌డేట్‌కు గడువు పెంపు

ఆధార్ కార్డు నవీకరణ గడువును ప్రభుత్వం మరో మూడు నెలల పాటు పెంచింది. ఆధార్ కార్డులు పొంది పది సంవత్సరాలు పూర్తయిన వారు కార్డులను అప్డేట్ చేసుకోవాలని యూఐడీఏఐ ఇదివరకే సూచించింది. గత జూన్ 14వ తేదీ వరకు సమీపంలోని ఆధార్ కేంద్రాల్లో నవీకరణకు అవకాశం కల్పించారు. అయితే ప్రజల నుంచి నామమాత్రంగా స్పందన రావడంతో గడువును మరోసారి పొడిగించారు.



బంజారాహిల్స్ రోడ్ నెం.7 మీసేవా కేంద్రంలో ఆధార్ కార్డు అప్డేట్ చేసుకుంటున్న వినియోగదారులు

- సెప్టెంబర్ 14 వరకు అవకాశం
- బంజారాహిల్స్ రోడ్ నెం. 7 మీ సేవా కేంద్రంలో శాశ్వత ఆధార్ కేంద్రం

బంజారాహిల్స్: 2010 నుంచి 2018వ సంవత్సరాల మధ్య ఆధార్ కార్డు పొందిన వారు ఈ ఏడాది సెప్టెంబర్ 14వ తేదీ వరకు ఉచితంగా అప్డేట్ చేసుకోవచ్చని యూఐడీఏఐ ఉత్తర్వులు జారీ చేసింది.

ఆన్‌లైన్‌లోనూ...

- ఆధార్‌ను మై–ఆధార్ పోర్టల్‌లో, ఎం–ఆధార్ యాప్‌తో ఉచితంగా నవీకరించుకునే అవకాశం కల్పించారు. మీ సేవా కేంద్రాల్లో కొనసాగుతున్న శాశ్వత ఆధార్ కేంద్రాల్లో కూడా చేసుకోవచ్చు. ఆధార్ ప్రక్రియ ప్రారంభమైనప్పుడు పౌరులు చెప్పిన వ్యక్తిగత వివరాలు మాత్రమే నమోదు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. గతంలో చాలా మంది తప్పుడు సమాచారం పొందుపర్చినట్లు విమర్శలు రావడంతో ఈసారి పకడ్బందీగా, పారదర్శకంగా కార్డుల రూపకల్పనకు తెరలేపారు.
- పౌరులు చెప్పిన వివరాల ప్రకారం మాత్రమే ధ్రువీపత్రాలను అప్‌లోడ్ చేయాలని కూడా సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ అయ్యాయి. ఇంకోవైపు వివరాలు సరిగా లేకుంటే సరిచూసుకునే అవకాశాన్ని కల్పించారు. పది సంవత్సరాలకు ఒకసారి ధ్రువీకరణ పత్రాలను పొందుపరిచేలా తాజా నిబంధనలు విధించారు.
- మరోవైపు అప్డేట్ కోసం పౌరులు ఏదైనా ప్రభుత్వం గుర్తింపు పత్రం తీసుకెళ్లాలని నిబంధనలు విధించారు. అక్షరాస్యులు, పదో తరగతి మార్కుల మెమోను తీసుకెళ్తే సరిపోతుంది. ఓటరు గుర్తింపు కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, తహసీల్దార్ జారీచేసిన నివాస ధ్రువీకరణ పత్రాలను వెంట తీసుకెళ్తే ఆధార్ నవీకరణను పూర్తి చేసుకోవచ్చు.

శాశ్వత కేంద్రం ఇదే...

- బంజారాహిల్స్ రోడ్ నెం. 7లోని మీసేవా కేంద్రంలో శాశ్వత ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని పౌరులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా ఇక్కడ ఏర్పాట్లు చేశారు. మరోవైపు తపాలా కార్యాలయాల్లోనూ ఆధార్ నవీకరణకు ఏర్పాట్లు చేశారు.
- జూబ్లీహిల్స్ సొసైటీ కార్యాలయంలో ఉన్న తపాలా కార్యాలయం, బంజారాహిల్స్ రోడ్ నెం. 1లో ఉన్న బంజారాహిల్స్ బ్రాంచ్ తపాలా కార్యాలయంలోనూ ఆధార్ అప్డేట్ చేసుకునే వెసులుబాటును కల్పించారు.
- మరోవైపు పెద్దపెద్ద తపాలా కార్యాలయాల్లో ఆధార్ అప్డేట్ కోసం సిబ్బందిని నియమించారు. కొన్ని మీసేవా కేంద్రాల్లో కూడా ఆధార్ నవీకరణకు అవకాశం కల్పించారు.

క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: ఎస్‌బీటీనగర్, డీఎస్‌ఎం కాలనీ 11 కేవీ ఫీడర్లు ఎస్–పార్క్, లోధా సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎస్‌బీటీనగర్, వికార్‌నగర్, ప్రకాశ్‌నగర్‌లతో పాటుగా డీఎస్‌ఎం కాలనీ, అశోక్ కాలనీ, సనత్‌నగర్ మెయిన్‌రోడ్డు, సుభాష్‌నగర్, ఎస్‌ఆర్‌టీనగర్ కొంతభాగం, టీవీఎస్ షోరూం లైన్, మెథడిస్ట్ చర్చి లైన్, డి–మార్ట్ ఎదురలైన్లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ కిశోర్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా గ్రీన్‌పార్క్, సీఎం క్యాంపు కార్యాలయం, అవంతినగర్ 11కేవీ ఫీడర్లు బేగంపేట, గ్రీన్‌లాండ్స్, మోతీనగర్ సబ్‌స్టేషన్ పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల వల్ల గ్రీన్‌పార్క్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, సీఎం ఓల్డ్ క్యాంపు కార్యాలయం, సీఎం బిల్డింగ్, బబ్బుగూడ, మోతీనగర్, కబీర్‌నగర్, అవంతీనగర్, హనుమాన్ దేవాలయాల పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

వేడుకగా మహా చండీ హోమం



పంజగుట్ట: చింతల్‌బస్తీలోని పోచమ్మ దేవాలయంలో శుక్రవారం అమ్మవారి మహా చండీ హోమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే వేద పండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.జనార్దన్ రెడ్డి, మహేష్ కుమార్, వినోద్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాప్టిస్ట్ చర్చి వార్షికోత్సవం



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని దుర్గా భవానీనగర్ బాప్టిస్టు చర్చి నాల్గవ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. సంఘకాపరి పాస్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రెవరెండ్ దైవప్రకాశ్ క్రీస్తు సందేశాన్ని ఇచ్చారు. పాస్టర్లు జీవన్, కరుణాకర్, ప్రభుదాస్, రవిపాల్, రవికుమార్ గోవింద రాజు, తదితరులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో చర్చి విశ్వాసకులు వేడుకల్లో పాల్గొన్నారు.

ఇద్దరు రౌడీ షీటర్ల బైండోవర్

రహమత్‌నగర్: బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇద్దరు రౌడీ షీటర్లను శుక్రవారం బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ కామల్ల రవికుమార్ మాట్లాడుతూ... బోనాలు, వినాయక చవితి పండుగలను పురస్కరించుకుని పీఎస్ పరిధిలో రౌడీ షీటర్లుగా ఉన్న మహ్మద్ ఉస్మాన్, మహ్మద్ ఆయాద్‌లు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. రౌడీషీటర్లు ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చట్ట పరంగా శిక్షలు తప్పవని ఆయన హెచ్చరించారు. రౌడీ షీటర్ల కదలికలను ఎప్పటికప్పుడు పోలీసులు గమనిస్తూనే ఉంటారని ఇన్‌స్పెక్టర్ స్పష్టం చేశారు.

గుండె పోటుతో గృహిణి మృతి

పోలీసులకు మృతురాలి తండ్రి ఫిర్యాదు

హిమాయత్ నగర్: వివాహం జరిగిన పదిహేను నెలలకే ఓ గృహిణి గుండె పోటుతో మృతి చెందిన ఘటన నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నారాయణగూడ అడ్మిన్ ఎస్‌ఐ నరేష్‌గౌడ్ సమాచారం మేరకు... అంబర్‌పేట్‌కు చెందిన న్యాయవాది జైపాల్‌రెడ్డి తన పెద్ద కుమార్తె అయిన లహరి(27)ని హిమాయత్‌నగర్ ప్రాంతానికి చెందిన వల్లభ్‌రెడ్డితో గత ఏడాది ఏప్రిల్‌లో వివాహం జరిపించారు. శుక్రవారం ఉదయం జైపాల్‌రెడ్డి హైకోర్టుకు వెళ్తుండగా 9 గంటల ప్రాంతంలో అతని భార్య ఫోన్ చేసి వారి పెద్ద కుమార్తె లహరి స్పృహ తప్పి కింద పడటంతో తలకు గాయం అయ్యి రక్తస్రావం అవడంతో హాస్పిటల్‌కు తరలించినట్లు తెలిపింది. వెంటనే హాస్పిటల్‌కు వెళ్లిన జైపాల్‌రెడ్డికి పల్స్ రేటు తగ్గడంతో గుండె పోటు వచ్చినట్లు వైద్యులు తెలిపారు. చికిత్స పొందుతూ లహరి 11 గంటల సమయంలో మృతి చెందింది. తన కూతురు అల్లుడు పెళ్లయినప్పటి నుంచి అన్యోన్యంగా ఉన్నట్లు జైపాల్ రెడ్డి పోలీసులకు తెలిపారు. మృతి పట్ల తనకు ఎవరిపై అనుమానం లేదంటూనే.. మృతిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు స్టేట్‌హోం ఎదుట ధర్నా

వెంగళరావునగర్: అపరిష్కృతంగా ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మధురానగర్‌లోని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించనున్నట్లు శిశువిహార్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాపర్తి అశోక్ తెలిపారు. ముఖ్య అతిథిగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.ఈశ్వర్‌రావు, జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేష్ హాజరు కానున్నారని తెలిపారు. శిశువిహార్ కార్మికులకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని, కార్మికులకు బస్‌పాస్‌లు ఇవ్వాలని, డబుల్ డ్యూటీలకు డబుల్ వేతనాలు ఇవ్వాలని, ఆయమ్మలపై మేనేజ్‌మెంట్ వేధింపులు ఆపాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్‌లు సక్రమంగా అమలు చేయాలన్నారు.

నృత్య కళాకారిణిని చంపేస్తానంటూ బెదిరించిన భర్తపై కేసు నమోదు

ఫిలింనగర్: ప్రముఖ నృత్యకళాకారిణిని ముఖంపై యాసిడ్ పోసి చంపేస్తానంటూ బెదిరించిన ఘటనలో ఆమె భర్తపై ఫిలింనగర్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాలివీ.. ఫిలింనగర్ రోడ్ నెం. 13లో నివసించే నృత్య కళాకారిణి(32) ఇంట్లోకి గత నెల 5వ తేదీన సాయంత్రం ఆమె భర్త సాయి నిషాంత్ ఆమెకు తెలియకుండానే తాళాలు పగలగొట్టి ఇంట్లోకి వెళ్లడమే కాకుండా ఆమె పాస్‌పోర్ట్, సెల్‌ఫోన్, నగదును దొంగిలించి పరారయ్యాడు. కొంత కాలంగా ఆమె భర్తకు దూరంగా ఉంటున్నది. గత నెల 3వ తేదీన ఆమె వైజాగ్‌లో ఉండగా మద్యం మత్తులో వచ్చి నిషాంత్ ఆమె తల్లిదండ్రులను తీవ్రంగా బెదిరించాడు. భర్తతో పాటు అత్తింటివారు కూడా తనను బెదిరించడమే కాకుండా ముఖంపై యాసిడ్ పోసి చంపేస్తామని హెచ్చరించాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత ఆమె సికింద్రాబాద్‌లోని తన తల్లిదండ్రుల ఇంట్లో ఉంటున్నది. ఆమెకు తెలియకుండానే మరోసారి ఈ నెల 13వ తేదీన నిషాంత్ ఫిలింనగర్‌లోని ఆమె ఫ్లాట్ తాళాలు పగలగొట్టి స్నేహితుడు ప్రశాంత్‌తో కలిసి మరోసారి దొంగతనానికి పాల్పడ్డాడని ఆరోపించింది. ఇందుకు సంబంధించిన సీసీ ఫుటేజీలు ఉన్నాయని తెలిపింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సాయినిషాంత్‌పై ఫిలింనగర్ పోలీసులు ఐపీసీ సెక్షన్ 455, 380 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నవంబర్ 3న వర్సిటీ ఉద్యోగుల సమ్మేళనం

బంజారాహిల్స్: అసోంని గౌహతిలో ఈ నెల 12, 13 తేదీల్లో జరిగిన అఖిల భారత విశ్వ విద్యాలయాల ఉద్యోగుల సమాఖ్య జాతీయ కార్యవర్గ సమావేశంలో తెలంగాణ విశ్వ విద్యాలయాల బోధనేతర ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేశ్వర్‌గౌడ్(అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ), అధ్యక్షుడు బి. జ్ఞానేశ్వర్ (ఉస్మానియా యూనివర్సిటీ), ఉపాధ్యక్షుడు పుల్ల శ్రీనివాస్ (కాకతీయ యూనివర్సిటీ) తదితరులు పాల్గొన్నారు. కార్యవర్గ సమావేశంలో యూనివర్సిటీల ప్రైవేటీకరణ, నూతన విద్యా విధానం అమలు, ఉన్నత విద్యారంగంలో మార్పులు, విద్యారంగానికి ఉన్న స్వయం ప్రతిపత్తిని రద్దుపరిచే చర్యలు ద్వారా కేంద్ర ప్రభుత్వ ప్రత్యక్ష పర్యవేక్షణలో సామాన్య జనానికి తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వీటి సాధన కోసం నవంబర్ 3న న్యూఢిల్లీలోని రాంలీలా మైదానంలో పెద్ద ఎత్తున ఉద్యోగుల సమ్మేళనం నిర్వహిస్తామని మహేశ్వర్‌గౌడ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరించడం వల్ల కలిగే ఫలితాలు సమీక్షించారు. విశ్వ విద్యాలయాల పాలక మండళ్లలో నాన్‌టీచింగ్ స్టాఫ్ ప్రతినిధులకు స్థానం కల్పించి ప్రజా స్వామీకరణ చేయాలని డిమాండ్ చేశారు.

తాజ్‌కృష్ణాలో ఆకృతి లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్

నేటితో ఆఖరు

సాక్షి, సిటీబ్యూరో: ఆకృతి లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ సందర్శకులతో సందడిగా మారింది. ఈ నెల 13న (గురువారం) తాజ్‌కృష్ణాలో మూడు రోజుల ప్రదర్శన ప్రారంభమైంది. ఎగ్జిబిషన్‌ను ఆకృతి ఎక్స్‌పో డైరెక్టర్ సశినాథ లాంఛనంగా ప్రారంభించారు. తొలి రెండు రోజుల్లో వందలాది ఫ్యాషన్ ప్రియులతో ఎక్స్‌పో కిటకిటలాడింది. శనివారంతో ఈ ప్రదర్శన ముగియనుందని నిర్వాహకులు తెలిపారు.



పోలీసులు స్పందించారు.. యువతిని కాపాడారు!

నేరడిగొండ: ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం కుంటాల జలపాతం వద్ద ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చిన ఓ యువతిని పోలీసులు గుర్తించి కాపాడారు. ఇచ్చోడ సీఐ చంద్రశేఖర్, నేరడిగొండ ఎస్‌ఐ సాయన్న కథనం ప్రకారం... హైదరాబాద్‌లోని మధురానగర్‌కు చెందిన యువతి ఈవెంట్ మేనేజర్‌గా పనిచేస్తోంది. ఆమె మానసిక స్థితి సరిగా లేదని, శుక్రవారం ఉదయం ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు కుటుంబ సభ్యులు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉదయం 5 గంటలకు కారులో బయటకు వెళ్లినట్లు ఫోన్ లొకేషన్ ద్వారా పోలీసులు గుర్తించారు. ఆత్మహత్య చేసుకోవడానికి కుంటాల జలపాతానికి వస్తున్నట్లు స్థానిక పోలీసులకు సమాచారం అందింది. ఇచ్చోడ సీఐ ఆధ్వర్యంలో ఎస్‌ఐ సాయన్న సిబ్బందితో కలిసి జలపాతానికి చేరుకున్నారు. అటవీశాఖ, బేస్ క్యాంప్ సిబ్బంది, కుంటాల జలపాతం గైడ్‌లు అప్రమత్తమై ఆమె మెట్లు దిగే సమయంలో అడ్డుకున్నారు. ఆమెను తండ్రికి అప్పగించారు.

ఆలయాల్లో అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలి

వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్‌లోని దేవాలయాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులన్నింటినీ సత్వరమే పూర్తి చేయాలని కార్పొరేటర్ దేదీప్య విజయ్ పలు దేవాలయాల కమిటీ సభ్యులు, అధికారులకు సూచించారు. ఆదివారం జరగనున్న బోనాల ఉత్సవాల నేపథ్యంలో ఆలయాల ముస్తాబు కోసం ప్రభుత్వం విడుదల చేసిన చెక్కులను జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆలయాల కమిటీల సభ్యులకు అందజేశారు. ఆయా నిధులతో దేవాలయాల్లో రంగులు, బండలు, విద్యుత్, నీటి వసతి పనులు చేపడుతున్నారు. సంబంధిత పనులను శుక్రవారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జీటీఎస్ తాలయం, మధురానగర్‌లోని కట్టమైసమ్మ, వెంగళరావునగర్‌లోని రాజరాజేశ్వరి అమ్మవారు, యాదగిరినగర్ రేణుకా ఎల్లమ్మ, లక్ష్మీనగర్, ధోబీఘాట్, ఛాతీ ఆస్పత్రుల ప్రాంగణాల్లోని పోచమ్మ దేవాలయాలు తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ పర్యటించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ శానిటరీ విభాగం, వీధి దీపాల శాఖ, జలమండలి, రాంకీ సంస్థ సిబ్బందితో పాటు జీటీఎస్ టెంపుల్ చైర్మన్ చిన్న రమేష్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు వేణుగోపాల్, వేణు, పవన్ ముదిరాజ్, పూజారి బాల్‌రాజ్, ఆంజనేయులు యాదవ్, సురేష్ ముదిరాజ్, కిట్టు, యాదగిరి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎంలలో చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్టు



నిందితుడు తిరుపతయ్య

వెంగళరావునగర్: ఏటీఎంలలో దొంగతనానికి ప్రయత్నించిన వ్యక్తిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... ఎస్‌ఆర్‌నగర్ సమీపంలోని వెంగళరావునగర్ ప్రధాన రహదారిలో ఉన్న ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు ఏటీఎంలో శుక్రవారం తెల్లవారుజామున 4–5 గంటల మధ్య గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశించాడు. ఏటీఎంను పగలగొట్టడానికి తీవ్రంగా ప్రయత్నించాడు. అది సాధ్యం కాలేదు. ఈ క్రమంలో అక్కడ ఉన్న అలారం ద్వారా 100కు విషయం తెలిసింది. వెంటనే ఎస్‌ఐ సాయినాథ్‌రెడ్డి తన సిబ్బందితో వెళ్లి చూడగా బ్యాంకు ఏటీఎం పగలకొట్టడానికి ప్రయత్నించి ఉంది. అక్కడ ఎవరూ కనిపించలేదు. ఈ క్రమంలో పక్కనే ఉన్న మరో బ్రాంచ్ తాళాలు తీసి ఉన్నాయి. పరిశీలించగా అ ఏటీఎంలో కూడా ఇదే నిందితుడు దొంగతనానికి ప్రయత్నిస్తూ కనిపించాడు. దాంతో పోలీసులు అతనిని అదుపులోనికి తీసుకున్నాడు. ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులో సర్వీస్ ఆపరేషన్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న బి.శివరామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించగా రెండు ఏటీఎంలలో దొంగతనానికి పాల్పడిన చోరీకి పాల్పడింది ఒక్కడేనని తేలింది. నిందితుడు చెన్నూరి తిరుపతయ్య ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం అన్నారం గ్రామం నుంచి కొంతకాలం కిందట సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కాపుగల్లు గ్రామానికి వచ్చి నివసిస్తున్నట్టు పోలీసులు తెలియజేశారు. నిందితుడు కూలీ పనులు చేసుకుని జీవిస్తుంటాడని తెలిపారు.

న్యూసెన్స్‌కు పాల్పడిన వ్యాపారిపై కేసు

బంజారాహిల్స్: వ్యాపార లావాదేవీలకు సంబంధించిన విషయాలు మాట్లాడేందుకు వచ్చిన ఓ వ్యాపారి దురుసుగా ప్రవర్తించడమే కాకుండా మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని చర్యలు తీసుకోవాలంటూ వంశీరాం బిల్డర్స్ అండ్ డెవలపర్స్ సీఎండి ఎగ్జిక్యూటీవ్ సెక్రటరీ టి.వాసుదేవ రెడ్డి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలివీ... జూబ్లీహిల్స్ రోడ్ నెం. 45లో వంశీరాం బిల్డర్స్ అండ్ డెవలపర్స్ కార్యాలయానికి ఈ నెల 11వ తేదీన ఉదయం తరుణ్ గోయల్ అనే వ్యాపారి కమర్షియల్ డీల్ మాట్లాడేందుకు రాగా కార్యాలయంలో వాసుదేవరెడ్డితో పాటు సేల్స్ మేనేజర్ అరీఫ చర్చలు జరుపుతున్నారు. ఒక వైపు మాట్లాడుతుండగానే ఇంకోవైపు తరుణ్ గోయల్ గొడవకు దిగాడు. అసభ్యంగా దూషిస్తూ కార్యాలయంలో న్యూసెన్స్ చేశాడు. ఆపేందుకు యత్నించిన మహిళా ఉద్యోగులను నెట్టేస్తూ కార్యాలయ ఆవరణను భయబ్రాంతులకు గురి చేశాడు. సహకరించాలని ఎంతగా సర్దిచెప్పినా వినిపించుకోకపోగా అక్కడి ఉద్యోగులను నెట్టేస్తూ, బెదిరిస్తూ నిందలకు దిగాడు. ప్రశాంత వాతావరణంలో మాట్లాడుకుందామని అరీఫాతో పాటు వాసుదేవరెడ్డి ఎంతగా ప్రయత్నించినా వినిపించుకోకపోగా తన గొడవను మరింత పెంచి ఇక్కడి వాతావరణాన్ని భయానకంగా మార్చాడు. ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు తరుణ్ గోయల్‌పై ఐపీసీ సెక్షన్ 509 కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యుల నిర్లక్ష్యం వల్లే తండ్రి కంటి చూపు కోల్పోయాడని ఫిర్యాదు

బంజారాహిల్స్: వైద్యుల నిర్లక్ష్యం వల్ల తన తండ్రి కుడి కంటి చూపు కోల్పోయాడని సదరు ఆస్పత్రి వైద్యులపై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు ఆస్పత్రిపై కేసు నమోదు చేశారు. వివరాలివీ... మీర్‌పేట నందిహిల్స్‌కు చెందిన ఎం.నాగేంద్ర తన తండ్రి మహంకాళి రాఘవాచారిని కంటి చికిత్స నిమిత్తం జూన్ 30వ తేదీన బంజారాహిల్స్‌లోని ప్రఖ్యాత కంటి ఆస్పత్రికి తీసుకొచ్చాడు. పరిశీలించిన వైద్యులు రాఘవాచారికి చూపు రావాలంటే సిలికాన్ ఆయిల్ రిమూవల్(సోర్) సర్జరీ చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఆ మేరకు సదరు సర్జరీ నిర్వహించగా చూపు మెరుగుపడలేదు. పలుమార్లు ఇదే విషయంపై సంబంధిత వైద్యులను ప్రశ్నించారు. అయితే కొంత నిర్లక్ష్యం వల్లనే చూపుకోల్పోయి ఉంటాడని వైద్యులు కూడా అంగీకరించారు. ఇక్కడి వైద్యుల నిర్లక్ష్యం వల్ల తన తండ్రి చూపుకోల్పోయాడని చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు కార్పొరేట్ ఆస్పత్రి వైద్యుడు, యాజమాన్యంపై పోలీసులు ఐపీసీ సెక్షన్ 337 కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సర్కారు జాగా కబ్జాపై కేసు నమోదు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని పద్మాలయ అంబేద్కర్‌నగర్ బస్తీలో ఖరీదైన ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నించిన వారిపై షేక్‌పేట మండల డిప్యూటీ తహసిల్దార్ చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివీ... పద్మాలయ అంబేద్కర్‌నగర్‌లో రాజు, గోపి, నాగేశ్వర్‌రావు, రమేష్, భీమ్ తదితరులు ప్రభుత్వ స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి నిర్మాణాలకు పాల్పడుతున్నారని ఆ స్థలాలు చదును చేస్తున్నారని సమాచారం అందుకొని నిర్మాణాలను రెవెన్యూ అధికారులు నిలిపివేశారు అక్రమ నిర్మాణాలను తొలగించారు. ఈ ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు చేయడమే కాకుండా ఈ స్థలం వద్ద మరోసారి కబ్జాలు జరగకుండా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ స్థలాలు కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఈ మేరకు పోలీసులు కబ్జాదారులపై ఐపీసీ సెక్షన్ 447, 427, రెడ్‌విత్ 34 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జేహెచ్‌పీఎస్‌లో వనమహోత్సవ సందడి



నృత్యం చేస్తున్న విద్యార్థులు



వైజ్ఞానిక ప్రదర్శన తిలకిస్తున్న డాక్టర్ దుర్బారాయ్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం వనమహోత్సవ కార్యక్రమంతో పాటు ఆవిష్కార్ పేరుతో వైజ్ఞానిక ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ దుర్బారాయ్ ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థుల ప్రదర్శనను తిలకించి వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... విద్యార్థులందరూ బాధ్యతగా మొక్కలు నాటాలని దీని ద్వారా పర్యావరణంతో పాటు ఆయురారోగ్యాలు కలుగుతాయన్నారు. రోజూ తాము నాటిన మొక్కలకు నీళ్ళుపోసే బాధ్యతను కూడా తీసుకోవాలన్నారు. అనంతరం సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకించి వినూత్న పరికరాలు తయారుచేసిన విద్యార్థులను ప్రశంసించారు. విద్యార్థులను పరిశోధకులుగా, మేకిన్ ఇండియా చొరవలో చేరాలని ప్రోత్సహించారు. స్కూల్ చైర్మన్ ఎ.మురళీముకుంద్ మాట్లాడుతూ... ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని చెట్లు పర్యావరణానికి దోహదపడతాయని అన్నారు. ప్రతి విద్యార్థి పచ్చని పర్యావరణానికి అంబాసిడర్‌గా మారాలని పిలుపునిచ్చారు. స్కూల్ ప్రిన్సిపాల్ ఎం. వరలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ టి. కాంచనవల్లి పాల్గొన్నారు. సెకండరీ విద్యార్థులు ఆలోచనాత్మక స్కిట్లు ప్రదర్శించారు. భూమాతను కాపాడుకోవాలని సందేశాన్ని ఇచ్చారు.

సమస్యలపై కార్పొరేటర్ సమీక్ష

ఉప్పరబస్తీలో పర్యటించిన మన్నె కవితారెడ్డి



ఉప్పరబస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: పంజగుట్ట ఉప్పరబస్తీ జూబ్లీ మెడికల్ హాల్ లైన్‌లో శుక్రవారం వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి జూబ్లీహిల్స్ ఈఈ విజయ్‌కుమార్, ఏఈ సతీష్, బంజారాహిల్స్ సెక్షన్ జలమండలి మేనేజర్ శివకుమార్, ఎల్లారెడ్డిగూడ జలమండలి సెక్షన్ మేనేజర్ శ్యాం, విద్యుత్ శాఖ డీఈ అశోక్, ఎంటమాలజీ, ఎస్‌ఎఫ్‌ఏలతో కలిసి పర్యటించారు. స్థానికంగా కొత్త బోర్‌వెల్ పనులు స్టార్ట్ అవుతున్న నేపథ్యంలో వీటిని పరిశీలించారు. తరచూ సీవరేజి ఓవర్‌ఫ్లో అవుతున్నదని స్థానికులు ఫిర్యాదు చేశారు. అలాగే మంచినీటి సమస్య కూడా తలెత్తుతున్నదని ఆరోపించారు. వీధి దీపాలు వెలగడం లేదని కరెంటు సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. ఫిర్యాదులు, సమస్యలపై ఆమె సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. సాధ్యమైనంత త్వరగా సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 4లోని ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో శుక్రవారం బేగంపేట ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ సీఐ జి. నాగరాజు, బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింహరాజు, ఎస్‌ఐలు మహ్మద్ జాఫర్, సయ్యద్ సదాత్మా మియా, జ్యోతి తదితరులు ట్రాఫిక్‌పై విద్యార్థులకు అవగాహన కలిగించారు. పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన జీబ్రా క్రాసింగ్‌ల వద్దనే విద్యార్థులు రోడ్డు దాటాలన్నారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు ప్రతి విద్యార్థి పాటించడమే కాకుండా తమ కుటుంబ సభ్యులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడి రిమాండ్



నిందితుడు ముసద్దిక్ ఇక్బాల్

బంజారాహిల్స్: కేబీఆర్ పార్కు వద్ద వాకింగ్ చేస్తున్న యువతిని తన సెల్‌ఫోన్‌లో బంధించి కారులో కూర్చొని అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిని బంజారాహిల్స్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు... ఈ నెల 9వ తేదీన బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద ఉదయం ఓ యువతి వాకింగ్ చేస్తుండగా టీఎస్ 01 ఈడీ 8989 కారులో కూర్చున్నాడు. కరీంనగర్ వావిరాలపల్లి గ్రానైట్ వ్యాపారి ముసద్దిక్ ఇక్బాల్(25) తన సెల్‌ఫోన్‌లో ఓ యువతిని చిత్రీకరిస్తూ కారులోనే కూర్చొని ప్యాంట్ విప్పి అసభ్యకరంగా ప్రవర్తిస్తుండగా బాధిత యువతి గమనించింది. పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడిపై కేసు నమోదు చేసి శుక్రవారం తెల్లవారుజామున అరెస్ట్ చేశారు. ఈ నెల 7వ తేదీన తన స్నేహితుడి వివాహం కోసం ఇక్బాల్ కరీంనగర్ నుంచి ఎనిమిది మంది స్నేహితులతో కలిసి వచ్చి నాంపల్లిలోని ఓ లాడ్జిలో బస చేశాడు. 8వ తేదీన రాత్రి రిసెప్షన్ పూర్తయిన తర్వాత స్నేహితులతో కలిసి బంజారాహిల్స్‌లోని ఐస్‌క్రీం పార్లర్‌కు వచ్చాడు. అక్కడి నుంచి నాంపల్లిలోని లాడ్జిలో స్నేహితులను దింపి తిరిగి తెల్లవారుజామున 6 గంటల ప్రాంతంలో కేబీఆర్ పార్కు వద్దకు వచ్చి రోడ్డు పక్కన కారు ఈ ఆపి వాకింగ్ చేస్తున్న యువతులను సెల్‌ఫోన్‌లో చూస్తూ అసభ్యంగా ప్రవర్తించసాగాడు. సదరు యువతిని అనుసరిస్తూ జూబ్లీహిల్స్ రోడ్ నెం 92 వైపుకూడా కేబీఆర్ పార్కు వైపును ఆనుకొని తరచూ కారును ఆపుతూ ఆమెను సెల్‌ఫోన్‌లో చూస్తూ అదే రకంగా ప్రవర్తించాడు. బాధిత యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

నలుగురు జూదరుల అరెస్ట్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 12 ఆనంద్ బంజారా కాలనీలోని అల్విన్ కేఫ్ సమీపంలో ఉన్న హోటల్ బంజారా సూట్స్ రూమ్ నెం. 203లో కొంత కాలంగా గుట్టుచప్పుడు కాకుండా పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లుగా సమాచారం నిర్వహిస్తున్న బంజారాహిల్స్ పోలీసులు దాడులు చేసి నలుగురు జూదరులను అరెస్ట్ చేశారు. వివరాలివీ... హోటల్ బంజారాసూట్స్‌లో కొంత కాలంగా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని పోలీసులకు సమాచారం అందింది. ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఈ హోటల్‌పై దాడులు నిర్వహించారు. రూమ్ నెం 203లో మచ్చబొల్లారానికి చెందిన సాయి కిరణ్‌కుమార్(34) టోలిచౌకికి చెందిన సయ్యద్ ఇబ్రహీం(37), బంజారాహిల్స్ శ్రీరాంనగర్‌కు చెందిన ఎండి ఫర్హాన్(37), నాచారం స్వరూప్‌నగర్‌కు చెందిన మెర్విన్ కార్న్ అలియాస్ పవన్(34)లను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ. 39,500, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఏసీజేగా జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి

సాక్షి, హైదరాబాద్: తాత్కాలిక సీజే జస్టిస్ నవీన్‌రావు శుక్రవారం పదవీ విరమణ చేయడంతో ఆ పదవీ బాధ్యతలను సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి స్వీకరించనున్నారు. జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి.. శనివారం బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. కొత్త ప్రధాన న్యాయమూర్తికి కేంద్రం అనుమతి ఇచ్చి, బాధ్యతలు అప్పగించేంతవరకు జస్టిస్ షావిలి ఏసీజేగా కొనసాగనున్నారు.


వలంటీర్లలో క్రిమినల్ శక్తులున్నాయి: పవన్



సాక్షి ప్రతినిధి, ఏలూరు/తణుకు టౌన్ : వలంటీర్లలో కొన్ని క్రిమినల్ శక్తులు న్నాయని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మరో సారి తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో అనేక వ్యవస్థ లు ఉన్నప్పుడు వలంటీర్లతో సమాంతర వ్యవస్థ నడపటం ఎందుకని ఆయన ప్రశ్నించారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో వారాహి విజయయాత్రలో పవన్ మాట్లాడుతూ నాసిరకం మద్యం అమ్ముతున్నారన్నారు.

చెప్పుతో కొట్టేవారు లేకే వలంటీర్లు ప్రశ్నలడుగుతున్నారు

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు వ్యాఖ్యలు



సాక్షి, అమరావతి : చెప్పు తీసుకుని కొట్టేవారు లేకే ప్రభుత్వ సర్వేల పేరుతో వలంటీర్లు ప్రజలను వ్యక్తిగత వివరాలు అడుగుతున్నారని ప్రతిపక్ష నేత చంద్రబాబు అన్నారు. వాళ్లు ఇళ్లలోకి చొరబడుతున్నారని ఆరోపించారు. శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మేనిఫెస్టోలో చెప్పిన మహాశక్తి పథకాలపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రాజకీయం చేయవద్దని వలంటీర్లను కోరుతున్నట్లు చెప్పారు రాష్ట్రంలోని మహిళల స్థితిగతులను మహాశక్తి కార్యక్రమం ద్వారా మార్చేస్తానని తెలిపారు.

575 కోట్ల పెట్టుబడి 1,600 మందికి ఉపాధి

చందనవెళ్లిలో 2 జపాన్ కంపెనీలకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన

- వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల నిరుద్యోగ యువతకు ప్రాధాన్యం
- జపాన్ కంపెనీల కోసం క్లస్టర్ ఏర్పాటుకు సిద్ధమని స్పష్టీకరణ

షాబాద్: రంగారెడ్డి జిల్లా చందనవెళ్లిలో రూ.575 కోట్ల పెట్టుబడితో జపాన్‌కు చెందిన డైఫుకు ఇంట్రాలాజిస్టిక్స్ యూనిట్‌కు, నికోమాక్ తైకిషా క్లీన్ రూమ్స్ కంపెనీ ఏర్పాటుకు శుక్రవారం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు కంపెనీల ద్వారా ప్రత్యక్షంగా 1,600 మందికి, పరోక్షంగా మరికొంత మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని చెప్పారు వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతకు కంపెనీల్లో ప్రాధాన్యత లభిస్తుందని తెలిపారు. ఇప్పటికే కంపెనీల యాజమాన్యం స్థానికంగా ఉన్న ఐటీఐని దత్తత తీసుకోవడం జరిగిందని, వారి అవసరాలకు తగ్గట్లు విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు.

రంగారెడ్డి జిల్లాలో పెట్టుబడులు అభినందనీయం

'తయారీ రంగంలో జపాన్ ప్రపంచానికే ఆదర్శం. ఆ దేశానికి వెళ్లిన ప్రతిసారీ ఏదో ఒక కొత్త విషయం నేర్చుకుంటాను. నిజానికి అక్కడ సహజ వనరులు తక్కువ. అణుబాంబు దాడిని ఎదుర్కొని కూడా తిరిగి లేచి నిలబడింది. ఉన్న కొద్దిపాటి వనరులను ఉపయోగించుకుని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వస్తు ఉత్పత్తి, నాణ్యత అంశంలో అందరికంటే ముందుంది. పారిశ్రామిక ఉత్పత్తిలో తమ సత్తా చాటుకుంటోంది. ప్రస్తుతం భారతదేశంలోని ప్రతి ఒక్కరి ఇంట్లో ఏదో ఒక జపాన్ వస్తువు ఉంటుంది. అలాంటి దేశానికి చెందిన రెండు ప్రముఖ కంపెనీలు రంగారెడ్డి జిల్లాలో పెట్టుబడులు పెట్టడం అభినందనీయం..' అని కేటీఆర్ చెప్పారు.



శంకుస్థాపన చేస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో కాలె యాదయ్య, ఎంపీ రంజిత్‌రెడ్డి

మరిన్ని పెట్టుబడులకు సహకరించండి

'స్థానిక నాయకులు, ప్రజల చొరవతో ఇక్కడికి పెద్ద ఎత్తున కంపెనీలు వస్తున్నాయి. టెక్స్‌టైల్స్ మొదలుకొని ఎలక్ట్రిక్ వాహనాల దాకా విభిన్నమైన కంపెనీలు ఈ ప్రాంతాన్ని తమ కేంద్రంగా ఎంచుకుంటున్నాయి. రాష్ట్రంలోనే అత్యంత కీలకమైన పారిశ్రామిక వాడగా చందనవెళ్లి ఎదుగుతుంది..' అని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. జపాన్ నుంచి మరిన్ని పెట్టుబడులు వచ్చేలా సహకరించాల్సిందిగా జపాన్ కాన్సులేట్‌ను కోరుతున్నానని కేటీఆర్ చెప్పారు. జపాన్ కంపెనీల కోసం అవసరమైతే ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేసేందుకు కూడా తాము సిద్ధమని అన్నారు. చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జస్టిస్ నవీన్ రావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం. చిత్రంలో జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి, ఏజీ బీఎస్ ప్రసాద్, హెచ్‌సీఏఏ అధ్యక్షుడు పల్లె నాగేశ్వర్‌రావు తదితరులు

హైకోర్టుతో 36 ఏళ్ల అనుబంధం

- ఎన్నో మధురానుభూతుల్ని మిగిల్చిందన్న జస్టిస్ నవీన్‌రావు
- తాత్కాలిక సీజే జస్టిస్ నవీన్‌రావు పదవీ విరమణ.. హైకోర్టు ఘన వీడ్కోలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర హైకోర్టుతో తనది 36 ఏళ్ల అనుబంధమని, ఎన్నో మధురానుభూతుల్ని మిగిల్చిందని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పి.నవీన్‌రావు అన్నారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చి ఈ స్థాయికి చేరుకోగలిగానని, నీతి, నిజాయతీ, క్రమశిక్షణతో ఉంటే ఉన్నత స్థితికి చేరేందుకు ఎవ్వరూ అడ్డుకోలేరు చెప్పారు. హైకోర్టు తాత్కాలిక సీజేగా పదవీ విరమణ సందర్భంగా జస్టిస్ పి.నవీన్‌రావ పదవీవిరమణ సందర్భంగా హైకోర్టు ఘనంగా వీడ్కోలు పలికింది. మొదటి కోర్టు హాల్లో శుక్రవారం జరిగిన ఫుల్ కోర్టు ఆయనకు వీడ్కోలు చెప్పింది. ఈ సందర్భంగా జస్టిస్ నవీన్ రావు మాట్లాడుతూ.. 'హైకోర్టు విభజన సమయంలో న్యాయమూర్తి హోదాలో జస్టిస్ శేషసాయితో కలిసి చేసిన కసరత్తు ఫలితంగా తెలంగాణ హైకోర్టు వ్యవహారాలు సామరస్యంగా కొలిక్కివచ్చాయి. బిల్డింగ్ కమిటీ చైర్మన్‌గా మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేయడంతో జిల్లా కోర్టుల్లో కేసుల పరిష్కారానికి వీలైంది. జిల్లా కోర్టుల సంఖ్య పెంపు ప్రయత్నాలు ఫలించడం మంచి పరిణామం. జూనియర్ న్యాయవాదులు కష్టపడాలి' అని సూచించారు.

తెలుగులో తీర్పుతో చరిత్ర..

అంతకుముందు న్యాయమూర్తి జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి మాట్లాడుతూ.. తెలుగు, ఆంగ్ల భాషల్లో తీర్పు వెలువరించి చరిత్రకెక్కారని జస్టిస్ నవీన్‌రావును కొనియాడారు. రైతులకు న్యాయ అంశాలు వివరించే లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను ఏర్పాటు చేయించారని తెలిపారు. అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. జస్టిస్ నవీన్‌రావు న్యాయవ్యవస్థలో సాంకేతికతను అమలు చేశారన్నారు. కోవిడ్ వేళ వరంగల్‌లో న్యాయవాదులకు సంచార వాహన సౌకర్యం, హనుమకొండలో జిల్లా కోర్టుల ప్రాంగణంలో వసతులు, కల్పతరు పేరిట ఫ్యామిలీ కోర్టులు వంటివి దేశానికే ఆదర్శంగా చేశారని ప్రశంసించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, బార్‌కౌన్సిల్ చైర్మన్ ఎ.నర్సింహారెడ్డి, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె నాగేశ్వర్‌రావు, అదనపు సొలిసి టర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్, న్యాయవాదులు, న్యాయాధికారులు, కోర్టు సిబ్బంది, జస్టిస్ నవీన్‌రావు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ పోలీసులకు పతకాలు

సాక్షి, హైదరాబాద్: ఉత్తమ సేవలందించిన పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం పతకాలు ప్రకటించింది. నూతన సంవత్సరంగా సందర్భంగా ఇవ్వాల్సిన ఈ పతకాలను దక్కించుకున్న పోలీసు, అగ్నిమాపక శాఖ, జైళ్ల శాఖల అధికారుల జాబితాను శుక్రవారం విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర శౌర్యపతకం, మహోన్నత సేవాపతకం, ఉత్తమ సేవాపతకం, కఠిన సేవాపతకం, సేవాపతకం.. మొత్తం ఐదు కేటగిరీల్లో పతకాల విజేతల జాబితాను రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్ విడుదల చేశారు.

శౌర్య పతకాలు ఎవరికంటే...

పోలీస్‌శాఖ నుంచి శౌర్య పతకాన్ని గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ పి.సతీశ్ దక్కించుకున్నారు. ఇంటెలిజెన్స్ విభాగం(కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో, స్టేట్ ఇంటెలిజెన్స్ వింగ్)కు చెందిన ఎస్సై ఎస్ఏ కరీం, ఏఎస్సై శివ శంకర్, హెడ్ కానిస్టేబుళ్లు ఎండీ ఖాజా మొయినుద్దీన్, ఎస్.రాజవర్ధన్‌రెడ్డి, ఏ. బాలాజీరావు, కానిస్టేబుళ్లు పి మోహన్, కె కిరణ్‌కుమార్, బి.లక్ష్మీ నారాయణ, బి.వీరస్వామి, ఎండీ అలీముద్దీన్‌లకు తెలంగాణ అగ్నిమాపకశాఖ నుంచి శౌర్య పతకం అందుకున్న వారిలో అసెంబ్లీ ఫైర్ స్టేషన్ అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ వి.ధనుంజయ్‌రెడ్డి, సికింద్రాబాద్ ఫైర్ స్టేషన్‌లో ఎస్ఎఫ్ఓ(స్టేషన్ ఫైర్ ఆఫీసర్)గా పనిచేస్తున్న డి. మోహన్‌రావు, గౌలిగూడ ఫైర్ స్టేషన్ ఎస్ఎఫ్ఓ ఎన్ ప్రవీణ్‌కుమార్, మొఘల్‌పుర ఫైర్ స్టేషన్ ఫైర్‌మన్ బి.వెంకటేశ్వర రాజు, గౌలిగూడ ఫైర్‌స్టేషన్ ఫైర్‌మెన్ మహ్మద్ అస్గర్, అసెంబ్లీ ఫైర్‌స్టేషన్ ఫైర్‌మన్ టి. హరికృష్ణ, సికింద్రాబాద్ ఫైర్‌స్టేషన్ ఫైర్‌మన్ ఎం.హరికృష్ణలకు దక్కాయి. పోలీస్ శాఖ నుంచి మహోన్నత సేవా పతకాలు 16 మందికి, ఉత్తమ సేవా పతకాలు 94 మందికి, కఠిన సేవాపతకాలు 51 మందికి, సేవా పతకాలు 473 మందికి దక్కాయి.



ధనుంజయ్‌రెడ్డి



మోహన్‌రావు

ఇల్లెందు ఫైర్‌స్టేషన్ డ్రైవర్‌కు మహోన్నత సేవా పతకం

మహోన్నత సేవా పతకం ఖమ్మం జిల్లా ఇల్లెందు ఫైర్‌స్టేషన్ డ్రైవర్ ఆపరేటర్ కే వెంకటేశ్వర్లుకు దక్కింది. ఉత్తమ సేవా పతకాలు ముగ్గురికి, సేవా పతకాలు 14 మందికి దక్కాయి.

ఏసీబీలో...

ఏసీబీలో ఉత్తమ సేవాపతకాలు వరంగల్ రేంజ్ కానిస్టేబుల్ ఏ. నర్సయ్య, నిజామాబాద్ రేంజ్ కానిస్టేబుల్ జి సురేశ్, ఖమ్మం రేంజ్ హెడ్‌కానిస్టేబుల్ టి.క్రిష్ణ సూరిలకు దక్కించుకున్నారు. సేవాపతకాలు 22 మందికి దక్కాయి. విజిలెన్స్ విభాగం నుంచి ఇన్‌స్పెక్టర్ ఎం.హుస్సేని నాయుడు, కానిస్టేబుల్ ఎంఏ మసూద్‌లకు దక్కగా, సేవాపతకాలు ఇన్‌స్పెక్టర్ దండిక మహేశ్, కానిస్టేబుల్ డి.రాజేశ్‌కుమార్ దక్కించుకున్నారు.

ఎస్పీఎఫ్‌లో..

స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌కు చెందిన వారిలో సబ్ ఇన్‌స్పెక్టర్ డి. తిరుపతిరెడ్డికి మహోన్నత సేవా పతకం దక్కింది. ఉత్తమ సేవా పతకాలు ముగ్గురికి, సేవాపతకాలు 15 మందికి దక్కాయి. కాగా, పతకాల జాబితా ఆరు నెలలు ఆలస్యం కావడంపై సిబ్బందిలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. అయితే, ఆలస్యంగానైనా పతకాలు దక్కినందుకు ఒకింత సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

హైకోర్టుకు మరో ముగ్గురు న్యాయమూర్తులు

కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర హైకోర్టుకు మరో ముగ్గురు న్యాయమూర్తులను నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం బుధవారం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. కొలీజియం సిఫారసు చేసిన జాబితాలో న్యాయాధికారి సుజన కళాసికం, న్యాయవాదులు లక్ష్మీనారాయణ అలిశెట్టి, అనిల్‌కుమార్ జూకంటి పేర్లు ఉన్నాయి. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ సంజయ్ కౌశల్, జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని కొలీజియం చేసిన సిఫారసులను కేంద్రం ఆమోదించి రాష్ట్రపతికి నివేదించాల్సి ఉంటుంది. రాష్ట్రపతి ఆమోదముద్ర వేస్తే ఈ ముగ్గురూ హైకోర్టు న్యాయమూర్తులుగా నియమితులవుతారు. వీరి పేర్లకు రాష్ట్ర గవర్నర్, సీఎం గతంలోనే ఆమోదం తెలిపారు.

అలిశెట్టి లక్ష్మీనారాయణ: నిజామాబాద్ జిల్లా మెండోరా గ్రామంలో హెడ్మాస్టర్ గంగాధర్, రాజుబాయ్ దంపతులకు 1968 మే 13న లక్ష్మీనారాయణ జన్మించారు. నిజామాబాద్ ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి, కాకతీయ యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. 1994లో బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ చేయించుకున్నారు. రాజ్యాంగ, 'సివిల్ లా'లో నైపుణ్యం సాధించారు. ఆయన జాతీయ రహదారుల అభివృద్ధి అథారిటీ, ఎన్‌టీసీసీ, ఓరియంటల్ లైఫ్ ఇన్సూరెన్స్‌తోపాటు పలు ఎల్పీసీ, బ్యాంకులకు స్టాండింగ్ కౌన్సిల్‌గా ఉన్నారు.

కె.సుజన: నల్లగొండ జిల్లా ఆలేరుకు చెందిన మధుసూదన్, ప్రమీల దంపతులకు కె.సుజన 1970 మార్చి 10న జన్మించారు. 1997లో బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ అయ్యారు. 2010లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. జూనియర్ సివిల్ జడ్జిగా కొనసాగుతూనే 2012లో జిల్లా జడ్జి పరీక్షలు రాసి ఎంపికయ్యారు. కరీంనగర్ అదనపు జిల్లా జడ్జిగా, నిజామాబాద్ జిల్లా జడ్జిగా, హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో స్మాల్ కాజెస్ కోర్టు చీఫ్ జడ్జిగాను, జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్‌గా పనిచేశారు. గతేడాది నుంచి హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా సుజన విధులు నిర్వర్తిస్తున్నారు.

తల్లిదండ్రుల చెంతకు బుల్లితెర నటి

వెంగళరావునగర్: బాలిక మిస్సింగ్ కేసును గంటల వ్యవధిలోనే మధురానగర్ పోలీసులు పరిష్కరించారు. వివరాలివీ... రహమత్‌నగర్‌లో నివాసం ఉండే డి.సంతోషి కుమార్తె బుధవారం ఉదయం స్నేహితురాలు ఇంట్లో పూజ ఉందని చెప్పి వెళ్లింది. గురువారం వరకు కూడా తిరిగి రాలేదు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు గురువారం రాత్రి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మైనర్ అయినందున పోలీసులు బాలికను కనిపెట్టే విషయంలో అత్యంత చాకచక్యంగా వ్యవహరించారు. ఫోన్ ఆధారంగా యాదాద్రిలో ఉన్నట్టు గుర్తించారు. శుక్రవారం ఉదయం ఆ బాలిక యాదాద్రిలో తనకు తెలిసిన లక్ష్మీ అనే మహిళతో కలిసి తిరుగుతుండగా ఎస్ఐ నరేందర్, సిబ్బంది వెళ్లి పట్టుకున్నారు. బాలికను విచారించగా సీరియల్స్, సినిమాలలో నటించాలని కోరిక ఉందని, అప్పుడప్పుడు కొన్ని సీరియల్స్‌లో చిన్న క్యారెక్టర్స్‌లో కూడా నటించినట్టు పేర్కొంది. ఈ క్రమంలో లక్ష్మీ అనే మహిళ సినిమాల్లో అవకాశం ఇప్పిస్తానని చెప్పడంతో యాదాద్రికి వచ్చినట్టు పోలీసులకు తెలిపింది. పోలీసులు బాలికను మధురానగర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

నగర వార్తలు

లాల్‌దర్వాజా ఆలయానికి పోటెత్తిన భక్తజనం

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. ఢిల్లీ మిఠాయి వాటిక ఆధ్వర్యంలో 56 రకాల మిఠాయిలతో ఛప్పన్ భోగ్ నైవేద్యం సమర్పించారు. విజయవాడ కనక దుర్గమ్మ దేవస్థానం ఆలయ కమిటీ ఈవో భ్రమరాంబా, బోర్డు చైర్మన్ రాంబాబు బృందం పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ సి.రాజేందర్ యాదవ్ వారికి స్వాగతం పలికారు. గ్రేటర్ హైదరాబాద్ బీసీ మహిళా సంఘం అధ్యక్షురాలు ఆలే భవ్య ఆధ్వర్యంలో అమ్మవారికి బంగారు బోనం, పట్టు వస్త్రాలు సమర్పించారు. ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎంపీ వి.హనుమంత రావు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. గాంధీనగర్ కార్పొరేటర్ పావనీ వినయ్ కుమార్ కుటుంబ సభ్యులు అమ్మవారికి చేనేత పట్టు వస్త్రాలు సమర్పించారు. ఇదిలా ఉండగా ఆదివారం జరిగే బోనాల ఉత్సవాలలో పాల్గొనాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారిని కమిటీ సభ్యులు ఆహ్వానించారు.





లాల్‌దర్వాజా అమ్మవారికి ఛప్పన్ భోగ్ నైవేద్యం, అమ్మవారిని దర్శించుకున్న ఆర్.కృష్ణయ్య

ఎంసీఆర్‌హెచ్ఆర్డీలో వైభవంగా బోనాలు



సాక్షి, సిటీబ్యూరో: డాక్టర్ ఎంసీఆర్‌హెచ్ఆర్డీ ఇనిస్టిట్యూట్‌లో శుక్రవారం బోనాల జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో శిక్షణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు, బీహార్ నుంచి శిక్షణకు వచ్చిన ఎన్‌ఫోర్స్‌మెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, మిలిటరీ, ఇంజినీరింగ్ సేవలకు సంబంధించిన అధికారులు, పలువురు సివిల్ అధికారులు, సంస్థ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంస్థలోని రామదేసు రంగస్థలి నుంచి ప్రారంభమైన బోనాల ఊరేగింపు ఆవరణలోని ఆలయం వద్దకు వేడుకగా చేరుకుంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా మహిళలు మట్టి కుండలలో బోనం తలపై పెట్టుకొని ఆలయంలోని మహంకాళి అమ్మవారికి సమర్పించారు. లయబద్ధంగా డప్పుచప్పుళ్లు, ఉర్రూతలూగించే నృత్యాలు, మధురమైన జానపద గీతాలు వీక్షకులను కనువిందు చేశాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ బెన్‌హూర్ మహేశ్‌దత్ ఎక్కా మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతిలో బోనాలు అంతర్భాగమన్నారు. తెలంగాణ ప్రాంతం విశ్వాసాలు, మానవత్వం ఏకత్వానికి నిబద్ధతకు ఇవి నిదర్శనమని కొనియాడారు.

సాక్షి రియల్టీ

తగ్గిన రిజిస్ట్రేషన్లు

- జూన్‌లో 5,566 అపార్ట్‌మెంట్ల రిజిస్ట్రేషన్స్
- వీటి విలువ రూ.2,898 కోట్లు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ స్థిరాస్తి రంగం ఎన్నికల మూడ్‌లోకి వెళ్లిపోయింది. సార్వత్రిక ఎన్నికలకు ఇంకా ఆరు నెలలు సమయం ఉండగా.. రియల్టీ రంగంలో స్తబ్దత నెలకొంది. ఏ ప్రభుత్వం వస్తుందో, అభివృద్ధి పనులు ఎలా ఉంటాయో, ధరలు తగ్గుతాయేమో అనే రకరకాల కారణాలతో స్థిరాస్తి విక్రయాలు తగ్గుముఖం పట్టాయి. మే నెలతో పోలిస్తే జూన్‌లో గ్రేటర్‌లో రిజిస్ట్రేషన్లు, వాటి విలువలు క్షీణించడమే ఇందుకు ఉదాహరణ. మేలో రూ.2,994 కోట్ల విలువ చేసే 5,877 అపార్ట్‌మెంట్ల రిజిస్ట్రేషన్స్ జరగగా.. జూన్ నాటికి రూ.2,898 కోట్ల విలువైన 5,566 యూనిట్ల రిజిస్ట్రేషన్స్ జరిగాయని నైట్‌ఫ్రాంక్ ఇండియా నివేదిక వెల్లడించింది.

- గతేడాది జూన్‌లో జరిగిన 5,411 యూనిట్లతో పోలిస్తే గత నెలలో రిజిస్ట్రేషన్లలో 3 శాతం వృద్ధి నమోదయింది. అలాగే విలువల పరంగా చూస్తే 2022 జూన్‌లో రూ.2,842 కోట్లతో పోలిస్తే గత నెలలో 2 శాతం పెరుగుదల కనిపించింది. గత నెలలోని రిజిస్ట్రేషన్లలో 52 శాతం యూనిట్లు రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షల మధ్య ధర ఉన్న గృహాలే. అలాగే రూ.కోటి కంటే ఎక్కువ ధర ఉన్న లగ్జరీ గృహాల వాటా 9 శాతంగా ఉంది. 68 శాతం ఫ్లాట్లు 1,000 చ.అ. నుంచి 2,000 చ.అ. మధ్య విస్తీర్ణం ఉన్న యూనిట్లే. 2 వేల చ.అ. కంటే విస్తీర్ణమైన ఇళ్ల వాటా 11 శాతంగా ఉంది.
- రిజిస్ట్రేషన్లలో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా హవా కొనసాగుతుంది. జూన్‌లో జరిగిన రిజిస్ట్రేషన్లలో ఈ జిల్లా వాటా 46 శాతం కాగా.. రంగారెడ్డి 38 శాతం, హైదరాబాద్ 16 శాతం వాటాను కలిగి ఉన్నాయి.



ఈ ఏడాది నెల వారీగా రిజిస్ట్రేషన్లు (రూ.కోట్లలో)

నెల	రిజిస్ట్రేషన్లు	విలువ
జనవరి	5,454	2,650
ఫిబ్రవరి	5,725	2,987
మార్చి	6,959	3,602
ఏప్రిల్	4,494	2,286
మే	5,877	2,994
జూన్	5,566	2,898

సోమాజిగూడలో రూ.5.09 కోట్లు

సోమాజిగూడ ఖరీదైన నివాసాలకు కేంద్రంగా మారింది. గత నెలలో జరిగిన రిజిస్ట్రేషన్లలో టాప్-5 లావాదేవీలలో నాలుగు ఈ ప్రాంతంలోనే జరగడం గమనార్హం. రూ.5.09 కోట్ల మార్కెట్ విలువ గల 3,500 చ.అ.ల లోపు ఉన్న రెండు అపార్ట్‌మెంట్లు, రూ.4.22 కోట్ల వ్యాల్యూ ఉండే మరొక రెండు యూనిట్ల రిజిస్ట్రేషన్స్ జరిగాయి. అలాగే నార్సింగిలో రూ.5 కోట్ల మార్కెట్ విలువ గల ఓ ఫ్లాట్ రిజిస్ట్రేషన్ జరిగిందని నైట్‌ఫ్రాంక్ రిపోర్ట్ వెల్లడించింది.

తెలంగాణకు ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ మణిహారం

రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్



వ్యవస్థాపకులకు జ్ఞాపికను అందిస్తున్న ప్రొఫెసర్ రాజ్‌రెడ్డి, చిత్రంలో ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర కిరీటంలో ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ఒక మణిమారం లాంటిదని రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం రాత్రి క్యాంపస్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలోని ఏ రాష్ట్రం సాధించని విధంగా గడచిన తొమ్మిదేళ్లలో తెలంగాణ అద్భుత ప్రగతిని సాధించిందన్నారు. ఇంజినీరింగ్ కళాశాలల్లో నాణ్యమైన విద్యను అందించడంలో, సామాజిక సమస్యల పరిష్కారంపై ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని, అధ్యాపకుల గొప్పతనాన్ని ఇతర కళాశాలలు, పరిశ్రమలు సమాజానికి అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. నాస్కామ్ అధ్యక్షుడు దేబ్జానీఘోష్ మాట్లాడుతూ... 1998లో భారతదేశాన్ని నిజమైన టాలెంట్ హబ్‌గా మార్చే దిశగా ప్రణాళికను రూపొందించడానికి నాస్కామ్, ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ భాగస్వామిగా పనిచేస్తాయన్నారు. అనంతరం వివిధ సంస్థల వ్యవస్థాపకులను సన్మానించారు. ట్రిపుల్‌ఐటీ చైర్మన్ ప్రొఫెసర్ రాజ్‌రెడ్డి, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు శ్రీనిరాజు, ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజే నారాయణన్, పలువురు ప్రొఫెసర్లు, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తాం



షూటింగ్ పోటీలలో పాల్గొన్న కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు

రాయదుర్గం: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలల్లోనూ రాణించేలా వారిని ప్రోత్సహిస్తామని హెచ్‌సీయూ కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ మిత్రవిందారావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని కేంద్రీయ విద్యాలయ ఆధ్వర్యంలో శాట్స్ షూటింగ్ రేంజ్‌లో 52వ కేంద్రీయ విద్యాలయ రీజనల్ స్పోర్ట్స్ మీట్ షూటింగ్ పోటీలను శుక్రవారం పద్మశ్రీ అవార్డు గ్రహీత ముఖేష్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి వివిధ కేంద్రీయ విద్యాలయాల నుంచి విద్యార్థులు పోటీలో పాల్గొంటున్నారన్నారు. పద్మశ్రీ ముఖేష్‌కుమార్ మాట్లాడుతూ... విద్యార్థి దశ నుంచే చదువుతోపాటు క్రీడలలో రాణిస్తే భవిష్యత్తులో ఎంతో ప్రగతిని సాధించే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం ముఖేష్‌కుమార్‌తో కలిసి విజేతలకు మెడల్స్ అందించి వారిని సత్కరించారు. ఈ క్రీడలలో ఉత్తమ ప్రతిభ చాటిన వారు సెప్టెంబర్-అక్టోబర్‌లలో ఢిల్లీలో జరిగే కేంద్రీయ విద్యాలయ నేషనల్ గేమ్స్‌లో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. కార్యక్రమంలో పీఈటీ విజయభాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కోచ్‌లు, పీఈటీలు పాల్గొన్నారు.

బోనాలకు విశ్వవ్యాప్త గుర్తింపు

హోం మంత్రి మహమూద్‌అలీ, ఎమ్మెల్సీ ప్రభాకర్

జియాగూడ: ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ బోనాల పండుగను ప్రపంచస్థాయిలో గుర్తింపు తెచ్చారని రాష్ట్ర హోం మంత్రి మహమూద్‌అలీ, ఎమ్మెల్సీ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం జియాగూడ మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ ఆధ్వర్యంలో పలు మాతేశ్వరి దేవాలయాలకు పట్టువస్త్రాలు, ఒడి బియ్యాన్ని సమర్పించే కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని పండగలను గౌరవిస్తుందన్నారు. రాష్ట్రంలోని ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు పడాలని మాతేశ్వరిలను వేడుకున్నామన్నారు. అన్ని మతాల సారాంశం ఒకటేనని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఠాకూర్ జీవన్‌సింగ్, దర్బార్ మైసమ్మ ఆలయ చైర్మన్ అమర్‌సింగ్, మాజీ కార్పొరేటర్ బంగారి ప్రకాష్, ముత్యాల భాస్కర్, నర్మద, అభిషేక్ మిత్ర, నరహరిచారి, తూమ్‌కుంట అరుణ్‌కుమార్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



మహంకాళి మైసమ్మ పూజలు నిర్వహించిన హోంమంత్రి మహమూద్ అలీ, మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ

ఆత్మగౌరవానికి పరదా..



ఈ ఫొటో చూడండి.. వెదురు తడక.. దానిపై కట్టిన చీరలు. తాత్కాలిక గుడారాల దగ్గర స్నానాలకోసం ఏర్పాటు చేసుకున్న 'చాటు' అనిపి స్తోంది కదా!

కానీ, ఈ తాత్కాలిక ఏర్పాటు ఇళ్లు లేని ఏ పేదలదో కాదు.. ఓ ప్రభుత్వ వృత్తి విద్య కళాశాలలో విద్యార్థినులకు ఏర్పాటు చేసిన మరుగుదొడ్డి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో మరుగుదొడ్లు లేవు. ప్రత్యామ్నాయంగా కళాశాల పక్కన తడక, దాని మీద పరదాలతో మరుగుదొడ్డి ఏర్పాటు చేశారు. విద్యార్థినులు, మహిళా సిబ్బంది ఈ 'చాటు'నే ఉపయోగించుకుంటున్నారు. ప్రభుత్వం స్పందించి 'మరుగుదొడ్డి' సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

– కాటారం

తర'గతి' మారేదెప్పుడు



- ఒకే గదిలో ఐదు తరగతులు
- ఒక్క టీచర్‌తోనే బోధన

ఆదిలాబాద్ పట్టణంలోని తాటిగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి ఐదో తరగతి వరకు మొత్తం 80 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాలలో ఇద్దరు ఎస్జీటీ ఉపాధ్యాయులు ఉండగా.. ఒక ఉపాధ్యాయిని ప్రసూతి సెలవుపై వెళ్లారు. దీంతో అన్ని తరగతుల విద్యార్థులను ఒకే చోట కూర్చోబెట్టి బోధిస్తున్నారు.



ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం పప్కాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 52 మంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయిని ఉన్నారు. పాఠశాలలో 1 నుంచి 5 తరగతుల విద్యార్థులను ఒకే గదిలో కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. పాఠశాల హెచ్‌ఎం సర్వర్‌అహ్మద్ అనారోగ్య సమస్యతో ములుగుకు డిప్యుటేషన్ వేయించుకున్నారు. మరో ఉపాధ్యాయిని సబియా సుల్తానా.. రాష్ట్ర హోంమంత్రి నుంచి చెక్ స్లిప్ తెచ్చుకొని మహ్మద్‌గౌస్‌పల్లికి డిప్యుటేషన్ చేయించుకున్నారు. దీంతో ఇదే మండలం లంబాడీతండాలో ఎస్జీటీగా పనిచేస్తున్న సుజాతను డిప్యుటేషన్‌పై వేయడంతో.. ఆమె ఒక్కరే అయిదు తరగతులకు బోధించలేక తంటాలు పడుతున్నారు.

సాక్షి ఫొటోగ్రాఫర్ / ఆదిలాబాద్- ఏటూరునాగారం

ఇక ఫ్రాన్స్‌లోనూ భారత యూపీఐ సేవలు

ఫ్రాన్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాం
- ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి
- ఫ్రాన్స్ నేషనల్ డే వేడుకల్లో పాల్గొన్న ప్రధానమంత్రి



ప్రధాని మోదీని 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ద లెజియాన్ ఆఫ్ ఆనర్'తో సత్కరిస్తున్న ఇమ్మానుయేల్ మాక్రాన్

పారిస్: నగదు రహిత లావాదేవీల కోసం ప్రవేశ పెట్టిన భారత యూపీఐ సేవలను ఫ్రాన్స్‌లోనూ ఉపయోగించుకొనేలా ఇక్కడి ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. భారత నవీన ఆవిష్కరణలకు కొత్త మార్కెట్‌ను తెరిచామని అన్నారు. భారత్ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని హర్షం వ్యక్తం చేశారు. స్థానిక కాలమానం ప్రకారం గురువారం సాయంత్రం ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ప్రవాస భారతీయుల సమావేశంలో మోదీ ప్రసంగించారు. నూతన క్రమం (న్యూ ఆర్డర్) దిశగా ప్రపంచం పయనిస్తోందని, ఇదే సమయంలో భారత్ బలం, పాత్ర సైతం వేగంగా మారిపోతున్నాయని అన్నారు. ఫ్రాన్స్‌లోని మార్సిలీ నగరంలో కొత్తగా భారత కాన్సులేట్‌ను ప్రారంభించబోతున్నట్లు మోదీ ప్రకటించారు. ఫ్రాన్స్‌లో చదువుకుంటున్న భారతీయ విద్యార్థులకు ఐదేళ్ల గడువుతో కూడిన పోస్ట్‌-స్టడీ వర్క్ వీసాలు లభిస్తాయని తెలిపారు. ఫ్రాన్స్‌కు గతంలో చాలాసార్లు వచ్చాయని, ఈసారి పర్యటన మాత్రం తనక చాలా ప్రత్యేకమని వివరించారు. 25 ఏళ్ల క్రితం భారత్‌-ఫ్రాన్స్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం కుదిరిందని గుర్తుచేశారు. భారత్‌-ఫ్రాన్స్ మధ్య భాగస్వామ్యానికి ఇరుదేశాల ప్రజల మధ్యనున్న అనుబంధమే పునాదిగా నిలుస్తోందని కొనియాడారు. భారత్‌లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టాలని ప్రవాస భారతీయులకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. పారిస్‌లోని ఎలిసీ ప్యాలెస్‌లో ప్రధాని మోదీకి ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ దంపతులు ప్రత్యేక విందు ఇచ్చారు.

భారత్‌-ఫ్రాన్స్ బంధం మరింత బలపడాలి

ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో శుక్రవారం అట్టహాసంగా జరిగిన నేషనల్ డే(బాస్టిల్ డే) వేడుకల్లో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ ఆయనకు సాదర స్వాగతం పలికారు. నేషనల్ డే పరేడ్‌లో త్రివిధ దళాలకు చెందిన భారత సైనికబృందం సైతం పాలుపంచుకుంది. ఫ్లైపాస్ట్ భాగంగా భారత వైమానిక దళానికి(ఐఏఎఫ్) చెందిన రఫేల్ యుద్ధ విమానాల విన్యాసాలు ఆహూతులను అబ్బురపర్చాయి. బాస్టిల్ డే గురించి మోదీకి మాక్రాన్ వివరించారు. శతాబ్దాల చరిత్ర ఉన్న నీతి నియమాలు భారత్‌కు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయని, మనం నివసిస్తున్న భూగోళాన్ని శాంతియుతంగా, సౌభాగ్యవంతంగా మార్చడానికి భారత్ కట్టుబడి ఉందని మోదీ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. బలమైన, నమ్మకమైన భాగస్వామిగా కొనసాగుతున్న ఫ్రాన్స్‌కు 140 కోట్ల మంది భారతీయులు కృతజ్ఞులై ఉంటారని వెల్లడించారు. భారత్‌-ఫ్రాన్స్ మధ్య బంధం మరింత బలపడాలని మోదీ ఆకాంక్షించారు. నేషనల్ డే వేడుకలకు భారత ప్రధానమంత్రిని గౌరవ అతిథిగా ఆహ్వానించడం చాలా ఆనందంగా ఉందని ఇమ్మానుయేల్ మాక్రాన్ ట్వీట్ చేశారు. ప్రపంచ చరిత్రలో భారత్‌కు ప్రత్యేక స్థానం ఉందని, భవిష్యత్తులో భారత్ నిర్ణయాత్మక పాత్ర పోషించబోతోందని తెలిపారు. ఫ్రెంచ్ సైన్యంతో కలిసి మొదటి ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న భారత సైనికుల త్యాగాలను ఎప్పటికీ మరువలేమని ఉద్ఘాటించారు.

మోదీకి ఫ్రాన్స్ అత్యున్నత పౌర, సైనిక పురస్కారం

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మరో అరుదైన గౌరవం దక్కింది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ ఆయనకు తమ దేశ అత్యున్నత పౌర, సైనిక పురస్కారమైన 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ద లెజియాన్ ఆఫ్ హానర్'ను ప్రదానం చేశారు. ఈ పురస్కారం అందుకున్న తొలి భారత ప్రధానమంత్రిగా మోదీ చరిత్ర సృష్టించారు. ఈ పురస్కారాన్ని గతంలో దక్షిణాఫ్రికా అధ్యక్షుడు నెల్సన్ మండేలా, బ్రిటిష్ రాజు చార్లెస్‌-3, జర్మనీ మాజీ చాన్స్‌లర్ యాంజెలా మెర్కెల్, ఐక్యరాజ్యసమితి మాజీ ప్రధాన కార్యదర్శి బౌత్రోస్ బౌత్రోస్‌-ఘలీ తదితరులు స్వీకరించారు. 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ద లెజియాన్ ఆఫ్ హానర్'పురస్కారం లభించడం పట్ల నరేంద్ర మోదీ ఆనందం వ్యక్తం చేశారు. ఇది 140 కోట్ల మంది భారతీయులకు దక్కిన గొప్ప గౌరవమని పేర్కొన్నారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌కు, ఫ్రాన్స్ ప్రభుత్వానికి, ప్రజలకు మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు. భారత్ పట్ల ఫ్రాన్స్ చూపుతున్న ఆదరణకు ఇదొక నిదర్శనమని ఉద్ఘాటించారు. 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ద లెజియాన్ ఆఫ్ హానర్'ను 1802లో అప్పటి ఫ్రాన్స్ అధినేత నెపోలియన్ బోనపార్టీ ఏర్పాటు చేశారు. ప్రధాని మోదీని ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలు తమ అత్యున్నత పౌర పురస్కారాలతో సత్కరించాయి. గత నెలలోనే ఆయన ఈజిప్ట్ ప్రభుత్వం నుంచి 'ఆర్డర్ ఆఫ్ నైలు'ను స్వీకరించారు.

మోదీకి విలువైన బహుమతులు

ప్రధాని మోదీకి ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ విలువైన బహుమతులు అందజేశారు. 1916 నాటి సిక్కు సైనికాధికారి ఫొటో ప్రతిరూపాన్ని, 11వ శతాబ్దం నాటి చదరంగం పావుల(చార్లిమాగ్నే చెస్‌మెన్) నమూనాను బహూకరించారు. అలాగే 1913 నుంచి 1927 మధ్య ప్రచురితమైన 'ఇన్ సెర్చ్ ఆఫ్ లాస్ట్ టైమ్'అనే సిరీస్ నవలలను మోదీకి అందజేశారు. వీటిని మార్సెల్ ప్రౌస్ట్ రచించారు. ఫ్రెంచ్ సాహిత్యంలో ఈ నవలలు పేరుప్రఖ్యాతులు పొందాయి.

నేడు దుబాయ్‌కి ప్రధాని మోదీ

దుబాయ్: ప్రధాని మోదీ ఫ్రాన్స్ పర్యటనను ముగించుకుని శనివారం ఒక్క రోజు పర్యటనకు గాను యూఏఈకి చేరుకోనున్నారు. రెండు దేశాల మధ్య కుదిరిన చారిత్రక సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం(సెపా) అమలుపై అబుదాబి పాలకుడు, యూఏఈ ప్రెసిడెంట్ జాయెద్ అల్ నహ్యాన్‌తో కలిసి సమీక్ష జరపనున్నారు. సెపా అమల్లోకి వచ్చిన ఏడాదిలోనే రెండు దేశాల మధ్య వాణిజ్యం 19% మేర పెరిగి 85 బిలియన్ డాలర్లకు చేరిందని యూఏఈలో భారత రాయబారి సంజయ్ సుధీర్ చెప్పారు.

బీసీ కులవృత్తిదారులకు ఆర్థికసాయం పంపిణీ నేడే

అన్ని నియోజకవర్గాల్లో 300 మందికి చొప్పున లబ్ధి
- ప్రతినెలా 15వ తేదీన పంపిణీ కొనసాగించేలా కార్యాచరణ
- ఇప్పటికే రూ.400 కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో అర్హత సాధించిన వెనుకబడిన వర్గాల్లోని కులవృత్తిదారులకు నేడు(శనివారం) ఆర్థికసాయం అందించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర బీసీ కార్పొరేషన్, ఎంబీసీ కార్పొరేషన్ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బీసీ కులవృత్తిదారుల ఆర్థికసాయం పంపిణీ పథకాన్ని రాష్ట్ర దశాబ్ది వేడుకల్లో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ లాంఛనంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆర్థికసాయం కోసం రాష్ట్రప్రభుత్వం రూ.400 కోట్లు విడుదల చేసింది. విడతలవారీగా ఈ కార్యక్రమాన్ని కొనసాగించనున్న నేపథ్యంలో నిధులను కూడా ఆ మేరకే విడుదల చేయనుంది. అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా బీసీ కులవృత్తిదారుల ఆర్థికసాయం పంపిణీని సంబంధిత ఎమ్మెల్యేలు ప్రారంభించనున్నారు.

తొలివిడత పెద్దఎత్తున కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నందున ముందుగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మూడు వందల మందికి సాయాన్ని అందిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా 5.28 లక్షల దరఖాస్తులు రాగా, క్షేత్రస్థాయిలో అధికారులు వీటిని క్రమంగా పరిశీలిస్తూ అర్హతలను నిర్ధారిస్తున్నారు. అర్హత సాధించినవారికి ప్రతినెలా 15వ తేదీన సాయాన్ని అందించనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఇప్పటికే ప్రకటించారు. ఇందులో భాగంగా ప్రతి నెలా కులవృత్తిదారులకు ఆర్థికసాయాన్ని అందించే దిశగా బీసీ కార్పొరేషన్ కార్యాచరణ రూపొందించింది.

గూబ గుయ్‌మంటోంది



నిశిరాత్రి వాహనాల మోత...
చెవులకు చిల్లులు.. నిద్రపోని మహానగరం

పగలు, రాత్రి అనే తేడాలు చెరిగిపోయి రోడ్లపై 24 గంటలూ వాహనాల రణగొణ ధ్వనులు..

పగలు కంటే రాత్రి సమయాల్లోనే అత్యధికంగా ధ్వనుల స్థాయిలు

హైదరాబాద్‌లో రాత్రిళ్లు మోతాదుకు మించి పెరుగుతున్న శబ్దాలతో ప్రజల తిప్పలు

జూబ్లీహిల్స్, తార్నాక, జేఎన్‌టీయూ, గచ్చిబౌలిలో కనీస శబ్ద ప్రమాణాలకు మించి వెలువడుతున్న ధ్వనులు

అర్ధరాత్రి ఒంటి గంట.. రెండు గంటలు..
ఎప్పుడైనా జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ మెయిన్‌రోడ్లు చూశారా..

బంపర్ లైట్లు వేసుకుంటూ.. గట్టిగా హారన్లు కొట్టుకుంటూ కార్లు, టూవీలర్లు లెక్కకు మించి అతివేగంగా వెళ్తుంటాయి. ఏదో ఒక్క రోజు.. రెండు రోజులో కాదు.. ప్రతిరోజూ ఇదే వరస.. వాస్తవానికి సగటున పగటిపూట కంటే కూడా ఆయా రోడ్లపై రాత్రి పూట తిరిగే వాహనాలే ఎక్కువని ఓ అంచనా. హైదరాబాద్ మహానగరంలో రాత్రిళ్ల ఉద్యోగాలు, ప్రజల జీవనశైలి అలవాట్లలో వచ్చిన మార్పులకు పగలు, రాత్రి అనే తేడాలు చెరిగిపోయాయి. అయితే వచ్చిన చిక్కల్లా ఏమిటంటే విపరీతమైన శబ్దకాలుష్యం. చెవులకు చిల్లులు పడే ధ్వనుల మోత. పెరిగిన వాహనాలతోపాటు పెద్దఎత్తున సాగుతున్న గృహనిర్మాణ, మౌలిక సదుపాయాల కల్పన పనులు, పరిశ్రమలు.. డీజే సౌండ్లు, హడావుడితో అర్ధరాత్రి ఫంక్షన్లు తదితర రూపాల్లో పరిమితులకు మించి శబ్దాలు వెలువడుతున్నాయి.

సాక్షి, హైదరాబాద్

తాజాగా తెలంగాణ కాలుష్య నియంత్రణబోర్డు (పీసీబీ) గణాంకాలను పరిశీలిస్తే... పగలు కంటే కూడా రాత్రి సమయాల్లోనే మోతాదుకు మించి శబ్దాలు వెలువడుతున్నట్టు వెల్లడైంది. ఎప్పటి లెక్కో కాదు...తాజాగా ఈ నెల 1 నుంచి 14వ తేదీల మధ్య వెలువడిన శబ్దాలకు సంబంధించిన సమాచారం గమనిస్తే... జూబ్లీహిల్స్, జేఎన్‌టీయూ, తార్నాక, జూ పార్కు, గచ్చిబౌలిలలో పగటిపూట కంటే కూడా రాత్రిళ్లు ధ్వనులు ఎక్కువగా వెలువడుతున్నట్టు స్పష్టమవుతోంది. ఈ ఏడాది ప్రారంభం జనవరి 1 నుంచి జూన్ 30 వరకు దాదాపుగా ఇదే ట్రెండ్ కొనసాగిందంటే వాస్తవ పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

మారిన జీవనశైలి అలవాట్లతో...

పగలు, రాత్రి అనే తేడా లేకుండా వాహనాలు, ఇతర రూపాల్లో అంతకంతకూ పెరుగుతున్న విపరీతమైన ధ్వనులతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. నిర్ణీత పరిమితులకు మించి వెలువడుతున్న శబ్దాలతో చిన్నపిల్లలు మొదలు వృద్ధుల వరకు ప్రభావితమవుతున్నారు. జీవనశైలి అలవాట్లలో వచ్చిన మార్పు చేర్పులతో పగటి కంటే కూడా రాత్రిపూట పొద్దుపోయే దాకా వాహనాల రాకపోకలు, పెద్దశబ్దంతో హారన్లు మోగించడం, ఫంక్షన్లు, ఇతర కార్యకలాపాలు శబ్దాల పెరుగుదలకు కారణమవుతున్నాయి. ఉదయం 9 నుంచి సాయంత్రం 7 లోపు నిర్ణీత ఆఫీస్ పనివేళల్లో పనిచేసే వారితోపాటు అమెరికా, యూరప్, బ్రిటన్ వేళలను బట్టి పనిచేసేవారు కూడా ఉంటున్నారు. రోజుకు మూడు, నాలుగు షిఫ్టుల్లో ఉద్యోగ విధులు, బాధ్యతల నిర్వహణలో నిమగ్నమవుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. ఉద్యోగాలు, వ్యాపారాలు, చదువు, ఇతర విధులు, బాధ్యతల్లో నిమగ్నమైనవారు పనిచేసే సమయాలు కూడా మారిపోతున్నాయి.

అధిక ధ్వనులతో ఆరోగ్యంపై దుష్ప్రభావం

రాత్రిపూట విశ్రాంతి తీసుకునే సమయంలో వాహనాలు, ఇతర రూపాల్లో ధ్వనులు పెరగడం వంటివి వివిధ సమస్యలకు పరోక్షంగా కారణమవుతున్నట్టుగా నిపుణులు చెబుతున్నారు. మోతాదుకు మించి అధికంగా వెలువడే ధ్వనులతో ఆరోగ్యం, మానసికస్థితి తదితరాలపై తమకు ఎలాంటి దుష్ఫలితాలు కలుగుతాయన్న దానిపై ప్రజలకు ఇంకా పూర్తిస్థాయి అవగాహన ఏర్పడలేదు. వాయుకాలుష్యం కారణంగా ఎలాంటి సమస్యలు వస్తాయో తెలిసినంతగా శబ్దకాలుష్యం గురించి అంత అవగాహన కలగకపోవడంతో వివిధ రూపాల్లో రోజువారీ జీవితంలో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోందని నిపుణులు చెబుతున్నారు.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

ప్రస్తుతం సోషల్‌లైఫ్‌లోనూ ఎంటర్‌టైన్‌మెంట్ పేరుతో బర్త్‌డేలు, ఇతర ఫంక్షన్లను పెద్ద శబ్దాలతో డీజేలు వంటివి నిర్వహిస్తున్నారు. 80 డెసిబుల్స్‌కు మించి వెలువడే శబ్దాలకు 8 గంటలపాటు ఎక్స్‌పోజ్ అయితే వినికిడి శక్తిపై ప్రభావం పడుతుంది. చెవుల్లో గింగురమనే శబ్దాల(టినిటస్)తో మానసిక ఒత్తిళ్లు పెరిగేందుకు కారణమవుతున్నాయి. ఏకాగ్రత దెబ్బతింటోంది. ఉదయం నుంచి రాత్రి దాకా పరిమితులకు మించి వెలువడే శబ్దాలు మనుషుల 'హ్యూమో డైనమిక్స్' పైనా ప్రభావం చూపి రక్తపోటు రావొచ్చు. గుండె సంబంధిత సమస్యలకు దారి తీయొచ్చు. రాత్రిళ్లు విశ్రాంతి తీసుకోవాల్సిన సమయాల్లో వెలువడే శబ్దాలు వృద్ధులు, పిల్లలు, విద్యార్థులపై ప్రభావం చూపుతాయి. ప్రస్తుతం ప్రజల జీవనశైలి అలవాట్లు మారినందున దానికి తగ్గట్టుగా ప్రభుత్వం అధికశబ్దాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. **- డాక్టర్ ఎం.మోహన్‌రెడ్డి**

ఉదయం, రాత్రి సమయాల్లో వెలువడే ధ్వనులకు కాలుష్య నియంత్రణ మండలి నిర్దేశించిన పరిమితులు ఇవీ... (స్టాండర్డ్ డెసిబుల్స్‌లో)

వివిధ ప్రాంతాల వారీగా	ఉదయం 6 నుంచి రాత్రి 10 వరకు	రాత్రి 10 నుంచి ఉదయం 6 వరకు
నివాస ప్రాంతాలు	55	45
కమర్షియల్ ఏరియా	65	55
ఇండస్ట్రియల్ ఏరియా	75	70
సెన్సిటివ్ ఏరియా (హాస్పిటల్స్, స్కూల్స్, జూ వంటివి)	50	40

పీసీబీ గణాంకాల ప్రకారం గత మూడునెలల్లో నమోదైన వివరాలు ఇవి... (ఉదయం 6-రాత్రి10 గంటల మధ్య)- (రాత్రి 10-ఉదయం 6 గంటల మధ్య)

	జూన్	మే	ఏప్రిల్
జూబ్లీహిల్స్(నివాస ప్రాంతం)	64.61-69.20	64.33-68.08	65.27-70.14
తార్నాక (నివాస ప్రాంతం)	68.52-64.87	65.65-61.62	63.59-58.45
జేఎన్‌టీయూ(కమర్షియల్ ఏరియా)	73.41-72.28	72.62-70.48	72.58-71.46
జూపార్కు(సెన్సిటివ్ ఏరియా)	58.87-60.36	61.80-58.50	52.64-56.78
గచ్చిబౌలి(కమర్షియల్ ఏరియా)	63.82-58.47	64.97-61.29	64.20-64.53

ఆ మధ్యన నిజామాబాద్ జిల్లా బోధన్‌లో ఓ పెళ్లి వేడుకలో భాగంగా నిర్వహించిన రాత్రి బరాత్‌లో డీజే సౌండ్‌కు అస్వస్థతకు గురైన పెళ్లి కొడుకు ఒక్కసారిగా గుండెపోటుకు గురై కుప్పకూలి కన్నుమూశాడు. కేవలం మితిమీరిన డీజే సౌండ్ వల్ల మృత్యువాత పడుతున్న ఇలాంటి అవాంఛనీయ ఘటనలు ఈ మధ్యన ఎక్కువగా వింటున్నాం. డీజే సౌండ్‌తో పాటు.. రాత్రి పూట విపరీతంగా పెరుగుతున్న ధ్వని కాలుష్య దుష్ప్రభావాలకు అడ్డుకట్ట ఎప్పుడు??

బీజేపీ నేత కిడ్నాప్?

ఘట్‌కేసర్ వద్ద అనుమానాస్పద స్థితిలో అదృశ్యం

- ఎమ్మెల్యేకు సన్నిహితుడైన వ్యక్తి కిడ్నాప్ చేశాడని భార్య ఫిర్యాదు
- పాకాలకుంట స్థల వివాదమే కారణమని వెల్లడి
- కిడ్నాప్ జరగలేదంటున్న అల్వాల్ పోలీసులు
- రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న చర్లపల్లికి చెందిన తిరుపతిరెడ్డి



తిరుపతిరెడ్డి (ఫైల్)

అల్వాల్ (హైదరాబాద్): అనుమానాస్పద స్థితిలో ఓ రియల్టర్, బీజేపీ నేత అదృశ్యమయ్యారు. అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన స్థానికంగా కలకలం సృష్టించడంతో పాటు చర్చనీయాంశమయ్యింది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామకు చెందిన ముక్కెర తిరుపతిరెడ్డి కుషాయిగూడ చర్లపల్లిలో నివసిస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. బీజేపీ రాష్ట్ర నాయకుడిగా కూడా కొనసాగుతున్నారు. తిరుపతిరెడ్డికి అల్వాల్ పరిధిలోని పాకాలకుంటలో ఓ వివాదాస్పద స్థలం ఉంది. దీనికి సంబంధించి స్థానికంగా ఉన్న ఓ వ్యక్తితో కొన్ని నెలలుగా వివాదం కొనసాగుతుండటంతో ఆయన పోలీసులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలోనే గురువారం తిరుపతిరెడ్డి తన స్థలానికి సంబంధించి అల్వాల్ తహసీల్దార్ కార్యాలయానికి కారులో వెళ్లారు. డ్రైవర్ వేరే పనిమీద వెళ్లిపోగా.. ఆ తర్వాత కొద్దిసేపటికే తిరుపతిరెడ్డి కన్పించకుండా పోయారని పోలీసులతో పాటు కుటుంబసభ్యులు వెల్లడించారు. అప్పటి నుంచి తిరుపతిరెడ్డి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోందని భార్యతో పాటు అతని సోదరుడు కరుణాకర్‌రెడ్డి తెలిపారు. స్థల వివాదం నేపథ్యంలో అధికార పార్టీ ఎమ్మెల్యేకు సన్నిహితుడైన మామిడి జనార్ధన్‌రెడ్డి తన భర్తను కిడ్నాప్ చేశారని, ఆయనకు ఏదైనా జరిగితే వారిదే బాధ్యతని తిరుపతిరెడ్డి భార్య సుజాత పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆటోలో వెళ్లి..అదృశ్యమై..

మండల కార్యాలయం నుంచి తిరుపతిరెడ్డి ఒక్కడే ఆటోలో వెళ్లినట్లు సీసీ కెమెరాల పుటేజీల పరిశీలన అనంతరం పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఘటకేసర్ వద్ద ఆటో దిగి సమీపంలోని దుకాణ సముదాయంలోకి వెళ్లాడని, ఎవరూ కిడ్నాప్ చేయలేదని ఇన్‌స్పెక్టర్ ఉపేందర్‌రావు వెల్లడించారు. తిరుపతిరెడ్డి ఆచూకీని గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపినట్లు చెప్పారు.

కుటుంబసభ్యుల ఆందోళన..

కిడ్నాప్‌కు గురైన తిరుపతిరెడ్డి ఆచూకీని తెలుసుకోవడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన భార్య, సోదరుడు ఆరోపించారు. ఆయన అదృశ్యమై దాదాపు రెండురోజులు గడుస్తున్నా పోలీసులు ఎందుకు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారో అర్థం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తొలుత పోలీస్‌స్టేషన్ వద్ద సీసీ కెమెరాలు పనిచేయడం లేదని చెప్పిన పోలీసులు, ఇప్పుడు మాట మార్చి పుటేజీలు ఉన్నాయంటున్నారని చెప్పారు. తన భర్తకు ఎలాంటి హాని జరిగినా పోలీసులే బాధ్యత వహించాలని సుజాత పేర్కొన్నారు.

పోలీస్‌స్టేషన్ ముందు బైఠాయింపు

తిరుపతిరెడ్డి కిడ్నాప్‌కు పాల్పడిన వారిపై కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులు, మిత్రులు, బీజేపీ నాయకులు, పోలీస్‌స్టేషన్ ముందు బైఠాయించారు. జనగామ, ఇతర ప్రాంతాల నుంచి తిరుపతిరెడ్డి శ్రేయోభిలాషులు కూడా పెద్దసంఖ్యలో అల్వాల్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. అధికార పార్టీ నాయకులే తిరుపతిరెడ్డిని కిడ్నాప్ చేసి ఉంటారని స్థానిక బీజేపీ నాయకులు ఆరోపించారు.

అదుపులో తిరుపతిరెడ్డి స్నేహితుడు

దర్యాప్తులో భాగంగా పోలీసులు కీలక సమాచారాన్ని సేకరించినట్లు సమాచారం. ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా ఘట్‌కేసర్ ప్రాంతంలో తిరుపతిరెడ్డిని వదిలిపెట్టినట్లు పోలీసులకు చెప్పాడని తెలిసింది. అక్కడి నుంచి ఆయన ఎక్కడికి వెళ్లి ఉంటారనేది పోలీసులు ఆరా తీస్తున్నారు. తిరుపతిరెడ్డి కాల్ డేటాను పరిశీలించిన పోలీసులు.. ఆయన గత కొన్ని రోజులుగా తరచూ స్నేహితుడితో మాట్లాడుతున్నట్లుగా గుర్తించినట్లు తెలిసింది. శుక్రవారం కూడా వేరే ఫోన్ ద్వారా మాట్లాడని తెలియడంతో అతన్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శనివారం ॥ 15-7-2023


రీతూ కరిధాల్

అదర్ సైడ్

'నిప్పులు చిమ్ముకుంటూ నింగికి నేనెగిరిపోతే ఆనంద తరంగాలలో మీరు...' అన్నది చంద్రయాన్-3 ఆ ఆనంద తరంగాలలో తేలియాడిన అసంఖ్యాక భారతీయులలో 'రాకెట్ ఉమెన్ ఆఫ్ ఇండియా'గా పేరు తెచ్చుకున్న రీతు కరిధాల్ ఒకరు. మూడు దశలు పూర్తి చేసుకొని చంద్రయాన్-3 విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలోకి వెళ్లింది. దేశాన్ని సంతోషంలో ముంచెత్తింది. 'చంద్రయాన్-3'లో 'నేను సైతం' అంటూ మిషన్ డైరెక్టర్‌గా కీలక బాధ్యతలు స్వీకరించింది రీతు కరిధాల్. చిన్నప్పటి కలలు కలలుగానే ఉండిపోవు. కష్టపడితే ఆ కలలు నిజమవుతాయి. పదిమంది మన గురించి గర్వంగా చెప్పుకునేలా చేస్తాయి... అని చెప్పడానికి రీతు కరిధాల్ నిలువెత్తు నిదర్శనం. 'ఊపిరి సలపని పనుల్లో మహిళా శాస్త్రవేత్తలకు వృత్తి, వ్యక్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకోవడం కుదురుతుందా? ఎలాంటి ఇబ్బందులు ఉంటాయి?' అనే ప్రశ్నకు రీతు కరిధాల్ మాటల్లో సమాధానం దొరుకుతుంది...

కుటుంబమే నా బలం

ఉత్తర్‌ప్రదేశ్‌లోని లక్నోకు చెందిన రీతు కరిధాల్‌కు చిన్నప్పుడు ఆకాశం వైపు చూడడం అంటే ఇష్టం. రాత్రులలో గంటల తరబడి ఆకాశంకేసి చూసేది. నక్షత్రాల గురించి ఆలోచించేది. 'చంద్రుడు ఒకసారి పెద్దగా, ఒకసారి చిన్నగా ఎందుకు కనిపిస్తాడు?'... లాంటి సందేహాలెన్నో ఆమెకు వచ్చేవి.

అంతరిక్షంపై రీతు ఆసక్తి వయసుతోపాటు పెరుగుతూ పోయింది.

హైస్కూల్ రోజులకు వచ్చేసరికి అంతరిక్షం, ఇస్రో, నాసాకు సంబంధించి పత్రికలలో వచ్చిన వార్తలు, వ్యాసాలను కట్ చేసి ఫైల్ చేసుకునేది.

'యూనివర్శిటీ ఆఫ్ లక్నో'లో ఎం.ఎస్సీ., బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ)లో ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ చేసింది. 1997లో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)లో చేరడం ఆమె జీవితాన్ని మలుపు తిప్పింది. 'మిషన్ ఎనాలసిస్ డివిజన్'లో తొలి ఉద్యోగం. తొలి టాస్క్ తన ముందుకు వచ్చినప్పుడు...

'చాలా కష్టం' అనుకుంది.

ఆ సమయంలో ఆ కష్టాన్ని పక్కకు తోసి టాస్క్‌ను విజయవంతంగా పూర్తి చేయడానికి తాను చదువుకున్న ఫిజిక్స్, మ్యాథమేటిక్స్ కంటే తనమీద తనకు ఉన్న ఆత్మవిశ్వాసమే ఎక్కువగా ఉపయోగపడింది. ఆ తరువాత కూడా ప్రాజెక్ట్‌ల రూపంలో ఎన్నో సవాళ్లను విజయవంతంగా అధిగమించింది. 'టైమ్ అండ్ ది టార్గెట్'ను దృష్టిలో పెట్టుకొని కాలంతో పరుగు తీసింది.

'అప్పటికి నాకు ఇంకా పెళ్లి కాలేదు. పేయింగ్ గెస్ట్‌గా ఉన్నాను. పొద్దుటి నుంచి రాత్రి వరకు పనిచేయాల్సి వచ్చేది. అయితే అదేమీ నాకు భారంగా, కష్టంగా అనిపించేది కాదు. చేస్తున్న పని ఇష్టమైనది కావడమే దీనికి కారణం. అప్పట్లో ఎక్కువమంది మహిళలు ఇస్రోలో లేరు. ఒక ల్యాబ్ నుంచి మరో ల్యాబ్‌కు, ఒక బిల్డింగ్ నుంచి మరో బిల్డింగ్‌కు ఒంటరిగానే వెళ్లేదాన్ని. ఎప్పుడూ భయం అనిపించేది కాదు' అంటుంది రీతు.

ఒక్కోమెట్టు ఎక్కుతూ 'ఇస్రో' చేపట్టిన ఎన్నో ప్రాజెక్ట్‌లలో కీలక బాధ్యతలు చేపట్టింది. ప్రతిష్ఠాత్మకమైన 'మంగళ్‌యాన్ మిషన్'లో డిప్యూటీ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా, చంద్రయాన్-2 మిషన్ డైరెక్టర్‌గా పనిచేసింది.

మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన రీతుకు కోచింగ్ సెంటర్‌లకు వెళ్లేంత స్థోమత ఉండేది కాదు. చదువుపై తన ఆసక్తే తన శక్తిగా మారింది.

బీఎస్సీ పూర్తికాగానే 'ఏదో ఒక ఉద్యోగంలో చేరవచ్చు కదా' అనే మాటలు చుట్టాలు పక్కాల నుంచి వినిపించేవి. 'ఇస్రోలో పనిచేయాలనేది నా కల' అని వారికి స్పష్టంగా చెప్పేది రీతు.

తన పుస్తకం 'దోజ్ మాగ్నిఫిసెంట్ ఉమెన్ అండ్ దెయిర్ ఫ్లైయింగ్ మెషిన్స్' కోసం మిన్నీ వేద్ రీతు కరిధాల్‌ను ఇంటర్వ్యూ చేసింది. ఆ ఇంటర్వ్యూలో తన అనుభవాలను ఇలా పంచుకుంది రీతు...


పిల్లలతో రీతూ కరిధాల్

'టైమ్ మేనేజ్‌మెంట్'కు అధిక ప్రాధాన్యత ఇచ్చే రీతు వృత్తి, వ్యక్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకోవడానికి ప్రయత్నించేది. వృత్తిరీత్యా ఎంత బిజీగా ఉన్నా పిల్లల దగ్గర కూర్చొని వారితో హోంవర్క్ చేయించడం మరిచేది కాదు.

'ఇస్రోలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. లింగవివక్షతకు తావు లేదు. ప్రతిభ మాత్రమే ముఖ్యం అవుతుంది. రిమోట్ సెన్సింగ్, కమ్యూనికేషన్ శాటిలైట్స్ ఫీల్డ్‌లో సీనియర్ ఉమెన్ సైంటిస్ట్‌లు ప్రోగ్రామ్ డైరెక్టర్‌లు కావడం దీనికి నిదర్శనం. నా తొలి ప్రాజెక్ట్ చేయడానికి ఎంతోమంది సీనియర్‌లు ఉన్నప్పటికీ ఆ అవకాశం నన్ను వెదుక్కుంటూ వచ్చింది'

'టైమ్ మేనేజ్‌మెంట్'కు అధిక ప్రాధాన్యత ఇచ్చే రీతు వృత్తి, వ్యక్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకోవడానికి ప్రయత్నించేది. వృత్తి రీత్యా ఎంత బిజీగా ఉన్నా పిల్లల దగ్గర కూర్చొని వారితో హోంవర్క్ చేయించడం మరిచేది కాదు.

'మంగళ్‌యాన్ మిషన్'లో భాగమైనప్పుడు రీతు కుమారుడి వయసు తొమ్మిది, కూతురు వయసు నాలుగు సంవత్సరాలు. క్షణం తీరిక లేని పనుల్లో కూడా ఏదో రకంగా తీరిక చేసుకొని పిల్లలతో తగిన సమయం గడిపేది. వారు నిద్రపోయిన తరువాత ఆఫీసు పని మొదలుపెట్టేది. అలా పనిచేస్తూ కుర్చీలోనే నిద్రపోయిన రోజులు ఎన్నో ఉన్నాయి!

'ఒకసారి మా అమ్మాయికి జ్వరం వచ్చింది. హాస్పిటల్‌కు తీసుకువెళ్లే టైమ్ లేకపోవడంతో నా భర్త తీసుకువెళ్లాడు. ఆఫీసులో ఉన్న మాటేగానీ నా మనసంతా పాపపైనే ఉంది. పాపకు ఎలా ఉంది అని ఎప్పటికప్పుడు అడుగుతుండేదాన్ని. అపరాధ భావనతో బాధ అనిపించేది. కొన్నిసార్లు స్కూల్ ఫంక్షన్‌లకు వెళ్లడం కుదిరేది కాదు. అయితే కుటుంబం నాకు ఎప్పుడూ అండగానే నిలబడింది. అదే నా బలం.

ఆఫీసు నుంచి ఇంటికి ఆలస్యంగా రావడానికి కొన్ని కుటుంబాల్లో ఒప్పుకోరు. మగవాళ్ల విషయంలో అయితే పట్టింపులు ఉండవు. మంగళ్‌యాన్ మిషన్ కోసం పనిచేసే రోజుల్లో ఇంటికి ఆలస్యంగా వచ్చేదాన్ని. అయితే నాపై ఉండే పనిఒత్తిడి గురించి తెలిసిన కుటుంబసభ్యులు నన్ను అర్థం చేసుకున్నారు. ఇంట్లో ఏ చిన్న సమస్య వచ్చినా అది నేను చేసే పనిపై ప్రభావం చూపేది. అందుకే ఎలాంటి సమస్యలు రాకుండా, మనసు ప్రశాంతగా ఉండేలా చూసుకునేదాన్ని' అంటుంది రీతు కరిధాల్.

* మనం మాట్లాడుకోవాల్సిందే!

వ్యసనాల బారిన పడిన వ్యక్తిని ఆ కుటుంబంలోని వారు మొదట్లో గుర్తించరు. తమ వాళ్లు మంచివాళ్లని, చెడు అలవాట్లకు బానిసలు కారని నమ్ముతారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు స్నేహితుల ప్రభావమో, మరొకటో అనుకుంటారు తప్ప సమస్యను పెద్దగా పట్టించుకోరు. ఈ సమస్యను ఫ్యామిలీ డినైల్ అంటున్నారు నిపుణులు. అడిక్షన్స్ గురించి అసలు మన కుటుంబాలు ఎంతవరకు అర్థం చేసుకుంటున్నాయి..? ఎలాంటి నిర్ణయాలు అమలు చేస్తున్నాయి? ఈ అంశం పై 'మనం మాట్లాడుకోవాల్సిందే!'

నమ్మడమే ప్రమాదమా..!

● అపార్ట్‌మెంట్‌లో దాదాపు అన్ని ఫ్లాట్స్ ఒకేలా ఉంటాయి. ఒక బ్బాయి రాత్రి టైమ్‌లో బాగా తాగేసి తమ ఇల్లు అనుకొని, వేరేవాళ్ల ఇంటి బెడ్‌రూమ్‌కి వెళ్లి పడుకున్నాడు. ఆ ఇంట్లో వాళ్లు పెద్ద గొడవ చేశారు. ఆ అబ్బాయి వాళ్ల తల్లితండ్రులు తమ పిల్లవాడిని తిట్టకుండా ఏదో పొరపాటున జరిగి ఉంటుందంటూ ఆ కుటుంబంతో గొడవ పడ్డారు.

● ఫ్యామిలీ ఫంక్షన్‌కి భర్త రాలేదు. 'ఏమైంది..'అని ఎవరైనా అడిగితే ఆరోగ్యం బాగోలేదు అంటారు. ఆ సదరు వ్యక్తి ఇంట్లో ఉండి తాగుతుంటాడు.

● మల్టిపుల్ అడిక్షన్స్‌కు అలవాటుపడిన ఓ అబ్బాయి వచ్చి కౌన్సెలింగ్ తీసుకుంటానంటే, తల్లి ఒప్పుకోలేదు. 'నీకేమైంది, బాగానే ఉన్నావ్ కదా! పై చదువుల కోసం అమెరికా వెళుతున్నావ్. బాధ్యత తెలిస్తే సెట్ అవుతావులే' అంటుంది.

● ఒక భార్య 'మా ఆయన తాగినప్పుడు చాలా క్రూరంగా బిహేవ్ చేస్తాడు. మిగతా సమయాల్లో చాలా చాలా బాగుంటాడు' అని సరిపెట్టుకుంటుంది.

● 'మా వాడు చాలా మంచోడు సార్, చాలా జాగ్రత్తగా ఉంటాడు. మొన్ననే తాగి డ్రైవ్ చేయడం వల్ల యాక్సిడెంట్ అయ్యింది' అంటాడు తండ్రి.

● కజిన్స్ రిలేటివ్ ఫంక్షన్‌లో ఒకబ్బాయి ఓవర్‌గా తాగాడు. మనవాడు కదా అని మరుసటి రోజు తల్లికి ఫోన్ చేసి 'అక్కా, మీ అబ్బాయి పార్టీలో ఓవర్‌గా తాగాడు' అని చెబితే 'మా అబ్బాయి అలాంటోడు కాదు, ఫ్రెండ్స్, కజిన్స్ బలవంతం చేసుంటారు' అని వెనకేసుకొచ్చింది. విషయం చెప్పిన వ్యక్తితో మాట్లాడటమే మానేసింది బంధుమిత్రులు ఎవరైనా 'మీ అబ్బాయి తాగుతుండగా ఫలానా చోట చూశాం' అని చెబితే వాళ్లతోనూ మాట్లాడటం మానేసింది. ఒకసారి కాలేజీలో గంజాయి తీసుకుంటూ పట్టుబడ్డాడు. తల్లిదండ్రులని పిలిస్తే 'మా అబ్బాయిని కావాలనే బ్లేమ్ చేస్తున్నారు. మీదే అసలు సమస్య అనేసింది.'

ఇలాంటి సమర్థింపులు ఎన్నో .. ఎన్నెన్నో మీకూ తెలిసే ఉంటాయి.

■ **వెరీ డేంజర్!!**

చాలామంది పేరెంట్స్ తమ పిల్లలు వ్యసనాల బారినపడ్డారనే విషయం తెలిసినా వారు ఒప్పుకోరు. వ్యసనపరులకు కుటుంబాల నుంచి ఇలాంటి రక్షణ దొరికితే ఎప్పటికీ మార్పు రాదు సరికదా సర్దుకుపోవడం, కొట్టిపారేయడం చేస్తుంటే మీ కుటుంబం బీటలు వారడానికి సిద్ధంగా ఉందని గ్రహించాల్సిందే! అడిక్షన్ వెరీ వెరీ డేంజర్ డిసీజ్. ఈ సందర్భంలో కుటుంబంలో ఎవరిలోనైనా అడిక్షన్స్‌కు సంబంధించిన లక్షణాలు కనిపిస్తే వెంటనే చికిత్స చేయించడం మేలు.


ప్రతీకాత్మక చిత్రం

■ **ధైర్యమే ఆయుధం**

వ్యసనాల బారిన పడ్డవారు నమ్మబలికే మాటలు చెబుతారు. సంఘటన తర్వాత 'సారీ..' అనేస్తారు. చిన్న చిన్న కానుకలు ఇచ్చి, తమ లోపాన్ని కప్పిపుచ్చుకునేవారుంటారు. దీంతో అమ్మ/భార్య/అక్క/ మన వాళ్లే కదా, మన పిల్లలే కదా.. మరోసారి ఇలా చేయరులే అనుకుంటారు. ఇదే విధమైన ప్రవర్తన కొన్నాళ్లకు ముదిరి ఇంట్లో భయోత్పాతాలను సృష్టిస్తుంటారు.

■ **కుటుంబం ప్రవర్తన మారాల్సిందే!**

కొడుకు/కూతురు/హజ్బెండ్/ఫాదర్ కి అడిక్షన్ పట్ల సపోర్ట్ ఇవ్వకూడదు. ఇంట్లో డబ్బులివ్వకపోతే బయట అప్పులు చేస్తారు. పదివేలు, ఇరవైవేలు అప్పు చేసినప్పుడు ఎవరైనా ఇంటి మీదకు వస్తే కుటుంబంలో ఉన్నవారిని బెదిరియ్యకుండా ఆ అప్పు తీర్చేస్తారు. సదరు వ్యక్తికి ఇబ్బంది కలగనీయకుండా అడ్డుగా నిలబడతారు. ఆ సమస్యను ఫేస్ చేయనీయకుండా వెనకేసుకొస్తారు. కాలేజీలో సమస్య వచ్చినా, మరో చోట సమస్య వచ్చినా తల్లిదండ్రులు కొడుకును కాపాడటానికి ట్రై చేస్తారు. దీనివల్ల పిల్లవాడు మరిన్ని తప్పులు చేసేలా ఆ కుటుంబంలోని వారు ప్రోత్సహిస్తున్నట్టే.

మందలించాల్సిందే!

ముందు తప్పించుకోవడం, సర్దుబాటు చేసుకోవడం నుంచి కుటుంబాల్లో ఉన్నవారు బయటకు రావాలి. కౌన్సెలింగ్ సమయంలో ముఖ్యంగా ఆడవాళ్లకు బలంగా ఉండాలని చెబుతాం. గట్టిగా మందలించమని చెబుతాం. 'ఇది మా వ్యక్తిత్వం కాదు కదా' అంటారు. కానీ, మంచితనాన్ని అలుసుగా తీసుకుంటున్నారు అని గుర్తించరు. సమస్యను భరిస్తూ ఉంటే ఏదో ఒక రోజున మిమ్మల్ని వ్యసనపరులు నిస్సహాయ స్థితికి తీసుకెళతారు. కుటుంబం బలంగా ఉండాలంటే మేజర్ రోల్ భార్య/తల్లిదే. ఆమె గట్టిగా ఉండాల్సిందే. కుటుంబం బాగుండాలంటే మంచిగవ్వాల్సిందే! అని చెప్పాలి. ఒకతను ఆల్కహాల్/డ్రగ్స్ వాడుతున్నాడంటే అతని మైండ్ నిలకడగా లేదని అర్థం చేసుకోవాలి. ఫ్రెండ్స్, రిలేటివ్స్, శ్రేయోభిలాషుల సాయంతోనైనా సమస్యను చక్కదిద్దాలి. 'థెరపీ అవసరం లేదు. సదరువ్యక్తికి తెలియకుండా మందులు ఇప్పిద్దాం' అనుకుంటారు. కానీ, యాంటీ క్రేవింగ్ మెడిసిన్స్ వాడటం వల్ల బ్రెయిన్‌కి సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే అవకాశం ఉంది. దీనివల్ల కొత్త సమస్యలు పుట్టుకు రావచ్చు. అవగాహన, బిహేవియరల్ థెరపీ ద్వారానే పరిష్కరించాల్సి ఉంటుంది. ముందుగా కుటుంబాల వాళ్లు... 1. ఇదొక వ్యసనం అని అంగీకరించాలి. 2. పూర్తి చికిత్స ప్రాముఖ్యాన్ని అర్థం చేసుకోవాలి. 3. చికిత్సకు కావాల్సినంత టైమ్ ఇవ్వాలి. నలుగురిలో తెలిస్తే పరువు పోతుందని భయపడుతుంటారు. ఏదైనా అనారోగ్యం చేస్తే హాస్పిటల్‌కు ఎలా వెళతామో సైకలాజికల్ సమస్య వస్తే అందుకు సంబంధించిన డాక్టర్‌ని కలవడానికి ఇబ్బంది పడకూడదు.



– డాక్టర్ గిడియన్,
డి–అడిక్షన్ థెరపిస్ట్



పాజిటివ్ పెళ్లిళ్లకు పెద్దదిక్కు

కొన్ని రకాల ఆరోగ్య సమస్యల పేరు పలకడానికి సైతం కొంతమంది సిగ్గుపడుతుంటారు. అలాంటిది ఆ రోగంతో బాధపడుతోన్న రోగికి మరో రోగి భాగస్వామి అయితే ఆ జంట మరికొంతకాలం సంతోషంగా జీవిస్తారని భావించిన అనిల్ వాలివ్ అలాంటి వారికి దగ్గరుండి మరీ పెళ్లి సంబంధాలు కుదురుస్తూ ఎంతోమందికి ప్రేరణగా నిలుస్తున్నాడు.

పుణేకు చెందిన యాభైఏళ్ల అనిల్ వాలివ్ ప్రస్తుతం డిప్యూటీ రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి (ముంబై)గా పనిచేస్తున్నాడు. అది 2005... అనిల్‌కు ఎంతో ఇష్టమైన స్నేహితుడు హెచ్ఐవీ సోకి తన కళ్ల ముందే చనిపోవడం. అతని కొడుకుకి కూడా హెచ్ఐవీ సోకడం అనిల్‌ను ఎంతో బాధించింది. తన స్నేహితుడి మరణాన్ని తట్టుకోలేక... ''హెచ్ఐవీ వచ్చినంత మాత్రాన అంతటితో జీవితం అయిపోదు. వాళ్లకు భాగస్వామి ఉంటే జీవితం మరికొన్నాళ్లపాటు బావుంటుంది'' అన్న ఉద్దేశ్యంతో 2005లో పాజిటివ్ సాథి వెబ్‌సైట్‌ను ప్రారంభించాడు. ప్రారంభంలో తన పైఅధికారులు కూడా ప్రోత్సహించడంతో వెబ్‌సైట్‌తో పాటు.. వివాహ వేదికలూ నిర్వహించేవాడు. అలా మొదలైన పాజిటివ్ సాథీ డాట్‌కామ్ క్రమంగా విస్తరించి నేడు వేలమంది పాజిటివ్ రోగుల పెళ్లిళ్లకు వారధిగా నిలుస్తోంది.


అనిల్ వాలివ్

బ్రెయిన్ సర్జరీ అయినప్పటికీ..

ఒకపక్క ఉద్యోగం... మరోపక్క సామాజిక సేవ చేస్తోన్న అనిల్‌కు 2015లో బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో సర్జరీ చేయించుకున్నాడు. పూర్తిగా కోలుకున్న తరువాత కూడా సామాజిక సేవలో మరింత మునిగిపోయాడు. తాను చేసే సాయం సమాజం మెరుగుపడడానికి ఉపయోగపడాలని నిర్ణయించుకుని హెచ్ఐవీ రోగులకు పెళ్లి సంబంధాలు కుదర్చడాన్ని మరింత సీరియస్‌గా తీసుకున్నాడు. హెచ్ఐవీ రోగికి మరో హెచ్ఐవీ జతను జోడిస్తూ ఇప్పటిదాకా వేలమంది పెళ్లిళ్లకు సాయపడుతూనే ఉన్నాడు.

అంటరానివారిగా చూస్తుండడంతో...

ఆర్టీవో అధికారిగా అనేకమందిని కలుస్తుంటాడు అనిల్. ఒకరోజు రహదారి భద్రత, ట్రాఫిక్ నియమాల గురించి వస్తువులు రవాణా చేసే డ్రైవర్‌లకు ఉపన్యాసం ఇస్తున్నాడు. ఆ సమయంలో అక్కడ ఉన్న ట్రక్కు డ్రైవర్లలో దాదాపు అందరు హెచ్ఐవీ సోకిన వారే అని తెలిసింది. హెచ్ఐవీ అని తెలియగానే..కుటుంబ సభ్యులు, చుట్టాలు, స్నేహితులు అంటరానివారుగా చూస్తూ, తమని వదిలేశారని అనిల్‌కు కన్నీటితో తమ బాధను వెళ్లబోసుకున్నారు డ్రైవర్లు. ముందునుంచి హెచ్ఐవీ పాజిటివ్ ఉన్న వ్యక్తులపై ఉన్న సానుభూతితో...హెచ్ఐవీ సోకిన డ్రైవర్ల జాబితా తీసుకుని డాక్టర్ల దగ్గరకు వెళ్లి వారికి ట్రీట్మెంట్ అందించాలని కోరాడు. కొంతమంది ముందుకు రావడంతో వాళ్లతో డ్రైవర్లకు వైద్యం అందిస్తూ సామాజిక కౌన్సెలింగ్‌ను అందిస్తున్నాడు. వీరిలో ఆసక్తి ఉన్నవారికి జతను వెదికిపెడుతున్నాడు.

ఎన్నిసైట్లు వెతికినా...

పాజిటివ్ అమ్మాయిల కోసం ఎన్ని మ్యాట్రిమోనీ సైట్లు వెతికినా ఎక్కడా హెచ్ఐవీ పాజిటివ్ ఉన్న వారికి సంబంధాలు చూసే సైటు ఒక్కటీ కనిపించలేదు. దీంతో తనే స్వయంగా సైటుని ప్రారంభించాలనుకున్నాడు. ఇందుకోసం ఆసుపత్రులలోని హెచ్ఐవీ రోగుల డేటాను సేకరించాడు. వారి అనుమతితోనే www.positivesaathi.com ను ప్రారంభించాడు. ప్రస్తుతం ఈ సైట్‌లో కొన్ని వేల మంది తమ జతకోసం రిజిస్టర్ చేసుకుని ఉన్నారు. ఇప్పటిదాకా మూడు వేలమందికిపైగా ఈ సైట్ ద్వారా వివాహం చేసుకున్నారు.

అర్థంతరంగా పోకుండా..

సైట్ నిర్వహణ అంత సులభంగా లేదు. కొంతమంది నకిలీ ప్రొఫైల్స్ తో రిజిస్టరు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్‌లన్నీ సరిచూసుకోవడం కష్టం. ఎక్కువమంది తమ కులానికి చెందిన వారిని మాత్రమే పెళ్లిచేసుకోవాలనుకుంటున్నారు. ఇటువంటి సమస్యలు ఉన్నప్పటికీ పాజిటివ్ రోగులకు జతను వెతికే పనిలో నేను బిజీగా ఉన్నాను. ఇలా పెళ్లిళ్లు జరిగితే హెచ్ఐవీ వ్యాప్తి కొంతవరకైనా నిరోధించవచ్చవచ్చు. వాళ్లు అంటరాని వాళ్లలా అర్థంతరంగా చనిపోకుండా, కొంతకాలం అయినా తోడుతో ఆనందంగా జీవిస్తారు.

- అనిల్ వాల్వి

వరద సమయం

ఈత రావాలి ప్రాణం నిలవాలి

ఇది వానల కాలం. వరదల కాలం. కేరళలో ఈ సమయంలో పడవ ప్రమాదాలు సాధారణం. ప్రమాద తీవ్రత కంటే ఈత రాకపోవడం వల్ల జనం మరణిస్తున్నారని సాజి వెలస్సిరల్ అనే వ్యక్తికి అనిపించింది. చిన్న ఫర్నిచర్ షాపు నడుపుకునే ఇతడు గొప్ప ఈతగాడు కూడా. ఇంకేముంది. ఊళ్లో ఉన్న పెరియార్ నదిని స్విమ్మింగ్ పూల్‌గా చేసుకుని అందులోనే ఈత నేర్పుతున్నాడు. ఇప్పటికి 6000 మంది ఈత నేర్చుకున్నారు. వీళ్లందరి ప్రాణాలను నీళ్ల నుంచి ఇతడు రక్షించినట్టే. ప్రతి చోటా ఇలాంటి వాళ్లుంటే వేల ప్రాణాలు బతుకుతాయి.



గత మే నెలలో కేరళలోని తానురు దగ్గర బ్యాక్ వాటర్స్‌లో పడవ మునిగి 27 మంది చనిపోయారు. 'వాళ్లకు ఈత వచ్చి ఉంటే అందరూ బతికి ఉండేవారు. తుఫాను లేదు.. సముద్రమూ కాదు. ఈత వచ్చి ఉంటే పడవ బోల్తా పడినా ఆ బ్యాక్ వాటర్స్‌లో హాయిగా ఈదుకుంటూ గట్టెక్కవచ్చు. లేదా సహాయకబృందాలు చేరేవరకూ మెల్లగా తేలుతూనే ఉండొచ్చు' అంటాడు సాజి వెలస్సిరల్.

ఈ ప్రమాదం కాదు ఇరవై ఏళ్ల క్రితం ఇతడు చూసిన ప్రమాదమే ఇతడి మనసు మార్చింది. కుమర్‌కోమ్‌లో పడవ బోల్తా పడి 29 మంది చనిపోయారు. అప్పుడు సాజి యువకుడు. తండ్రి మంచి స్విమ్మర్ కావడంతో ఆయన నుంచి ఈత నేర్చుకుని అద్భుతంగా ఈదుతున్నాడు. ఆ ప్రమాదంలో చనిపోయిన వారికి ఈత వచ్చి ఉంటే ప్రాణాలు మిగిలి ఉండేవి అనిపించింది. 'ఈత ఎందుకు రాదు' అని ప్రశ్నించుకున్నాడు. 'నేర్పేవారు లేకపోవడం వల్ల' అనే జవాబు వచ్చింది. 'నేనెందుకు నేర్పకూడదు' అనుకున్నాడు.

అలా అతని ఈత సేవ మొదలైంది.


సాజి వెలస్సిరల్

పెరియార్ నదిలో

సాజి వెలస్సిరల్ అలువా అనే చిన్న ఊరిలో ఉంటాడు. ఇది ఎర్నాకుళంకు 40 నిమిషాల దూరం. ఆ ఊళ్లో చిన్న ఫర్నిచర్ షాపు నడుపుకుంటూ జీవిస్తుంటాడు సాజి. అయితే అదే ఊరి నుంచి పెరియార్ నది ప్రవహిస్తూ ఉంటుంది. దాదాపు నిలువ నీరులా ఉంటుంది ప్రవాహం. 'దీనినే స్విమ్మింగ్‌పూల్‌గా చేసుకుని ఈత నేర్పిస్తాను' అని నిర్ణయించుకున్నాడు సాజి. 'ముందు నా కుటుంబం నుంచే మొదలెట్టాలి' అనుకుని తన ఇద్దరు పిల్లల్ని, స్నేహితుడి పిల్లల్ని తీసుకుని నదిలో ఈత నేర్పడం మొదలెట్టాడు. మూడు వారాల్లోనే పిల్లలు ఈ ఒడ్డు నుంచి ఆ ఒడ్డుకు (780 మీటర్లు) ఈదడం నేర్చుకున్నారు. దాంతో ఊరి దృష్టి సాజి మీద పడింది. అతడి దగ్గర ఈత నేర్చుకోవడానికి అందరూ క్యూ కట్టారు.

వెలస్సిరల్ రివర్ స్విమ్మింగ్ క్లబ్

నేర్చుకునేవారు పెరిగే కొద్దీ సాజికి ఉత్సాహం వచ్చింది. తన ఈత కేంద్రానికి వెలస్సిరల్ రివర్ స్విమ్మింగ్ క్లబ్ అనే పేరు పెట్టాడు. ప్రత్యేక దినాల్లో, పండగ వేళల్లో సామూహిక ఈత కార్యక్రమాలు నిర్వహిస్తాడు. నది ఈదే పోటీలు నిర్వహిస్తాడు. విశేషం ఏమిటంటే 70 ఏళ్ల ఆరిఫా అనే మహిళ ఇతని దగ్గర ఈత నేర్చుకుని చేతులు వెనక్కు కట్టుకుని మరీ ఈ ఒడ్డు నుంచి ఆ ఒడ్డుకు ఈదింది. శారీరకమైన అవకరాలు ఉన్నవారికి కూడా ఈత నేర్పే టెక్నిక్స్ ఇతని దగ్గర ఉన్నాయి. ఇతను ఈత నేర్పేటప్పుడు ఒక అంబులెన్సు ఒడ్డున, నదిలో రక్షణకు ఒక పడవ సిద్ధంగా ఉంటాయి.

'ఈత నేర్వాలి. ప్రాణాలు నిలుపుకోవాలి. ప్రమాదవశాత్తు నీళ్లల్లో పడితే ఈదలేక మరణించడం దురదృష్టకరం' అంటాడు సాజి. అతని హెచ్చరిక వినదగ్గది.



పచ్చదనం... పచ్చధనం

పచ్చని మొక్కలు, విరబూసిన పూలు.. ఎంతటి ఒత్తిడినైనా క్షణాల్లో మాయం చేస్తాయి. గార్డెనింగ్ మంచి వ్యాయామం కూడా. గంట పాటు తోటపని చేస్తే కనీసం 500 క్యాలరీల వరకు కరుగుతాయి. అంతే కాదు, మానసిక ఒత్తిళ్లను అధిగమించాలంటే రోజూ కాసేపు తోటపని చేయాలని



మానసిక నిపుణులు సూచిస్తున్నారు. ఇప్పుడిప్పుడే వర్షాలు పడుతున్నాయి. ఇది మొక్కలు నాటడానికి లేదా విత్తనాలు వేసుకోవడానికీ అదునుగా ఉంటుంది కాబట్టి పెరటితోటలు లేదా మిద్దె తోటలకు ఇది అనువైన సమయం. అందుకే ఆ దిశగా ఆలోచన చేద్దాం.



అందమైన పెరటితోటలను రూపొందించాలంటే మొక్కలు నాటాలనే తపన ఉంటేనే సరిపోదు. సహజమైన వాతావరణంలో మొక్కల పెంపకం వల్ల ప్రకృతితో మమేకమయ్యామన్న భావన కలుగుతుంది. ఇది మానసికంగా సంతోషాన్నిస్తుంది. అయితే పట్టణాలలో, నగరాలలో అపార్టుమెంట్లలో ఉండే వారికి పెరటి తోటల పెంపకం అంత సులువుగా సాధ్యం కాదు. అయినా మనసుంటే మార్గం ఉందన్నట్లు... ఆకుకూరలు, కూరగాయలు, పూలమొక్కలు వంటివి కుండీల్లోనూ పెంచుకోవచ్చు.

బెండ, గోరుచిక్కుడు, బీర, కాకర, సొర, మిరప, టమోటా... ఆకుకూరలల్లో పొన్నగంటి, పాలకూర, చుక్కకూర, తోటకూర, గోంగూర, కొత్తిమీర, పుదీనా ఎలాంటి వాతావరణంలో అయినా పెరుగుతాయి. దీనికి కేవలం ఒకటి రెండు సెంట్ల స్థలం సరిపోతుంది. ఇంట్లో వంటగది, స్నానాల గదిలోవృథా అయ్యే నీటిని వాడుకోవచ్చు. దీనివల్ల నిలవ నీరు, మురుగు నీరు ఏర్పడదు.

తక్కువ స్థలాల్లో ఎక్కువ కూరగాయల చెట్లను పెంచుకోవడం వల్ల చీడ రాకుండా, ఒక వేళ వచ్చినా సులభంగా చెట్లకు పట్టిన చీడను తొలగించుకొనేందుకు వీలుగా ఉంటుంది. పైగా రసాయనాలను వాడటం ఉండదు కాబట్టి కాలుష్యం ఏర్పడదు. ఇదెంతో క్షేమకరమైన విధానం కూడా. ఎందుకంటే, ఇలా ఉత్పత్తి అయ్యే కూరగాయల్లో మన ఆరోగ్యానికి భంగం కల్గించే ఎరువుల అవశేషాలు ఉండవు. పెరట్లో కాసిన కూరగాయలను తింటే వాటి రుచే వేరు. ముంగిట్లో పూసిన పూవుల వాసన గుబాళిస్తుంది. అంతేకాకుండా శరీరాన్ని ఫిట్‌గా ఉంచేందుకు, ఫలితంగా ఒత్తిడి తగ్గేందుకూ తోడ్పడుతుంది.

ఇలా పెరటి తోటల పెంపకం మానసికంగా, శారీరకంగా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.

ఇంటి ముంగిట బంతి, చామంతి, కనకాంబరం, క్రోటన్ వంటివి పెంచితే ఇంటి వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఏడాది పొడవునా నిరంతరం పెరిగే చెట్లు తోటకు వెనకభాగంలో పెంచాలి. దీనివల్ల వాటి నీడ మిగిలిన మొక్కల మీద పడి వాటికి ఎండ తగలకుండా పోయే ప్రమాదాన్ని నివారించవచ్చు. అలాగే మిగిలిన కాయగూర మొక్కలు కావలసిన పోషకాహారాలను ఇవి లాగేసుకోకుండా కూడా ఉంటుంది. తోట మొత్తానికి ఉండే నడకదారి పక్కన, మధ్య దారి ఇరుపక్కలా తక్కువ వ్యవధిలో పెరిగే కొత్తిమీర, పాలకూర, బచ్చలి, పుదీనా వంటి మొక్కలను వేసుకోవచ్చు. నేలస్థలాన్ని ఆదా చేయడానికి బాల్కనీలో వేలాడే కుండలను వేలాడదీయడం వల్ల బాల్కనీలో సులభంగా అలంకార వస్తువులుగా ఉపయోగపడతాయి.



అటువంటి కుండలలో తీగలు లేదా లతలను నాటటం ద్వారా మొక్కలకు సులభంగా నీరు అందించవచ్చు.





- ముందుగా ఇంటిపైన స్థలాన్ని చెత్తా చెదారం లేకుండా శుభ్రం చేసుకోవాలి.
- నేల సారం కోసం ఎర్రమట్టికానీ, నల్లమట్టి కానీ వేయించాలి.
- నేలను మడులుగా కట్టి మడుల మధ్య పార సహాయంతో మెత్తగా తవ్వాలి.
- నేలకు, వాతావరణానికి అనుకూలమైన మొక్కలను, కూరగాయలను ఎంచుకోవాలి.
- వార్షిక పంటలు, తక్కువ స్థలంలో పెరిగే మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- నీడనిచ్చే చెట్లను మిద్దెలపై పెంచుకోకూడదు. ఇలాంటి వాటిని పెరడులో పెంచాలి.
- గోంగూర, పాలకూర, బీట్రూట్, టొమాటో, క్యాబేజీ, బెండ, ముల్లంగి మొదలైన మొక్కలు తక్కువ స్థలంలో పెరుగుతాయి.
- ఎక్కువ పోషక విలువలు, రుచినందించే మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- ఒకేకాలంలో వేయాల్సిన, ఏక వార్షికాలైన మొక్కలను ఒక సమూహంగా ఒక స్థలంలో వేర్వేరు మళ్ళల్లో వేయాలి.

పెరటి/ మిద్దె తోట నిర్వహణ

పెరట్లి తోటల పెంపకానికి జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలు అనుకూలం.

మిద్దెతోట ఏర్పాటులో మొదటగా బిల్డింగ్ స్లాబ్ అనుకూలంగా ఉన్నదా లేదా అని పరిశీలించుకుని తేలిక పాటి కుండీలు గ్రో బ్యాగ్స్ ఏర్పాటు చేసుకుని కుండీలను కుండీల స్టాండ్ల మీద అమర్చుకుని సాగు ప్రారంభించాలి. అన్నిరకాల ఆకుకూరలు, కూరగాయలు, పూలు, పండ్ల చెట్లను మిద్దె మీద సాగు చేసుకోవచ్చు.



ఇలాయబక్కో మెట్టూ ఎక్కుతూ మొదటి అంతస్తును చేరగానే అక్కడ ఆకుపచ్చని లోకం పలకరిస్తుంది. అందులో పందిళ్లకు పాకిన రకరకాల పాదులు, అక్కడక్కడా పూలమొక్కలు, మధ్యలో ఆకుకూరల మడులతో అదో అందమైన పార్కుగా మారుతుంది. చెట్ల మధ్య కూర్చోవడానికి చిన్న ఏర్పాటు చేసుకుంటే ఆ ఆనందమే వేరు.

రక్తపోటు ముప్పు తప్పుతుంది ఇలా...

నేటి ఆధునిక జీవన శైలి కారణంగా చిన్నపిల్లలనుంచి పెద్దవాళ్ల వరకు అందరికీ ఉరుకులు, పరుగులు... ఏవేవో టెన్షన్లు, ఒత్తిడులు, ఆవేశాలు, ఆవేదనలు, ఆందోళనలే. ఫలితంగా వయసుతో నిమిత్త లేకుండా రక్తపోటు పెరిగిపోతుంటుంది. హై బీపీ అనేక రోగాలకు ఆలవాలం. వచ్చాక బాధపడే కంటే రాకుండా నివారించుకోవడం మేలు. అందువల్ల అధిక రక్తపోటును ఎలా నివారించుకోవచ్చో తెలుసుకుందాం...



చాలామంది అపోహ ఏమిటంటే ఎవరైనా ఇతరులమీద ఆవేశ పడుతుంటే, కేకలు వేస్తుంటే అదంతా బీపీ వల్ల అనుకుంటారు. అయితే అది తప్పు. బీపీ ఉండటం వల్ల ఆవేశ పడరు. ఆవేశపడటం వల్ల బీపీ పెరుగుతుంది. అందువల్ల సాధ్యమైనంత వరకు మనసును ప్రశాంతంగా ఉంచుకునేందుకు ప్రయత్నించాలి. ▶ అలాగే ఆహారపదార్థాలలో రక్తాన్ని ఉద్రేకపరిచే పదార్థాలను నిషేధించాలి. ▶ ఆహారంలో వాడే పచ్చిమిర్చి బదులు ఎండుమిర్చిని... క్రమంగా దాని బదులు కారపు రుచి కోసం మిరియాలను ఉపయోగించాలి. అంటే మిరియాల చారు, మిరియాల కారంపొడి ఇలాంటివన్నమాట. ▶ మనం వాడే రాళ్ల ఉప్పు గాని, షాపుల్లో దొరికే (అయోడైజ్‌డ్ సాల్ట్‌తో సహా) ఇతర ఉప్పుల బదులు సైంధవ లవణం వాడటం మంచిది. అదేవిధంగా పులుపు కోసం కొత్తచింతపండుకు బదులు పాతచింతపండు లేదా దేశవాళీ టమాటాలు ఉపయోగించడం శ్రేయస్కరం.

▶ గడ్డ పెరుగుకు బదులు పలుచని మజ్జిగ మంచిది. ఎందుకంటే, ఆయుర్వేదం ప్రకారం మజ్జిగ పేగుల్లో విషపదార్థాలు లేకుండా ఉదరంలో పిత్తరసం ప్రకోపించకుండా రక్త పోటు పెరగకుండా కాపాడడంలో ప్రముఖ పాత్ర పోషిస్తుంది. ▶ షాపుల్లో దొరికే స్వీట్లకు బదులు ఇంట్లో పాతబెల్లంతో చేసుకున్న తీపిని వాడుతుంటే ఎలాంటి ప్రమాదం రాదు. ▶ కూరల తయారీలో వెల్లుల్లి, కరివేపాకు, పుదీనా, అల్లం, జీలకర్ర, ధనియాలు, మిరియాలను ఉపయోగించడం ఆరోగ్యకరం. ▶ ఉదయం 9.30 గంటల లోపు, రాత్రి 7.30 గంటలలోపు తినడం ముగించాలి. ▶ రాత్రిపూట కప్పు నీటిలో చెంచా మెంతులు వేసి మూత పెట్టి ఉదయం బ్రష్ చేసుకోగానే ఆ నానబెట్టిన మెంతులను నమిలి తినాలి. మెంతులు నానబెట్టిన ఆ నీటిని కూడా తాగాలి. ▶ ఒక పచ్చి ఉల్లిపాయను ముక్కలుగా తరిగి కూరన్నంతో, మజ్జిగన్నంతోనూ కలిపి తింటుంటే క్రమంగా రక్తపోటు అదుపులోకి వస్తుంది.

హెల్త్ టిప్స్

విటమిన్ సి సమృద్ధిగా లభించే నిమ్మ, ఉసిరి, జామ వంటి పళ్ళు, మొలకెత్తిన పప్పుధాన్యాలు తీసుకుంటూ ఉంటే రక్తహీనత నుంచి బయట పడవచ్చు.



తేనెలో ఐరన్, కాపర్, మాంగనీస్‌లు సమృద్ధిగా ఉండటం వల్ల నీరసంగా అనిపించినప్పుడు ఒక గ్లాస్ నీటిలో రెండు స్పూన్ల తేనె కలుపుకొని తాగితే ఒంటికి వెంటనే శక్తి వస్తుంది.



***

సోయా బీన్స్ ఎక్కువగా తీసుకుంటే శరీరం పోషకాలను గ్రహించే శక్తి పెరుగుతుంది. దాంతో మనం తీసుకున్న ఆహారంలోని ఐరన్‌ని శరీరం బాగా గ్రహిస్తుంది.



మీకు తెలుసా?

షుగర్ ఉన్న వాళ్ల పళ్ల తినకూడదంటారు కానీ, చిన్నప్పటినుంచి పళ్ళు, ఆకుకూరలు, కాయగూరలు బాగా తింటే షుగర్ సమస్య రాదు. షుగర్ ఉన్నవారు కూడా ఒక పద్ధతిలో పిండిపదార్థాలను బాగా తగ్గించి పొద్దున, సాయంత్రం ఖాళీ కడుపున పండ్లు తీసుకోవడం మంచిది. అయితే బాగా తియ్యగా వుండే మామిడి, ద్రాక్ష లాంటివి కాకుండా దోర జామ, కివి, బొప్పాయి లాంటివి మంచిది.



తాజా ఆకుకూరలు ముఖ్యంగా తోటకూర, పుంటి కూర, పాలకూర, మెంతి కూర వంటి వాటిలో ఐరన్ ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ప్రతిరోజు ఆహారంలో ఒక ఆకుకూర ఉండేలా చూసుకోవాలి. అలాగే బాదం, జీడిపప్పు, ఎండు ఖర్జూరాలలో కూడా ఐరన్ సమృద్ధిగా ఉంటుంది.





సినిమా





హాలీవుడ్.. షట్ డౌన్

- రోడ్డెక్కిన రచయితలు.. నటీనటులు
- అరవయ్యేళ్ల తర్వాత నటీనటులు, రచయితల మరో సమ్మె

ప్రపంచవ్యాప్తంగా సినిమా పరిశ్రమకు 'పెద్దన్న' అని హాలీవుడ్‌కి పేరు. భారీ బడ్జెట్ చిత్రాలతో, అత్యున్నత సాంకేతిక విలువలతో ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకుంది హాలీవుడ్. ఇప్పుడు ఆ హాలీవుడ్ నిరసనలతో భగభగమంటోంది. సమ్మె సైరన్ తప్ప యాక్షన్.. సౌండ్‌లాంటి షూటింగ్ లొకేషన్లో వినిపించే మాటలు వినిపించడంలేదు. నటీనటులు మేకప్ వేసుకోవడంలేదు.. రచయితలు కలం మూత తెరవడంలేదు. దాంతో షూటింగులు నిలిచిపోయాయి. కరోనా టైమ్‌లో వెలవెలబోయినట్లు స్టూడియోలు కళ తప్పాయి. ఇన్నాళ్లుగా సమ్మె చేస్తూ వచ్చిన రచయితల సంఘానికి నటీనటుల సంఘం మద్దతు తెలిపింది. 'వేతనాలు పెంచండి... గౌరవించండి... సౌకర్యాలు సమకూర్చండి..' అంటూ పలు నినాదాలతో సమ్మె కొనసాగిస్తున్నారు. ఆ వివరాల్లోకి వెళదాం..

హాలీవుడ్ చిత్ర పరిశ్రమని డబుల్ స్ట్రయిక్ కుదిపేస్తోంది. ఓ వైపు కొన్నాళ్లుగా 'రైటర్స్ గిల్డ్ ఆఫ్ అమెరికా' ఆధ్వర్యంలో సమ్మె కొనసాగుతోంది. తాజాగా 'ది స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్' సమ్మెకు పిలుపునిచ్చింది. తాము రాసే టీవీ షోలు, ఓటీటీ సిరీస్‌ల నుంచి మంచి లాభాలు ఆర్జిస్తున్న నిర్మాణ సంస్థలు తమకు కనీస వేతనాలు ఇవ్వడంలేదని ఆరోపిస్తూ 'రైటర్స్ గిల్డ్ ఆఫ్ అమెరికా' ఆధ్వర్యంలో పదకొండు వారాలుగా రచయితలు సమ్మె చేస్తున్నారు. ఇప్పుడు హాలీవుడ్ నటీనటులు సైతం రైటర్స్ సమ్మెలో చేరాలని నిర్ణయించుకున్నారు. నిర్మాణ సంస్థలు, ఓటీటీలతో జరిపిన చర్చలు విఫలం కావడంతో భారతీయ కాలమానం ప్రకారం గురువారం రాత్రి సమ్మె ఆరంభమైంది. దీంతో షూటింగ్‌లు ఆగాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేథస్సు) హాలీవుడ్‌లో ప్రకంపనలు సృష్టిస్తోంది. కృత్రిమ మేథస్సుతో పని చేసే ఓ యాంకర్‌ని ఇటీవలే పరిచయం చేశారు. ఈ సెగ హాలీవుడ్‌కు బాగానే తాకింది. కృత్రిమ మేథస్సుతో ముప్పు పొంచి ఉందని, తమ భవిష్యత్తుకి భరోసా ఇవ్వడంతో పాటు జీతాలు పెంచాలని, సరైన పని నిబంధనలను కల్పించాలని 'ది స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్' ఆందోళనలకు పిలుపునిచ్చింది. 'ఏ' లిస్ట్ యాక్టర్స్‌తో సహా 1,60,000 మంది నటీనటులకు 'స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్-అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ టెలివిజన్ అండ్ రేడియో ఆర్టిస్ట్స్' ప్రాతినిధ్యం వహిస్తోంది. ప్రధాన నిర్మాణ స్టూడియోలతో జరిగిన చర్చలు విఫలం కావడంతో 'ది స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్' నిరవధిక సమ్మెకు దిగింది. 'రైటర్స్ గిల్డ్ ఆఫ్ అమెరికా', 'ది స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్' సమ్మెతో ప్రస్తుతం కొనసాగుతున్న హాలీవుడ్ సినిమాలు, వెబ్ సిరీస్‌లు, టీవీ షో షూటింగ్స్ ఎక్కడికక్కడ నిలిచి పోయే పరిస్థితి ఏర్పడింది.







'ఓపెన్ హైమర్' ప్రీమియర్ నుండి నిష్క్రమణ...

క్రిస్టోఫర్ నోలన్ దర్శకత్వం వహించిన హాలీవుడ్ ఫిల్మ్ 'ఓపెన్ హైమర్' ఈ నెల 21న విడుదల కానుంది. ఈ సందర్భంగా లండన్‌లో గురువారం ఈ సినిమా ప్రీమియర్ వేశారు. అయితే గురువారం అర్ధరాత్రి 'ది స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్' సమ్మె ప్రారంభం కావడంతో 'ఓపెన్ హైమర్' ప్రీమియర్ నుండి యాక్టర్స్ రాబర్ట్ డౌనీ జూనియర్, సిలియన్ మర్ఫీ, మాట్ డామన్, ఎమిలీ బ్లంట్ వంటి స్టార్స్‌తో సహా పలువురు నటీనటులు వెళ్లిపోయినట్లు హాలీవుడ్ మీడియాలో వార్తలు వచ్చాయి. హాలీవుడ్ ప్రముఖ సంస్థలు 'పారామౌంట్, వార్నర్ బ్రదర్స్, డిస్నీ, నెట్ ఫ్లిక్స్' వంటి వాటి ప్రధాన కార్యాలయాల వద్ద శుక్రవారం ఉదయం పికెటింగ్ (సమ్మె) ప్రారంభించారని టాక్.

సమ్మె బాధాకరం

'ది స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్' సమ్మెను స్టూడియోలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 'అలయెన్స్ ఆఫ్ మోషన్ పిక్చర్ అండ్ టెలివిజన్ ప్రొడ్యూసర్స్' తప్పుబట్టింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. "సినిమాలు, టీవీ కార్యక్రమాలకు జీవం పోసే నటీనటులు లేకుండా స్టూడియోలు పని చేయవు. కాబట్టి సమ్మె అనేది ఆశించిన ఫలితం ఇవ్వదు. పరిశ్రమపై ఆధారపడిన వేల మంది కార్మికుల ఆర్థిక ఇబ్బందులకు దారి తీసే మార్గాన్ని యూనియన్ ఎంచుకోవడం బాధాకరం" అని పేర్కొంది.

ఎమ్మీ, ఆస్కార్ అవార్డ్ వాయిదా?

హాలీవుడ్‌లో మొదటిసారి 1960లో నటుడు రోనాల్డ్ రీగన్ నేతృత్వంలో రచయితల సంఘం, నటీనటుల సంఘం కలిసి డబుల్ స్ట్రైక్ చేశాయి. అలానే 1980లో స్క్రీన్ యాక్టర్స్ సమ్మె మూడు నెలల పాటలు జరిగింది. మళ్లీ 63 ఏళ్లకు ఇప్పుడు రచయితల, నటీనటుల సంఘం కలసి డబుల్ స్ట్రైక్ చేస్తుండటం విశేషం. ఈ సమ్మె ఇలాగే కొనసాగితే పెద్ద చిత్రాల విడుదల వాయిదా పడే పరిస్థితి. అలాగే సెప్టెంబర్ 18న జరగనున్న ఎమ్మీ అవార్డ్స్, టెలివిజన్ వెర్షన్ ఆస్కార్ అవార్డులు కూడా నవంబర్ లేదా వచ్చే ఏడాదికి వాయిదా పడే అవకాశం ఉందని హాలీవుడ్ మీడియాలో వార్తలొస్తున్నాయి.

యంత్రాలు రీప్లేస్ చేస్తాయి!

- సాగ్-ఆఫ్ట్రా అధ్యక్షురాలు ఫ్రాన్ డ్రెస్చర్

''**మ**నందరం ఇప్పుడు ఏకతాటిపై నిలవకపోతే కచ్చితంగా మనల్ని యంత్రాలు రీప్లేస్ చేస్తాయి'' అన్నారు సాగ్-ఆఫ్ట్రా (సీనియర్ యాక్టర్స్ గిల్డ్-అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ టెలివిజన్ అండ్ రేడియో ఆర్టిస్ట్స్) అధ్యక్షురాలు ఫ్రాన్ డ్రెస్చర్. కొన్ని వారాలుగా సమ్మె చేస్తున్న డబ్ల్యూజీఏ (రైటర్స్ గిల్డ్ ఆఫ్ అమెరికా)కి పూర్తి మద్దతు ప్రకటించారామె. ఈ సందర్భంగా ఆమె చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. ''నటీనటులు అణచివేతకు గురవుతున్నారు. వారికి తగిన గౌరవం దక్కడంలేదు. చిత్రపరిశ్రమలో ఏం జరుగుతుందనేది అందరికీ చాలా ముఖ్యం. ఎందుకంటే ఇక్కడ ఏం జరుగుతుందో మిగతా అన్ని రంగాల్లోని కార్మికులకు అదే జరుగుతోంది. యజమానులు అత్యాశకు పోతున్నారు. యంత్రాలను నడిపించే సహాయకులను (కార్మికులను ఉద్దేశించి) మర్చిపోతున్నారు. వారు చేస్తున్న సేవలను గుర్తించడంలేదు. ఇది నిజంగా సిగ్గుపడాల్సిన విషయం. సీఈవోలకు ఏకంగా వందల మిలియన్ల డాలర్లలో అధిక వేతనాలు ఇవ్వడంవల్ల ఆర్థిక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇక్కడ బాధితులు ఎవరంటే మేమే (కార్మికులు). వ్యాపారంలో ఉన్న వాళ్లు మా పట్ల వ్యవహరిస్తున్న తీరు షాకింగ్‌గా ఉంది'' అని ఘాటుగా స్పందించారు ఫ్రాన్ డ్రెస్చర్.

తగ్గేదే లే...

"ఏఐ వల్ల ముప్పే" అంటూ సమ్మెలో భాగంగా నినాదాలు చేస్తున్నారు. ఇప్పటికే ఏఐ న్యూస్ రీడర్స్ వచ్చిన నేపథ్యంలో ఏఐ వల్ల చిత్ర పరిశ్రమలోనూ పెను మార్పు సంభవించే అవకాశం ఉందని హాలీవుడ్ కళాకారులు వాపోతున్నారు. అయితే ఏఐ వినియోగాన్ని తగ్గించాలన్న కళాకారుల డిమాండ్‌ని నిర్మాణ సంస్థలు వ్యతిరేకిస్తున్నాయి. అలాగే నటీనటుల వేతనాలు పెంపుకు కూడా నిర్మాతలు సుముఖత వ్యక్తపరచడంలేదన్నది హాలీవుడ్ టాక్. ఈ నేపథ్యంలో నటీనటులు కూడా తమ డిమాండ్లను ఆమోదించే వరకూ సమ్మె కొనసాగించే తీరాలనీ, తగ్గేదే లే అనే పట్టుదలతో ఉన్నారనీ సమాచారం.

మాల్దీవులకు హాయ్


● రజనీ కాంత్

వరుస షూటింగ్‌లతో బిజీ బిజీగా గడిపిన హీరో రజనీ కాంత్ హాలిడే ట్రిప్ కోసం మాల్దీవులు వెళ్లారు. చెన్నై నుంచి మాల్దీవుల రాజధాని మాలె వరకు శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్‌లో రజనీ ప్రయాణించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు వైరల్‌గా మారాయి. ఓ ఫొటోలో ఎయిర్ హోస్టెస్ ఇచ్చిన ఫ్లవర్ బొకేతో నవ్వుతూ కనిపించిన రజనీకాంత్, మరో ఫొటోలో బ్యాగ్ పట్టుకుని, కళ్ల జోడు పెట్టుకుని స్టైలిష్‌గా ఉన్నారు. రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్య దర్శకత్వం వహిస్తున్న 'లాల్ సలామ్' సినిమాలో తన పాత్ర (మొయిద్దీన్ భాయ్) షూటింగ్‌ని పూర్తి చేశారాయన. ఇప్పుడు కొంచెం విరామం దొరకడంతో రిఫ్రెష్ అయ్యేందుకు మాల్దీవులకు వెళ్లారు రజనీకాంత్. కాగా ఆయన నటించిన 'జైలర్' సినిమా ఆగస్టు 10న విడుదల కానుంది.

హత్య చేసిందెవరు?


● విజయ్ ఆంటోని

విజయ్ ఆంటోని నటించిన తాజా చిత్రం 'హత్య'. బాలాజీ కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రితికా సింగ్, మీనాక్షి చౌదరి హీరోయిన్లుగా నటించారు. లోటస్ పిక్చర్స్‌తో కలిసి ఇన్ఫినిటీ ఫిల్మ్ వెంచర్స్‌పై కమల్ బోరా, జి. ధనుంజయన్, ప్రదీప్ .బి, పంకజ్ బోరా, విక్రమ్ కుమార్, తాన్ శ్రీ దొరైసింగం పిళ్లై, సిద్ధార్థ్ శంకర్, ఆర్‌వీఎస్ అశోక్ కుమార్ నిర్మించిన 'హత్య' ఈ నెల 21న రిలీజవుతోంది. సురేశ్ ప్రొడక్షన్స్, ఏషియన్ సినిమాస్ సంయుక్తంగా తెలుగులో విడుదల చేస్తున్నాయి. ''ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమాలో విజయ్ ఆంటోని డిటెక్టివ్ పాత్ర చేశారు. ఈ క్యారెక్టర్‌లో ఆయన సరికొత్త లుక్‌లో కనిపిస్తారు'' అని యూనిట్ పేర్కొంది.

బీట్ బాగుంది


● శేఖర్ మాస్టర్

సాయికుమార్, ఆదిత్యా ఓం, ఐశ్వర్యా రాజీవ్ కనకాల, శ్రీనివాస్ సాయి, దీపాలి రాజపుత్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'నాతో నేను'. శాంతికుమార్ తూర్లపాటి దర్శకత్వంలో ప్రశాంత్ టంగుటూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 21న విడుదల కానుంది. సత్య కశ్యప్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'రాజంపేట రాణిని...' అంటూ సాగే పాటని నృత్య దర్శకుడు శేఖర్ మాస్టర్ విడుదల చేశారు. శాంతి స్వరూప్ సాహిత్యం అందించిన ఈ పాటను గీతామాధురి ఆలపించారు. ఈ సందర్భంగా శేఖర్ మాస్టర్ మాట్లాడుతూ– ''ఈ మాస్ బీట్ పాట సంగీతం, కొరియోగ్రఫీ చాలా బావున్నాయి. సినిమా మంచి హిట్ కావాలి'' అన్నారు.

సాక్షి బిజినెస్
శనివారం
15-7-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	502	66,061
నిఫ్టీ ▲	151	19,565

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	14,158	▲	19
డోజోన్స్	34,525	▲	130
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,435	▼	6
డాక్స్	16,105	▼	36
షాంఘై	3,237	▲	1
నికాయ్	32,319	▲	28

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	59,338	▲	9
బంగారం (99.5 స్వచ్ఛత)	59,100	▲	9
వెండి (కిలో)	74,979	▲	1,387

ఎస్‌బీఐ రుణ రేటు పెంపు

5 బేసిస్ పాయింట్ల పెరుగుదల

ముంబై: బ్యాంకింగ్ దిగ్గజం– స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నిధుల సమీకరణ వ్యయ ఆధారిత (ఎంసీఎల్‌ఆర్) రుణ రేటును అన్ని కాలపరిమితులపై స్వల్పంగా 5 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒక శాతం) మేర పెంచింది. పెరిగిన రేటు జూలై 15 నుంచి అమల్లోకి వస్తుంది. ఎస్‌బీఐ వెబ్‌సైట్ ప్రకారం, ఎంసీఎల్‌ఆర్ ఆధారిత రుణ రేట్లు 8 శాతం నుంచి 8.75 శాతం శ్రేణిలో ఉన్నాయి. ఎంసీఎల్‌ఆర్ అనేది ఒక బ్యాంకు వినియోగదారులకు ఇచ్చే రుణాల ప్రాథమిక కనీస రేటు. తాజా ఎస్‌బీఐ రుణ రేటు పెంపు రుణ గ్రహీతలపై ఆ మేరకు ఈఎంఐ భారం (ఎంసీఎల్‌ఆర్‌కు అనుసంధానమైన) పెరగనుంది. తాజా నిర్ణయం ప్రకారం...

- ఏడాది రేటు 8.50 శాతం నుంచి 8.55 శాతానికి పెరుగుతుంది.
- ఓవర్‌నైట్ రేటు 8 శాతంగా ఉంటుంది. నెల, మూడు నెలల రేటు 8.15 శాతం చొప్పున అమలవుతాయి.
- ఆరు నెలల ఎంసీఎల్‌ఆర్ రేటు 8.45 శాతంగా ఉంటుంది.
- రెండేళ్ల ఎంసీఎల్‌ఆర్ 8.65%కి చేరుతుంది.
- మూడేళ్ల రేటు 8.75 శాతంగా ఉంటుంది.

స్కూట్ ఎయిర్‌లైన్స్ ప్రత్యేక ఆఫర్లు



హైదరాబాద్: సింగపూర్ ఎయిర్‌లైన్స్ (ఎస్ఐఏ)లో భాగమైన స్కూట్ నెట్‌వర్క్ తాజాగా చౌక ఆఫర్లను ప్రకటించింది. హైదరాబాద్, వైజాగ్ సహా వివిధ నగరాల నుంచి విదేశాల్లోని 20 ప్రాంతాలకు ప్రయాణించేందుకు ఇవి ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొంది. రూ. 6,200 నుంచి చార్జీలు మొదలవుతాయని వివరించింది. హైదరాబాద్ నుంచి పెర్త్ (ఆస్ట్రేలియా)కు రూ. 12,900 నుంచి, వైజాగ్ నుంచి సెబూ (ఫిలిప్పీన్స్)కు రూ. 11,900 నుంచి వన్–వే చార్జీలు (పన్నులు సహా) ప్రారంభమవుతాయని స్కూట్ తెలిపింది. ఈ సేల్ జూలై 18 వరకు అందుబాటులో ఉంటుంది. ఈ వ్యవధిలో బుక్ చేసుకున్న టికెట్లపై ప్రాంతాన్ని బట్టి వచ్చే ఏడాది మార్చి వరకు ప్రయాణించేందుకు అవకాశం ఉంటుంది.

రాకెట్ స్పీడుతో మార్కెట్ ర్యాలీ

- ఇంట్రాడే, ముగింపుల్లోనూ కొత్త రికార్డులు
- సూచీల ర్యాలీకి ఐటీ షేర్ల అండ
- తొలిసారి 66,000పైకి సెన్సెక్స్
- 19,500 ఎగువన నిఫ్టీ



ముంబై: చంద్రుడి వైపు విజయవంతంగా ప్రయాణిస్తున్న ఇస్రో చంద్రయాన్ లాగా.., దేశీయ స్టాక్ సూచీలూ ఆకాశమే హద్దుగా దూసుకెళ్తున్నాయి. సానుకూల ప్రపంచ సంకేతాల అండతో శుక్రవారమూ సూచీలు ఇంట్రాడే, ముగింపులోనూ సరికొత్త రికార్డులు సృష్టించాయి. విదేశీ నిధుల వెల్లువ, ఐటీ రంగ షేర్లలో ర్యాలీ సెంటిమెంట్‌ను మరింత బలోపేతం చేశాయి. భారత టోకు ధరల ద్రవ్యోల్బణం మూడోనెలా దిగిరావడం ఇన్వెస్టర్లకు మరింత ఉత్సాహాన్నిచ్చింది. ఫలితంగా తొలిసారి సెన్సెక్స్ 66,000 స్థాయిపైనా, నిఫ్టీ 19,500 ఎగువన ముగిశాయి. రోజంతా పరిమిత శ్రేణిలో కదలాడిన సూచీలు..., ఆఖరి గంట కొనుగోళ్లతో ఒక్కసారిగా సరికొత్త శిఖరాల వైపు పరుగులు తీశాయి. సెన్సెక్స్ ఉదయం 216 పాయింట్ల లాభంతో 65,775 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 601 పాయింట్లు పెరిగి 66,160 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసి చివరికి 502 పాయింట్ల లాభంతో 66,061 వద్ద ముగిసింది. నిఫ్టీ 79 పాయింట్లు పెరిగి 19,493 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. ట్రేడింగ్‌లో 181 పాయింట్లు ఎగసి 19,595 వద్ద కొత్త ఆల్‌టైం హైని అందుకుంది. మార్కెట్ ముగిసే సరికి 151 పాయింట్ల లాభంతో 19,565 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా షేర్లకు అధిక డిమండ్ లభించడంతో బీఎస్ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు ఒకశాతానికి పైగా ర్యాలీ చేశాయి. వినిమయ, కన్సూమర్, విద్యుత్ రంగాల షేర్లు మాత్రమే అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 11 పైసలు నష్టపోయి 82.16 వద్ద స్థిరపడింది. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 781 పాయింట్లు, నిఫ్టీ 233 పాయింట్లు చొప్పున లాభపడ్డాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- జువెలరీ రిటైల్ సంస్థ సెన్‌కో గోల్డ్ షేరు తొలి రోజే భారీ లాభాలు పంచింది. బీఎస్ఈలో ఇష్యూ ధర (రూ.317)తో పోలిస్తే 36% ప్రీమియంతో రూ.431 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 40% దూసుకెళ్లి రూ.444 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 28% లాభంతో రూ.405 వద్ద ముగిసింది.
- ట్రేడింగ్‌లో ఐటీ షేర్లకు భారీగా డిమాండ్ నెలకొంది. సెన్సెక్స్ 30 షేర్ల జాబితాలో తొలి అయిదు ఈ రంగానివే కావడం విశేషం. టీసీఎస్ (5%), టెక్ మహీంద్రా (4.50%), ఇన్ఫోసిస్ (4.50%), హెచ్‌సీఎల్‌టెక్(4%), విప్రో (3%) షేర్లు రాణించాయి.

ఉత్కర్ష్ ఐపీవో సూపర్ హిట్

ప్రైవేట్ రంగ సంస్థ ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ పబ్లిక్ ఇష్యూ సూపర్ సక్సెస్ సాధించింది. ఇష్యూ చివరి రోజు శుక్రవారానికల్లా 102 రెట్లు అధికంగా స్పందన లభించింది. బ్యాంక్ 12.05 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచగా.. దాదాపు 1,228.5 కోట్ల షేర్ల కోసం బిడ్స్ వెల్లువెత్తాయి. అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల(క్విబ్) విభాగంలో 125 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్లు సైతం 72 రెట్లు అధికంగా దరఖాస్తు చేయడం గమనార్హం!

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్ల జారీ

మెగా విలీనంలో భాగంగా హెచ్‌డీఎఫ్‌సీ వాటాదారులకు ప్రయివేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 311 కోట్లకుపైగా కొత్త షేర్లను జారీ చేసింది. ప్రతీ 25 షేర్లకుగాను 42 బ్యాంక్ షేర్లను తాజాగా కేటాయించింది. వెరసి రూ. 1 ముఖ విలువగల మొత్తం 3,11,03,96,492 బ్యాంక్ షేర్లు హెచ్‌డీఎఫ్‌సీ వాటాదారులకు లభించాయి. ఇవన్నీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టవుతాయని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పేర్కొంది.

టోకు ధరలు మూడోనెలా మైనస్‌లోనే..

- జూన్‌లో మైనస్ 4.12 శాతంగా ప్రతి ద్రవ్యోల్బణం
- ఎనిమిదేళ్ల కనిష్ట స్థాయి
- ఆహార ఉత్పత్తులు, ఇంధన, ప్రాథమిక లోహాల ధరలు డౌన్



న్యూఢిల్లీ: ఆహార ఉత్పత్తులు, ఇంధనం, ప్రాథమిక లోహాల ధరలు తగ్గుదల ప్రభావం మొత్తంగా టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) క్షీణతకు దారితీస్తోంది. క్రూడ్ పెట్రోలియం, సహజ వాయువు, టెక్స్‌టైల్స్ ధరలు కూడా జూలై తగ్గదలను నమోదుచేసుకున్నాయి. ఆయా అంశాల నేపథ్యంలో డబ్ల్యూపీఐ ఆధారిత ద్రవ్యోల్బణం జూన్‌లో అసలు పెరుగుదల లేకపోగా మైనస్ 4.12 శాతంగా నమోదయ్యింది. ఇలాంటి పరిస్థితిని ప్రతి ద్రవ్యోల్బణంగా వ్యవహరిస్తారు. గత ఏడాది జూన్ నెల్లో హై బేస్ ఎఫెక్ట్ (16.23 శాతం) కూడా తాజా ప్రతిద్రవ్యోల్బణం పరిస్థితికి ఒక కారణం. ఈ తరహా పరిస్థితి నెలకొనడం వరుసగా ఇది మూడవ నెల కావడం గమనార్హం. ఇక ఇంతటి స్థాయిలో ప్రతిద్రవ్యోల్బణం ఎనిమిదేళ్ల కనిష్టం కావడం మరో విషయం. 2015 అక్టోబర్లో మైనస్ 4.76 ప్రతిద్రవ్యోల్బణం రికార్డయ్యింది. మేలో 4.3 శాతం ఉన్న వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం జూన్‌లో 4.8 శాతానికి పెరిగిన నేపథ్యంలోనే టోకు ధరలు భారీగా తగ్గడం గమనార్హం. అయితే ఆర్థికవ్యవస్థకు కీలకమైన రెపో (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు– ప్రస్తుతం 6.5 శాతం) రేటు నిర్ణయానికి సెంట్రల్ బ్యాంక్ వినియోగ ధరల సూచీ ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణాన్నే ప్రామాణికంగా తీసుకునే సంగతి తెలిసిందే.

ఎగుమతులు భారీ పతనం

- జూన్‌లో 22 శాతం డౌన్
- మూడేళ్లలో తీవ్ర స్థాయి
- విలువలో 32.97 బిలియన్ డాలర్లు
- దిగుమతులూ 17.48% క్షీణత
- వాణిజ్యలోటు 20 బిలియన్ డాలర్లు



న్యూఢిల్లీ: అంతర్జాతీయ మందగమన ప్రభావం ముఖ్యంగా అమెరికా, యూరోప్ మార్కెట్ల నిరాశావాద ధోరణి భారత్ వస్తు ఎగుమతులు–దిగుమతులపై ప్రభావం చూపుతోంది. జూన్‌లో వస్తు ఎగుమతులు 22 శాతం క్షీణించి 32.97 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. గడచిన మూడేళ్లలో (కరోనా సంక్షోభ సమయం 2020 మే నెల్లో 36.47 శాతం క్షీణత) ఇంత స్థాయిలో వస్తు ఎగుమతుల పతనం ఇదే తొలిసారి. ఇక దిగుమతులు కూడా 17.48 శాతం క్షీణించి 53.10 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. వెరసి ఎగుమతులు దిగుమతుల మధ్య నికర వ్యత్యాసం వాణిజ్యలోటు జూన్‌లో 20.13 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది.

తొలి త్రైమాసికంలో క్షీణతే..

ఇక ఆర్థిక సంవత్సరం తొలి 3 నెలల్లో (ఏప్రిల్, మే, జూన్) చూస్తే వస్తు ఎగుమతులు 15.13 శాతం క్షీణించి 102.68 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దిగుమతులు 12.67%క్షీణించి 160.28 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. వెరసి వాణిజ్య లోటు 57.6 బిలియన్ డాలర్లుగా ఉంది.

విభాగాల వారీగా...

- జూన్‌లో చమురు దిగుమతుల విలువ 33.8 శాతం తగ్గి 12.54 బిలియన్ డాలర్లుగా ఉండగా, ఏప్రిల్–జూన్ మధ్య 18.52 శాతం క్షీణతతో 43.4 బిలియన్ డాలర్లుగా ఉంది.
- పసిడి దిగుమతులు జూన్‌లో 82.38 శాతం పెరిగి 5 బిలియన్ డాలర్లకు చేరింది. ఏప్రిల్–జూన్ త్రైమాసికాన్ని చూస్తే, 7.54 శాతం తగ్గి 9.7 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది.
- జూన్‌లో వెండి దిగుమతులు 94.36 శాతం పడిపోయి 0.79 బిలియన్ డాలర్లకు చేరాయి.
- జూన్ ఎగుమతులకు సంబంధించి 30 కీలక రంగాల్లో 21 క్షీణత నమోదుచేసుకున్నాయి. వీటిలో పెట్రోలియం ఉత్పత్తులు, ప్లాస్టిక్, రెడీమేడ్ దుస్తులు, ఇంజనీరింగ్, రసాయనాలు, రత్నాభరణాలు, తోలు, మెరైన్ ఉత్పత్తులు ఉన్నాయి.
- ఎలక్ట్రానిక్ గూడ్స్ ఎగుమతులు జూన్‌లో 45.36% పెరిగి 2.43%గా నమోదయ్యాయి. ఏప్రిల్–జూన్‌లో ఈ ఎగుమతులు 47% పెరిగి 6.96 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

రూ. 8,200 కోట్లతో మేఘా ఈవీ ప్లాంటు!

బీవైడీతో కలిసి ఏర్పాటు యోచన

meil BYD

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మౌలిక రంగ దిగ్గజం మేఘా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ (ఎంఈఐఎల్) ఎలక్ట్రిక్ వాహనాల తయారీ ప్లాంటు ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది. చైనాకు చెందిన బీవైడీ భాగస్వామ్యంలో తెలంగాణలో ఈ ఫెసిలిటీని స్థాపించాలని నిర్ణయించింది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. కేంద్రం నుంచి గ్రీన్‌సిగ్నల్ లభిస్తే ప్లాంటుకు కావాల్సిన స్థలం, ఇతర సౌకర్యాల కోసం తెలంగాణ ప్రభుత్వాన్ని ఎంఈఐఎల్, బీవైడీ సంప్రదించనున్నాయి. ప్రతిపాదిత ప్రణాళిక కార్యరూపం దాలిస్తే ప్లాంటు కోసం ఇరు సంస్థలు కలిసి సుమారు రూ.8,200 కోట్లు వెచ్చించనున్నాయి. మేఘా అనుబంధ కంపెనీ అయిన ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ఇప్పటికే బీవైడీ సాంకేతిక భాగస్వామ్యంలో ఎలక్ట్రిక్ బస్‌లను తయారు చేస్తోంది. అలాగే తెలంగాణలో ఎలక్ట్రిక్ బస్‌ల తయారీకై 150 ఎకరాల స్థలాన్ని ఒలెక్ట్రా కొనుగోలు చేసింది. అత్యాధునిక రీతిలో ఏటా 10,000 ఈ–బస్‌లను ఉత్పత్తి చేయగలిగే సామర్థ్యంతో ఇది రానుంది. ఎలక్ట్రిక్ టిప్పర్ల తయారీలోకి సైతం ఒలెక్ట్రా ఎంట్రీ ఇచ్చింది. తేలికపాటి వాణిజ్య వాహనాలు, త్రిచక్ర, ఇతర ఎలక్ట్రిక్ వాహనాలనూ పరిచయం చేయాలన్నది కంపెనీ ప్రణాళిక.

తుది దశలో టాటా–విస్ట్రాన్ డీల్



న్యూఢిల్లీ: యాపిల్ ఐఫోన్ల తయారీ సంస్థ విస్ట్రాన్‌కు చెందిన కర్ణాటక ప్లాంటును టాటా గ్రూప్ కొనుగోలు చేసే అంశం తుది దశలో ఉన్నట్లు సమాచారం. అనుబంధ సంస్థ టాటా ఎలక్ట్రానిక్స్ ద్వారా టాటా గ్రూప్ ఈ డీల్‌ను కుదుర్చుకోనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ డీల్ పూర్తయితే యాపిల్ ఐఫోన్లను తయారు చేసే తొలి భారతీయ సంస్థగా టాటా నిలవనుంది. అలాగే, ఈ ప్లాంటులో ఐఫోన్లతో పాటు ఇతరత్రా కొత్త యాపిల్ ఉత్పత్తులను కూడా అసెంబుల్ చేసే అవకాశాలు ఉన్నట్లు సంబంధిత వర్గాలు వివరించాయి. ప్రస్తుతం తైవాన్‌కు చెందిన విస్ట్రాన్‌తో పాటు ఫాక్స్‌కాన్, పెగాట్రాన్ వంటి సంస్థలు యాపిల్ ఉత్పత్తులను తయారు చేస్తున్నాయి.

సాక్షి స్పోర్ట్స్



క్వార్టర్ ఫైనల్లో సింధు, లక్ష్య సేన్

యూఎస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ పీవీ సింధు క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం అమెరికాలో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 12వ ర్యాంకర్ సింధు 21–14, 21–12తో ప్రపంచ 30వ ర్యాంకర్ సుంగ్ షువో యున్ (దక్షిణ కొరియా)పై విజయం సాధించింది. క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 36వ ర్యాంకర్ గావో ఫాంగ్ జి (చైనా)తో సింధు తలపడుతుంది. ముఖాముఖి రికార్డులో సింధు 1–3తో వెనుకబడి ఉంది. మరోవైపు పురుషుల సింగిల్స్ విభాగంలో భారత యువతారలు లక్ష్య సేన్, శంకర్ ముత్తుస్వామి సుబ్రమణియన్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల్లో లక్ష్య సేన్ 21–8, 23–21తో జాన్ లూడా (చెక్ రిపబ్లిక్)పై, శంకర్ ముత్తుస్వామి 21–18, 21–23, 21–13తో మిషా జిల్బెర్మన్ (ఇజ్రాయెల్)పై గెలుపొందారు.



యశ్ ధుల్ సెంచరీ

యూఏఈ 'ఎ'పై భారత్ 'ఎ' విజయం

కొలంబో: ఎమర్జింగ్ కప్ ఆసియా అండర్–23 వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో భారత 'ఎ' జట్టు శుభారంభం చేసింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) 'ఎ' జట్టుతో శుక్రవారం జరిగిన గ్రూప్ 'బి' తొలి లీగ్ మ్యాచ్‌లో భారత 'ఎ' జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. యూఏఈ నిర్దేశించిన 176 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన భారత జట్టు 26.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 179 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ యశ్ ధుల్ (84 బంతుల్లో 108 నాటౌట్; 20 ఫోర్లు, 1 సిక్స్) వీరవిహారం చేశాడు. అజేయ సెంచరీతో భారత 'ఎ' జట్టును గెలిపించాడు. భారత జట్టు 41 పరుగులకు రెండు వికెట్లు కోల్పోయిన దశలో నికిన్ జోస్ (53 బంతుల్లో 41 నాటౌట్; 5 ఫోర్లు)తో కలిసి యశ్ ధుల్ మూడో వికెట్‌కు అజేయంగా 138 పరుగుల భాగస్వామ్యం జోడించాడు. అంతకుముందు యూఏఈ జట్టు 50 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 175 పరుగులు సాధించింది. హర్షిత్ రాణా 41 పరుగులిచ్చి 4 వికెట్లు, ఆంధ్రప్రదేశ్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి 32 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టారు.

సౌత్ జోన్‌కు ఆధిక్యం

రాణించిన విద్వత్, హనుమ విహారి


విద్వత్

బెంగళూరు: డిఫెండింగ్ చాంపియన్ వెస్ట్ జోన్ జట్టుతో జరుగుతున్న దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్ జట్టు భారీ ఆధిక్యం దిశగా సాగుతోంది. ఓవర్‌నైట్ స్కోరు 129/7తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన వెస్ట్ జోన్ మరో 17 పరుగులు జోడించి మిగతా మూడు వికెట్లు కోల్పోయి 146 పరుగులవద్ద ఆలౌటైంది. సౌత్ జోన్ పేస్ బౌలర్ విద్వత్‌కావేరప్ప 53 పరుగులిచ్చి 7 వికెట్లు పడగొట్టాడు. 67 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం పొందిన సౌత్ జోన్ ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు కోల్పోయి 181 పరుగులు సాధించింది. ప్రస్తుతం సౌత్ జోన్ జట్టు ఓవరాల్ ఆధిక్యం 248 పరుగులకు చేరుకుంది. కెప్టెన్ హనుమ విహారి (42; 7 ఫోర్లు), మయాంక్ అగర్వాల్ (35; 7 ఫోర్లు), రికీ భుయ్ (37; 4 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్ ఆడారు.

అల్‌కరాజ్‌తో జొకోవిచ్ 'ఢీ'

వింబుల్డన్ టోర్నీ సెమీఫైనల్స్‌లో వరుస సెట్‌లలో విజయం


జొకోవిచ్


అల్‌కరాజ్

లండన్: రికార్డుస్థాయిలో 24వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ కోసం నొవాక్ జొకోవిచ్... కెరీర్‌లో రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్ కోసం కార్లోస్ అల్‌కరాజ్... ఆదివారం జరిగే వింబుల్డన్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ ఫైనల్లో తలపడనున్నారు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ అల్‌కరాజ్ (స్పెయిన్) గంటా 50 నిమిషాల్లో 6–3, 6–3, 6–3తో ప్రపంచ మూడో ర్యాంకర్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా)పై... డిఫెండింగ్ చాంపియన్, రెండో సీడ్ జొకోవిచ్ (సెర్బియా) 2 గంటల 47 నిమిషాల్లో 6–3, 6–4, 7–6 (7/4)తో ఆరో సీడ్ యానిక్ సినెర్ (ఇటలీ)పై విజయం సాధించారు. జొకోవిచ్ తన కెరీర్‌లో 35వసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఫైనల్ చేరగా... అల్‌కరాజ్‌కిది రెండో గ్రాండ్‌స్లామ్ ఫైనల్ కానుంది. అల్‌కరాజ్ గత ఏడాది యూఎస్ ఓపెన్ టోర్నీలో విజేతగా నిలిచాడు. సినెర్‌తో జరిగిన మ్యాచ్‌లో జొకోవిచ్ 11 ఏస్‌లు సంధించాడు. నెట్ వద్దకు 25 సార్లు దూసుకొచ్చి 17 సార్లు పాయింట్లు గెలిచాడు. 33 విన్నర్స్ కొట్టిన జొకోవిచ్ ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశాడు. తొమ్మిదోసారి వింబుల్డన్ టోర్నీలో ఫైనల్ చేరిన జొకోవిచ్ ఏడుసార్లు విజేతగా నిలిచాడు. మెద్వెదెవ్‌తో జరిగిన మ్యాచ్‌లో అల్‌కరాజ్ నాలుగు ఏస్‌లు సంధించాడు. నెట్ వద్దకు 36 సార్లు దూసుకొచ్చి 28 సార్లు పాయింట్లు నెగ్గాడు. తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయిన ఈ స్పెయిన్ స్టార్ మెద్వెదెవ్ సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేశాడు.

జబర్ X వొండ్రుసోవా

నేడు వింబుల్డన్ మహిళల సింగిల్స్ ఫైనల్
సాయంత్రం గం. 6:30 నుంచి
స్టార్ స్పోర్ట్స్–2లో ప్రత్యక్ష ప్రసారం





కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ కోసం నేడు వింబుల్డన్ మహిళల సింగిల్స్ ఫైనల్లో ఆన్స్ జబర్ (ట్యునీషియా), మర్కెటా వొండ్రుసోవా (చెక్ రిపబ్లిక్) అమీతుమీ తేల్చుకోనున్నారు. 28 ఏళ్ల జబర్ గత ఏడాది వింబుల్డన్, యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో ఫైనల్‌కు చేరి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. మరోవైపు ఓపెన్ శకంలో (1968 తర్వాత) వింబుల్డన్ టోర్నీలో ఫైనల్ చేరిన తొలి అన్‌సీడెడ్ క్రీడాకారిణిగా గుర్తింపు పొందిన 24 ఏళ్ల వొండ్రుసోవా కెరీర్‌లో రెండో గ్రాండ్‌స్లామ్ ఫైనల్ ఆడనుంది. 2019 ఫ్రెంచ్ ఓపెన్‌లో వొండ్రుసోవా ఫైనల్ చేరి రన్నరప్‌గా నిలిచింది. ముఖాముఖి రికార్డులో జబర్, వొండ్రుసోవా 3–3తో సమఉజ్జీగా ఉన్నారు. అయితే ఈ ఏడాది జబర్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల్లోనూ వొండ్రుసోవా గెలుపొందింది. నేడు వింబుల్డన్ ఫైనల్లో విజేతగా నిలిచిన ప్లేయర్‌కు 23 లక్షల 50 వేల పౌండ్లు (రూ. 25 కోట్ల 29 లక్షలు), రన్నరప్ ప్లేయర్‌కు 11 లక్షల 75 వేల పౌండ్లు (రూ. 12 కోట్ల 64 లక్షలు) ప్రైజ్‌మనీగా లభిస్తాయి.

శాసించే స్థితిలో భారత్

- తొలి ఇన్నింగ్స్‌లో 421/5 డిక్లేర్డ్
- 271 పరుగుల భారీ ఆధిక్యం
- రెండో ఇన్నింగ్స్‌లో విండీస్ 27/2


కోహ్లి

రోసీయు (డొమినికా): బ్యాటింగ్‌లో ఆధిక్యం, స్పిన్ బౌలింగ్‌తో ఆధిపత్యం ఇలా మూడో రోజు కూడా భారత్ హవానే కొనసాగింది. దీంతో తొలి టెస్టును శాసించే స్థితిలో టీమిండియా నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 312/2 శుక్రవారం మూడో రోజు ఆట ఆరంభించిన భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 152.2 ఓవర్లలో 421/5 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. యశస్వి జైస్వాల్ (171; 16ఫోర్లు, 1 సిక్స్)కి జోసెఫ్ బౌలింగ్‌లో చుక్కెదురైంది. కోహ్లితో మూడో వికెట్‌కు 110 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. రహానే (3) విఫలమవగా... నింపాదిగా ఆడుతున్న కోహ్లి, జడేజా వచ్చాక అర్ధసెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఈ జోడీ క్రీజులో పాతుకుపోతున్న దశలో కోహ్లి (76; 5 ఫోర్లు) వెనుదిరిగాడు. అనంతరం జడేజా (37 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్), ఇషాన్ (1 నాటౌట్) ఆచితూచి ఆడుతుంటే కెప్టెన్ రోహిత్ ఇన్నింగ్స్ డిక్లేర్ చేశాడు. భారత్‌కు 271 పరుగుల ఆధిక్యం లభించింది. తర్వాత రెండో ఇన్నింగ్స్ ఆడి న విండీస్ టీ విరామ సమయానికి 2 వికెట్ల నష్టానికి 27 పరుగులు చేసింది. ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే ఇంకా 244 పరుగులు చేయాలి.

పారుల్, తజిందర్‌లకు స్వర్ణ పతకాలు



బ్యాంకాక్: ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో మూడో రోజు భారత్‌కు మూడు పతకాలు లభించాయి. ఇందులో రెండు స్వర్ణాలు, ఒక రజత పతకం ఉన్నాయి. మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్ ఈవెంట్‌లో పారుల్ చౌధరీ విజేతగా నిలిచి పసిడి పతకం సొంతం చేసుకుంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన పారుల్ 9 నిమిషాల 38.76 సెకన్లలో గమ్యానికి చేరి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. సుధా సింగ్ (2013, 2017), లలితా బబర్ (2015) తర్వాత ఆసియా చాంపియన్‌షిప్‌లో 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో స్వర్ణం నెగ్గిన మూడో భారతీయ అథ్లెట్‌గా పారుల్ నిలిచింది. మహిళల లాంగ్‌జంప్ ఈవెంట్‌లో ఉత్తరప్రదేశ్‌కే చెందిన 19 ఏళ్ల శైలీ సింగ్ రజత పతకం గెలిచింది. శైలీ సింగ్ 6.54 మీటర్ల దూరం దూకి రెండో స్థానంలో నిలిచింది.

పురుషుల షాట్‌పుట్ ఈవెంట్‌లో తజిందర్‌పాల్ సింగ్ తూర్ తన టైటిల్‌ను నిలబెట్టుకున్నాడు. పంజాబ్‌కు చెందిన 28 ఏళ్ల తజిందర్‌పాల్ ఇనుప గుండును 20.23 మీటర్ల దూరం విసిరి బంగారు పతకాన్ని గెల్చుకున్నాడు. బిలాల్ సాద్ ముబారక్ (ఖతర్), ఘరీబ్ అల్ జిన్‌కావి (కువైట్) తర్వాత ఆసియా చాంపియన్‌షిప్‌లో వరుసగా రెండుసార్లు షాట్‌పుట్ ఈవెంట్‌లో స్వర్ణ పతకాలు నెగ్గిన మూడో అథ్లెట్‌గా తజిందర్‌పాల్ గుర్తింపు పొందాడు. మూడో రోజు పోటీల తర్వాత భారత్ ఐదు స్వర్ణాలు, ఒక రజతం, మూడు కాంస్యాలతో తొమ్మిది పతకాలతో మూడో స్థానంలో ఉంది.



ఆసియా క్రీడలకు భారత క్రికెట్ జట్ల ప్రకటన

మహిళల జట్టులో అనూష, అంజలి శర్వాణి... పురుషుల జట్టులో తిలక్ వర్మకు చోటు


అనూష అంజలి తిలక్ వర్మ

ముంబై: ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత మహిళల, పురుషుల టి20 క్రికెట్ జట్లను శుక్రవారం రాత్రి ప్రకటించారు. 15 మంది సభ్యులుగల భారత మహిళల జట్టుకు హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యం వహిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అంజలి శర్వాణి, బారెడ్డి అనూషలకు టీమిండియాలో చోటు లభించింది. 15 మంది సభ్యులతో కూడిన భారత పురుషుల టి20 జట్టుకు రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. హైదరాబాద్ క్రికెటర్ ఠాకూర్ తిలక్ వర్మ టీమిండియాలోకి ఎంపికయ్యాడు. ఐపీఎల్ టి20 టోర్నీలో రాణించిన రింకూ సింగ్, జితేశ్ శర్మ, ప్రభ్‌సిమ్రన్ సింగ్‌లకు తొలిసారి భారత జట్టులో చోటు దక్కింది. ఆసియా క్రీడలు చైనాలో సెప్టెంబర్ 23 నుంచి అక్టోబర్ 8 వరకు జరుగుతాయి.

భారత మహిళల టి20 జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, రిచా ఘోష్, అమన్‌జోత్ కౌర్, దేవిక వైద్య, అంజలి శర్వాణి, టిటాస్ సాధు, రాజేశ్వరి గైక్వాడ్, మిన్ను మణి, కనిక అహూజా, ఉమా చెత్రి, బారెడ్డి అనూష.

భారత పురుషుల టి20 జట్టు: రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, రాహుల్ త్రిపాఠి, తిలక్ వర్మ, రింకూ సింగ్, జితేశ్ శర్మ, వాషింగ్టన్ సుందర్, షహబాజ్ అహ్మద్, రవి బిష్ణోయ్, అవేశ్ ఖాన్, అర్ష్‌దీప్ సింగ్, ముకేశ్ కుమార్, శివమ్ మావి, శివమ్ దూబే, ప్రభ్‌సిమ్రన్ సింగ్.

డిసెంబర్‌లో దక్షిణాఫ్రికా పర్యటనకు భారత్

ముంబై: స్వదేశంలో వన్డే ప్రపంచకప్ ముగిశాక భారత జట్టు బిజీ బిజీగా గడపనుంది. దక్షిణాఫ్రికాతో పూర్తిస్థాయి పర్యటన కోసం అక్కడికి బయల్దేరనుంది. డిసెంబర్, జనవరి నెలల్లో జరిగే ఈ పర్యటనలో టీమిండియా మూడు టి20లు, మూడు వన్డేలతో పాటు 'గాంధీ–మండేలా ట్రోఫీ' ఫ్రీడమ్ సిరీస్‌లో భాగంగా రెండు టెస్టులు కూడా ఆడుతుంది. ముందుగా డిసెంబర్ 10న తొలి టి20 (డర్బన్), 12న రెండో టి20 (కెబెర్హా), 14న ఆఖరి టి20 (జొహన్నెస్‌బర్గ్)లు జరుగుతాయి. అనంతరం 17న మొదటి వన్డే (జొహన్నెస్‌బర్గ్), 19న రెండో మ్యాచ్ (కెబెర్హా), 21న చివరి మ్యాచ్ (పార్ల్)తో పరిమిత ఓవర్ల సిరీస్ ముగుస్తుంది. టెస్టు సిరీస్‌లో తొలి టెస్టు డిసెంబర్ 26 నుంచి సెంచూరియన్‌లో మొదలవుతుంది. కేప్‌టౌన్‌లో జనవరి 3 నుంచి జరిగే రెండో టెస్టుతో సఫారీ పర్యటన ముగుస్తుంది.

పర్యాటక రంగాభివృద్ధికి కృషి

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- రెండు ఏసీ బస్సులు, మినీ వాహనం ప్రారంభం





బస్సు లోపల పరిశీలిస్తున్న శ్రీనివాస్ గౌడ్

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగం అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తోందని పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ నూతనంగా కొనుగోలు చేసిన రెండు ఏసీ బస్సులు, ఒక మినీ వాహనాన్ని శుక్రవారం రవీంద్రభారతిలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గతంలో రెండు బస్సులను కొనుగోలు చేశామని, ప్రస్తుతం రూ.5 కోట్ల వ్యయంతో మరో రెండు బస్సులను కొనుగోలు చేసినట్లు వివరించారు. హైదరాబాద్ నుంచి తిరుపతి, షిరిడీలకు భద్రతతో కూడిన ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. కాళేశ్వరం, నాగార్జునసాగర్, సోమశిల, ఆదిలాబాద్, వరంగల్ ప్రాంతాలలో 5 పాయింట్లుగా ఈ పర్యాటక బస్సులను నడిపేందుకు త్వరలో ప్రత్యేకమైన విధానాన్ని తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పర్యాటక కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, గీత కార్మికుల సహకార సంస్థ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్, పర్యాటక శాఖ ఎండీ మనోహర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా 16 వేల పీఎంఏవై ఇళ్లు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద రాష్ట్రానికి మరో 16 వేల కొత్త గృహాలను మంజూరు చేసింది. వీటిని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్మించనుంది. ఈ తాజా కేటాయింపులకు సంబంధించి కేంద్రం రూ.80 కోట్ల నిధులను విడుదల చేసింది. రాష్ట్రానికి కేంద్రం ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద 1.75 లక్షల ఇళ్లను మంజూరు చేసింది. వాటికి సంబంధించి మొదటి విడత రూ.1,120 కోట్లు అందాయి. రెండో విడత నిధులు ఇవ్వాల్సిన తరుణంలో, లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయకపోవటాన్ని కేంద్రం తీవ్రంగా తప్పు పట్టిన విషయం తెలిసిందే. లబ్ధిదారుల జాబితానే లేకుండా ఇళ్లను ఎలా కడతారు, ఎవరిని దృష్టిలో పెట్టుకుని నిర్మిస్తారు అంటూ ప్రశ్నించిన కేంద్రం, ఇది నిబంధనలకు విరుద్ధమంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో రెండో విడతలో రావాల్సిన రూ.820 కోట్లు విడుదల చేయలేదు. నిధుల కోసం అధికారులు నానా ప్రయత్నాలు చేసినా కేంద్రం పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో కొన్ని నిధులు పొందే ఉద్దేశంతో అధికారులు కొత్తగా 16 వేల ఇళ్లకు సంబంధించి కేంద్రానికి ప్రతిపాదించారు. దీంతో తాజాగా ఆ ఇళ్లను మంజూరు చేస్తూ, సర్దుబాటు చేసే క్రమంలో రూ.80 కోట్లను విడుదల చేసింది.

ఆపద ఏదైనా అండగా ఉంటాం..

- 149 మంది సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చాం
- నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టప్రకారం చర్యలు
- అగ్నిమాపకశాఖ డీజీ నాగిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: అగ్నిప్రమాదాలే కాకుండా వరద ముంపు నుంచి సైతం ప్రజలను కాపాడేందుకు తాము సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన, అగ్నిమాపక సేవల శాఖ డీజీ వై.నాగిరెడ్డి తెలిపారు. నీటమునిగిన వారిని రక్షించేందుకు తెలంగాణ ఫైర్ సిబ్బందిలోని 149 మందికి ఇండియన్ రెస్క్యూ అకాడమీ బృందంతో.. ప్రత్యేక శిక్షణ ఇప్పించినట్టు చెప్పారు. శుక్రవారం హుస్సేన్‌సాగర్‌లో వాటర్ రెస్క్యూ ఆపరేషన్ టీం డెమో ఆపరేషన్ నిర్వహించింది. రెస్క్యూ ఆపరేషన్లపై అగ్నిమాపకశాఖ సిబ్బంది ఇచ్చిన ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా అగ్నిమాపకశాఖ డీజీ నాగిరెడ్డి మాట్లాడుతూ, గోదావరి పరీవాహక ప్రాంతంలో ఎక్కువగా వరదలకు అవకాశం ఉన్నందున ఆ ప్రాంతాల్లో ఎక్కువ మంది సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. నిబంధనల అతిక్రమణ, ప్రమాదాలు పాత భవనాల్లోనే ఎక్కువగా ఉంటున్నాయని, మాల్స్, చిన్నచిన్న భవనాల్లో సమస్య ఉందని వెల్లడించారు. నిబంధనలు అతిక్రమించినవారిపై తాము చర్యలు తీసుకుంటున్నామని, ఫైర్ సేఫ్టీ సరిగా ఉందో లేదో చూసుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనా ఉంటుందని సూచించారు. అగ్నిప్రమాద సమయాల్లో సేవలందించేందుకు రోబోల అంశంపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, అనుమతులు వస్తే అందుబాటులోకి తెస్తామని చెప్పారు. కార్యక్రమంలో విపత్తుల నిర్వహణశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, హోంశాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, ఇతర ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





వాటర్ రెస్క్యూ ఆపరేషన్ టీం ఆధ్వర్యంలో హుస్సేన్‌సాగర్‌లో శుక్రవారం డెమో ఆపరేషన్ నిర్వహిస్తున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.